www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



హేమంత్ సోరెన్ అరెస్ట్

అక్రమ భూలావాదేవీల కేసులో జార్ఖండ్ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

అరెస్టుకు ముందు ఏడు గంటలకుపైగా ప్రశ్నించిన అధికారులు

ముఖ్యమంత్రి పదవికి హేమంత్ రాజీనామా

జేఎంఎం శాసనసభాపక్ష నేతగా సీనియర్ నేత చంపయ్ సోరెన్

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్‌కు విజ్ఞప్తి.. సమాఖ్యతత్వాన్ని దెబ్బతీస్తున్న బీజేపీ: ఖర్గే

ఈడీ అధికారులపై అట్రాసిటీ కేసు పెట్టిన హేమంత్ సోరెన్

2

గురువారం | 1-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 287 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 2.05 తదుపరి సప్తమి; నక్షత్రం: చిత్త తె. 3.50 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 10.02-11.49; దుర్ముహూర్తం: ఉ. 10.37-11.22, మ. 3.07-3.52; అమృతఘడియలు: రా. 8.43-1.29; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.07 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



డోలీలను చూస్తే..

ఆదిమ సమాజం గుర్తొస్తోంది

గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలపై నివేదిక ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేస్తేనే సమస్యకు పరిష్కారం

పీఎంజీఎస్‌వై నిధులతో రోడ్లు వేయొచ్చుగా!

కేంద్ర, రాష్ట్రాలకు నోటీసులు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు సౌకర్యం లేక.. వైద్య సేవలు అందక గిరిజనులు మృతి చెందుతుండటంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అస్వస్థతకు గురైన గిరిజనులను వైద్యం నిమిత్తం డోలీల ద్వారా తరలిస్తుండటంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇది ఆదిమ కాలం నాటి పరిస్థితులను

మిగతా 12వ పేజీలో...



ఎన్నికలవేళ



బుధవారం సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం

‘స్పెషల్ పర్పస్’

ఆదరాబాదరాగా భారీ భూసంతర్పణ!

ఇంధన సంస్థలకు ఇష్టారాజ్యంగా భూములు

జేఎస్‌డబ్ల్యూ, న్యూ ఎనర్జీలకు ఏకంగా 21,100 ఎకరాలు.. మరికొన్ని సంస్థలకూ వేలల్లోనే!

ఇండోసోల్‌కు గతంలో మెగావాట్‌కు 3 ఎకరాలు.. ఇప్పుడు అదనంగా మరో మూడు ఎకరాలు

ఈనెల 16న నాలుగో విడత వైఎస్సార్ చేయూత

6,100 పోస్టులతో డీఎస్సీ.. కేబినెట్ నిర్ణయాలు

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కారు పెట్టుబడుల ప్రోత్సాహం పేరిట భారీ భూ కుంభకోణానికి తెరతీసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంధన రంగంలో "స్పెషల్ పర్పస్ వెహికల్" (ఎస్పీవీ) పేరిట గతంలో కంటే రెట్టింపు భూములను అస్మదీయ కంపెనీలకు జగన్ ధారాదత్తం చేస్తున్నారు. గతంలో సంప్రదాయ ఇంధనోత్పత్తి సంస్థలకు మెగావాట్‌కు మూడు ఎకరాలు మాత్రమే కేటాయించేవారు. ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ పేరిట.. ఆరు ఎకరాల భూమిని కారు చౌకగా కట్టబెట్టే ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఈ భూములను గతంలో లీజుకు మాత్రమే ఇచ్చేవారు. కానీ.. క్రయవిక్రయాలను నిర్వహించుకునేందుకు పూర్తి స్వేచ్ఛనూ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వంనుంచి భూములు దక్కించుకున్న వెంటనే.. బ్యాంకుల్లో కుదువ పెట్టేందుకు.. విక్రయించేందుకు స్వేచ్ఛ రావడంతో.. ఒక చేత్తో భూములు ప్రభుత్వం నుంచి దక్కించుకుని.. మరో చేత్తో వాటిని

మిగతా 11వ పేజీలో...

‘మెగా’ లేదు దగానే!

ఎన్నికల ముందు జగన్ మెగా డీఎస్సీ హామీ



23 వేల పోస్టులున్నాయని ప్రకటన.. రాగానే అన్నీ భర్తీ చేస్తామని ప్రగల్భాలు

అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం.. ఎన్నికల ముంగిట మళ్లీ డీఎస్సీ నాటకం

ఐదేళ్లు ఆగినా 6,100 పోస్టులకే అనుమతి.. 10 వేలైనా ఇస్తారని ఆశపడిన నిరుద్యోగులు

ఒక్కటీ భర్తీ చేయకుండానే పోస్టులు మాయం.. ఈ ప్రభుత్వంలో పరీక్ష నిర్వహణ కూడా కష్టమే!

11

సరే.. సరే.. చర్చ వద్దులే

జెట్‌స్పీడ్‌లో కేబినెట్ అజెండాకు ఆమోదం

కేబినెట్ సమావేశంలో ముభావంగా జగన్

విద్యుత్ వాడకంపై వివరాలడిగిన మంత్రి

లెంగ్తీ సబ్జెక్ట్.. ఇప్పుడు అది వద్దన్న సీఎం

వైజాగ్ ఇళ్ల స్థలాలపై మంత్రుల ఆరా

అజెండాలో లేదుగా.. చూద్దామన్న సీఎం

5వ తేదీ నుంచి మూడు రోజులు అసెంబ్లీ

అభ్యర్థుల కొరతతో..



అరకొరగా జాబితా

వైసీపీ ఐదో జాబితాలో నలుగురు ఎంపీ, ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు

మళ్లీ తిరుపతి లోక్‌సభకు గురుమూర్తి

నరసరావుపేట నుంచి అనిల్‌కుమార్

మచిలీపట్నంలో సింహాద్రి రమేశ్

సత్యవేడు అసెంబ్లీకి నూకతోటి రాజేశ్

విజయసాయికి అదనంగా గుంటూరు లోక్‌సభ బాధ్యతలు

ఒంగోలు పార్లమెంటరీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

సంతనూతలపాడు, కందుకూరు, కావలికీ ఆయనే

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ అభ్యర్థుల కొరతతో సతమతమవుతోంది. దీంతో కేవలం ఏడుగురితోనే ఐదో జాబితాను బుధవారం రాత్రి విడుదల చేశారు. నాలుగు ఎంపీ స్థానాలకు, మూడు అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ఖరారు చేశారు. తిరుపతి (ఎస్సీ) లోక్‌సభ స్థానానికి అభ్యర్థిగా ప్రకటించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో.. అక్కడ ప్రస్తుత ఎంపీ మద్దిల గురుమూర్తికే అవకాశమిచ్చారు. ఆయన పోటీచేయాలనుకున్న సత్యవేడు (ఎస్సీ) అసెంబ్లీ అభ్యర్థిగా నూకతోటి రాజేశ్‌ను

మిగతా 11వ పేజీలో...

13 ఎంపీ సీట్లు ఖరారు!

11

అభ్యర్థులను నిర్ణయించిన టీడీపీ, సేన.. 11చోట్ల తెలుగుదేశం పోటీ

శ్రీకాకుళంలో రామ్మోహన్, విశాఖలో భరత్, నరసాపురంలో రఘురామ

తిరుపతి-నీహారిక.. బెజవాడ-కేశినేని చిన్ని, జనసేన ఖాతాలో కాకినాడ, బందరు

ముగ్గురు వైసీపీ సిటింగ్‌లకు అవకాశం.. మిగిలిన సీట్లపై కొనసాగుతున్న కసరత్తు

మారుతున్న సమీకరణలతో నెల్లూరు, ఒంగోలు పెండింగ్.. కడపపైనా తర్వాత నిర్ణయం

బాధితులపైనే ఎదురు కేసులు

ప్రశ్నించినందుకు ఎమ్మెల్యేపైనా నమోదు

నిబంధనలకు భిన్నంగా ప్రైవేటు సైన్యంతో తనిఖీలకు వచ్చిన అధికారులపై చర్యలేవీ?

యజమానుల ఫిర్యాదు బుట్టదాఖలు

ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అదుపులోకి

మంగళవారం రాత్రంతా స్టేషన్‌లోనే

బుధవారం ఉదయం కోర్టుకు తరలింపు

మార్టూరు సెంటర్లో భారీగా బలగాలు



మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐతో మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు

మార్టూరులో హైడ్రామా

అర్ధరాత్రి గ్రానైట్ యజమానుల అరెస్టు

మార్టూరు/బాపట్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా మార్టూరులో మంగళవారం రాత్రి నుంచి హైడ్రామా నడిచింది. బాధితులైన గ్రానైట్ యజమానులపైనే పోలీసులు ఎదురు కేసులు పెట్టి అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారిని రాత్రంతా స్టేషన్‌లో ఉంచి బుధవారం ఉదయం అద్దంకి కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం వైసీపీ గూండాలతో కలిసి తనిఖీలకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. విజిలెన్సు అధికారులపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఆరుగురు గ్రానైట్ పరిశ్రమ యజమానులను

మిగతా 3వ పేజీలో...

శతాబ్దాల కల సాకారం



పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముర్ము

అయోధ్యలో రామ మందిరం నిర్మించాం

దేశాన్ని 5 బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిపాం.. పదేళ్లలో ఎన్నో విజయాలు సాధించాం

ఉగ్రవాదం, విస్తరణవాదానికి దీటుగా బదులిచ్చాం

‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’ నినాదంతో ముందుకు

తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ

పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 31: అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించాలని కొన్ని శతాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్నారని.. వారి కల ఇప్పుడు సాకారమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. గతంలో బలహీన ఆర్థిక వ్యవస్థలు కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా ఉన్న భారత్.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా ప్రపంచంలోనే బలమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె పార్లమెంటుకు వచ్చే సమయంలో కొత్త సంప్రదాయానికి తెర తీశారు. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలు ముందు నడవగా.. వారి కంటే ముందు అధికారులు ‘రాజదండం(సెంగోల్)’ను పట్టుకొని నడిచారు. రాష్ట్రపతి వస్తున్న సమయంలో పలువురు సభ్యులు ‘భారత్ మాతాకీ జై’, ‘జై శ్రీరామ్’, ‘జై జగన్నాథ్’ అంటూ నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఉభయసభలను

మిగతా 2వ పేజీలో...

నేడే మధ్యంతర బడ్జెట్

గెలిచాక పూర్తిస్థాయి బడ్జెట్



ఆ ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి

పార్లమెంటులో గొడవ చేసే వారిని ఎవరూ గుర్తుపెట్టుకోరు: మోదీ

జగనన్న కాలనీ కోసం తన నియోజకవర్గ కేంద్రంలో 25 ఎకరాల భూమిని ఎకరా రూ.20 లక్షల చొప్పున ఆ ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. కానీ ప్రభుత్వం చెల్లించిన ధర ఎకరాకు రూ.45 లక్షలు. ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున ఎమ్మెల్యే ఖాతాలోకి వెళ్లాయన్న ఆరోపణలున్నాయి.

అవినీతి భానుడు!

కృష్ణాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్‌లో కోట్లకు పడగలు

పేకాట శిబిరాలతో రెండు చేతులా ఆదాయం

బెల్టుషాపులు నడుపుతున్న అనుచరులు

జోరుగా గంజాయి అమ్మకాలు..

భారీగా క్రిమినల్ కేసులున్నా టీడీపీ పదవి

మితిమీరిన కుటుంబసభ్యుల పెత్తనం

హత్యలదాకా వెళ్లిన మట్టి అక్రమ రవాణా

ఈ కేసులో ఎమ్మెల్యే వియ్యంకుడిపై ఆరోపణలు

రైతు బజార్ల నుంచి దండుకుంటున్న సతీమణి



చిల్లర డబ్బులను కూడా వదలకుండా దండుకుంటారని ఆ ఎమ్మెల్యే కుటుంబం గురించి చెబుతారు. నియోజకవర్గ కేంద్రంలోని రైతు బజారులో దుకాణాల నుంచి ఎమ్మెల్యే సతీమణి మామూళ్లు వసూలు చేస్తుంటారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు భగ్గుమన్న సమయంలో చిత్తూరు నుంచి వాటిని తెప్పించి సొంత మనుషులతో రైతుబజారులో అమ్మించి సొమ్ము చేసుకున్నారు. టీటీడీ సభ్యునిగా ఉన్న భర్త నుంచి తిరుమలలో దర్శనం, వసతులకు లెటర్లు ఇప్పించడానికీ డబ్బులు వసూలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఏ పని కావాలన్నా ఆ ఎమ్మెల్యే కన్నా ముందు ఆయన సతీమణి దర్శనం చేసుకోవాలని చెబుతారు. అధికారుల పోస్టింగ్‌లు సైతం ఆమె కనుసన్నల్లోనే నడుస్తుంటాయి.

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

ఆయనపై ఐపీసీ సెక్షన్ 506 కింద (నేరపూరిత బెదిరింపులు) నాలుగు కేసులు, సెక్షన్ 384 కింద (దోపిడీకి పాల్పడే క్రమంలో వ్యక్తిని భయభ్రాంతులకు గురిచేయడం) కింద మూడు కేసులు, సెక్షన్ 365 కింద (కిడ్నాప్) మరో మూడు కేసులు ఉన్నాయి. ఇవి కాక చిన్నచితకా కేసులు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. 2019 ఎన్నికల అఫిడవిట్‌లో స్వయంగా ఆయనే చెప్పుకొన్న వివరాలివీ. ఇవన్నీ కోర్టుల్లో వివిధ దశల్లో విచారణలో ఉన్నాయి. ఏ కేసులోనూ శిక్ష పడకపోవడంతో నిబంధనల ప్రకారం ఆయన ప్రజాప్రతినిధిగా ఎన్నికై పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆయనను ఏకంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన

మిగతా 12వ పేజీలో...

మమ్మల్ని ముంచేస్తారా?

ఎన్నికల ముందు ఎందుకీ టెండర్?

మైనింగ్ అధికారులను నిలదీసిన కంపెనీలు

బెరైటీస్ టెండర్లలో పాల్గొనలేమని స్పష్టీకరణ

కొత్త సర్కారు టెండర్లు రద్దుచేస్తే పరిస్థితేంటి?

90 కోట్ల డిపాజిట్ ఫ్రీజ్ చేస్తే మాకు తంటాలే

బిడ్ల దాఖలుకు కాంట్రాక్టర్లు ససేమిరా

మళ్లీ మన ప్రభుత్వమే.. భరోసా ఇచ్చేందుకు గనుల శాఖ ఉన్నతాధికారి యత్నం

అయితే వచ్చాకే టెండర్లు పిలవండి: కంపెనీలు

12

‘జ్ఞానవాపి’లో పూజలు చేసుకోవచ్చు

హిందువులకు వారాణసీ కోర్టు అనుమతి

2

ఆ ఎమ్మెల్యే గాయబ్!

నెలన్నరగా కనిపించని ఆచూకీ

సొంత నియోజకవర్గానికి దూరం

‘డబ్బుల్లేవ్, పోటీ చేయను’ అని వైసీపీ పెద్దలకు వర్తమానం

గతంలో టీడీపీలోనూ ఇదే వ్యూహం

ఆర్థిక సమస్యలా.. ఓటమి భయమా?

11

జస్టిస్ మహేశ్వరి కుమార్తె పెళ్లి

ధర్మారెడ్డి, వేమిరెడ్డి హాజరు

వధూవరులకు టీటీడీ పండితుల ఆశీర్వచనం

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి కుమార్తె డాక్టర్ దీక్ష వివాహానికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ వేడుక జరిగింది. టీటీడీకి చెందిన వేద పండితులు

మిగతా 12వ పేజీలో...



బుధవారం ఇండోర్‌లో జరిగిన జస్టిస్ జేకే మహేశ్వరి కుమార్తె వివాహంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి... ఆశీర్వచనం ఇస్తున్న టీటీడీ వేద పండితులు.

శివయ్య సన్నిధిలో ‘సిద్ధమా’?

శ్రీశైలాన్ని తాకిన జగన్ ప్రచార పిచ్చి.. నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు



శ్రీశైలం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన జగన్ ఫ్లెక్సీలు

చట్టాలంటే గౌరవంలేదు. ప్రజలంటే లెక్కలేదు. చివరికి... దేవుడన్నా భక్తీ, భయం లేనే లేవు! ఇదీ వైసీపీ నేతల వైఖరి. జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం ఆలయానికి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి రాజకీయ ప్రచార చిత్రాలు, ఫ్లెక్సీలు ప్రదర్శించవద్దు. ఈ క్షేత్రంలో

మిగతా 2వ పేజీలో...

ఈ నేల మాది.. మీరే వెనక్కు వెళ్లిపోండి!

లద్దాఖ్‌లో ఎల్‌ఏసీ వద్ద చైనా సైనికులను బెదరగొట్టిన భారత గొర్రెల కాపర్లు

న్యూఢిల్లీ, జనవరి 31: తూర్పు లద్దాఖ్‌లో భారతదేశ సరిహద్దు ప్రాంతంలో స్థానిక గొర్రెల కాపర్లు అసాధారణ ధైర్య సాహసాలను ప్రదర్శించారు. తమ దేశ భూభాగంలోకి రావొద్దని, గొర్రెలను మేపవద్దని అడ్డుపడిన చైనా సైనికులకు ఎదురొడ్డి నిలిచారు. "ఇది మా దేశం. ఈ నేలపై మాకే హక్కు ఉంది. అడ్డుకుంటే రాళ్లతో కొట్టడానికైనా వెనుకాడబోం" అంటూ వాళ్లను బెదరగొట్టారు. జనవరి 2న భారత సరిహద్దుకు కిలోమీటరు లోపల కాక్‌జంగ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని లద్దాఖ్‌లోని చుషల్ ప్రాంత కౌన్సిలర్ కోన్‌చోక్ స్టాన్‌జిన్ వెల్లడించారు. గొర్రెల కాపర్లు చైనా సైనికులతో వాగ్వివాదానికి దిగిన వీడియోను మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆరున్నర నిమిషాలు ఉన్న ఈ వీడియోలో.. గొర్రెల కాపర్లు టిబెటన్ భాషలో చైనా సైనికులతో గొడవపడటం కనిపించింది. కొద్ది సేపటి తర్వాత వారు అక్కడున్న రాళ్లను చేతుల్లోకి తీసుకోవడం, విసరడం కూడా ఉంది. వీడియోలో చైనా సైనిక వాహనం కూడా కనిపించింది. అయితే, అక్కడ భారత సైనికులు ఎవరూ లేకపోవడం గమనార్హం.



చైనా సైనికులతో గొర్రెల కాపర్ల వాగ్వివాదం

జనవరి 12న భారత అధికారుల సందర్శన

కాక్‌జంగ్ ప్రాంతం లద్దాఖ్‌లోని న్యోమా నియోజకవర్గం కిందకు వస్తుందని స్టాన్‌జిన్ తెలిపారు. జనవరి 2న ఘటన జరిగిన రోజు చైనా సైనికులు.. కాక్‌జంగ్ తమ దేశ భూభాగమని, భారత గొర్రెల కాపర్లను వెనక్కు వెళ్లాలంటూ హెచ్చరించారని పేర్కొన్నారు. 35, 36వ పెట్రోలింగ్ పాయింట్ల వద్ద ఈ ఘటన జరిగిందని తెలిపారు. జనవరి 12న స్థానిక సర్పంచ్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేటు, భారత సైనికులు, ఐటీబీపీ అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు చెప్పారు. ఈ సమస్య అక్కడితోనే పరిష్కారమైందన్నారు. చలికాలంలో కాక్‌జంగ్‌లో గొర్రెలకు మేత బాగా దొరుకుతుందని స్థానికులు తెలిపారు. 2019లో ఒకసారి గొర్రెలను మేపడానికి వెళ్లినప్పుడు కూడా చైనా సైన్యం గొర్రెల కాపర్లను అడ్డుకుందని గుర్తు చేశారు. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులైన సంగతి తెలిసిందే.

భారత సైనికులు అక్కడ ఎందుకు లేరు?

తాజా వీడియోపై కాంగ్రెస్ స్పందించింది. సరిహద్దుల్లో అంతా ప్రశాంతంగానే ఉందన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటనలు అంతా బూటకమేనని ఆరోపించింది. సరిహద్దుల్లో చైనా చొరబాట్లను మోదీ దాస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. తమ ఆరోపణలకు తాజా వీడియో ఓ నిదర్శనమన్నారు. ఘటన భారత భూభాగానికి కిలోమీటరు లోపల జరిగితే.. అక్కడ భారత సైనికులు ఎందుకు లేరని, పెట్రోలింగ్ పాయింట్ల నుంచి ఎందుకు వెనక్కు వచ్చారని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

లోకం తీరు



మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక
పూర్తి స్థాయి బడ్జెట్



న్యూఢిల్లీ, జనవరి 31: ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ సారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నామని, తిరిగి మళ్లీ బీజేపీ నేతృత్వంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని ప్రధాని మోదీ చెప్పారు. తద్వారా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు కార్యకలాపాలను తరచూ అడ్డుకునే ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని మోదీ సూచించారు. పార్లమెంటులో గొడవ సృష్టించే, అంతరాయం కలిగించే ఎంపీలను వారి సొంత నియోజకవర్గ ప్రజలే గుర్తుపెట్టుకోరన్నారు. బుధవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మోదీ మీడియాతో మాట్లాడారు. 'రామ్ రామ్' అంటూ పాత్రికేయులను పలకరించారు. గత పార్లమెంటు సమావేశాల్లో సభకు అంతరాయం కలిగించారంటూ ఉభయ సభల్లో కలిపి రికార్డు స్థాయిలో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. వారిని టార్గెట్ చేస్తూ మోదీ వ్యాఖ్యలు చేశారు. వారు ప్రజాస్వామిక విలువలను అవమానిస్తున్నారని విమర్శించారు. మోదీ విమర్శలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒక ప్రకటనలో ఘాటుగా స్పందించారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హరిస్తోందని, నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత సమావేశాల్లో 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత ప్రభుత్వం కేవలం మూడు రోజుల్లో 14 బిల్లులను ఆమోదించిందని గుర్తుచేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించడం సంప్రదాయమని, కానీ డిప్యూటీ స్పీకర్ లేకుండానే ప్రస్తుత లోక్‌సభ ఐదేళ్ల టర్మ్ ముగుస్తోందని, ఇది మోదీ నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు.





మంగళగిరి మెయిన్ బజారులో దుకాణాలను మూసివేసి వైసీపీ జెండాలు కట్టిన వైనం

టిప్పర్ల బజారు వద్ద హైటెన్షన్ వైర్లకు వేలాడుతున్న వైసీపీ జెండా

వైసీపీ సైకో చేష్టలు.. ప్రజలకు పాట్లు

- సాధికార సభ కోసం దుకాణాల మూసివేత
- అడ్డగోలుగా జెండాలు, ఫ్లెక్సీలు.. జనాలపైకి టపాసులు

మంగళగిరి సిటీ, జనవరి 31: వైసీపీ శ్రేణుల సైకో చేష్టలతో గుంటూరు జిల్లా మంగళగిరి ప్రజలు విసుగెత్తిపోయారు. వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం మంగళగిరికి చేరుకుంది. సాధికార సభను మంగళగిరి పాత కూరగాయల మార్కెట్ సమీపంలోని వీటీజేఎం కళాశాల ఎదురుగా ఏర్పాటు చేశారు. సాధారణంగానే ఈ ప్రాంతంలో విపరీతమైన రద్దీ ఉంటుంది. దీంతో ఇక్కడ సభ ఏర్పాటుపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ, ఒకరోజు ముందుగానే పోలీసులు వచ్చి బుధవారం దుకాణాలు తెరువరాదంటూ ఆదేశించారని వ్యాపారులు తెలిపారు. సాధికార యాత్ర బస్సు ప్రయాణించే మార్గాన్ని పూర్తిగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, వైసీపీ జెండాలతో నింపేశారు. ప్రధాన వీధుల్లో భారీ జెండాల ఏర్పాటుతో అవి గాలికి తెగిపడి హైటెన్షన్ వైర్లను తాకుతూ ప్రమాద ఘంటికలను మోగించాయి. తొలుత బస్టాండు సెంటరులోని వైఎస్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన యాత్ర ర్యాలీ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. బుల్లెట్ వాహనాలతో భారీ శబ్దం చేస్తూ వైసీపీ కార్యకర్తలు హంగామా సృష్టించారు. బాణసంచాను ఇష్టానుసారం కాల్చుతూ ప్రజల మీదకు వదిలారు. ఇంత చేసినా అధికార పార్టీ విషయంలో పోలీసులు మిన్నకుండి పోయారు. కనీసం రెండు వేల మంది కూడా సభకు హాజరుకాలేదు.

10 మంది పనికిమాలిన వెధవలతో వైఎస్ఆర్ బిడ్డనంటూ ఏపీకి వచ్చింది: నాని

గుడివాడ, జనవరి 31: 'తెలంగాణాలో పరువు పోగొట్టుకుంది. పది మంది పనికిమాలిన వెధవలను వెంటబెట్టుకుని రాజశేఖర్‌రెడ్డి బిడ్డనంటూ ఏపీకి వచ్చి వచ్చింది. ఏమి చేద్దామని పాకులాడుతుందో షర్మిల చెప్పాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. గుడివాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కుటుంబ తగాదాలుంటే వ్యక్తిగతంగా మాట్లాడుకొని సరిచేసుకోవాలి. కేవలం రాజకీయ లబ్ధికోసమే షర్మిల జగన్‌పై నిందలు మోపుతున్నారు. షర్మిల పాదయాత్ర చేసిన 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాలేదు. 2019 ఎన్నికల్లో షర్మిల వైసీపీ కోసం ప్రచారం చేయలేదు.' అని కొడాలి నాని పేర్కొన్నారు.

ఇసుక తవ్వకాలపై కోర్టుకెళ్లామని బెదిరింపులు

- హైకోర్టుకు తెలిపిన పిటిషనర్ తరపు న్యాయవాది

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై పిటిషన్ వేసిన వ్యక్తిని పోలీసులు బెదిరిస్తున్నారని ఆయన తరపు న్యాయవాది హైకోర్టు దృష్టికి తెచ్చారు. పిటిషనర్‌ను ఎస్పీ కార్యాలయానికి పిలిపించి, బెదిరించి.. తెల్ల కాగితంపై సంతకం తీసుకున్నారని న్యాయమూర్తులకు తెలిపారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చిన తరువాత కూడా రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజ్ సమీపంలో ఇసుక అక్రమ మైనింగ్, తరలింపు జరగుతూనే ఉందని న్యాయవాది నర్రా శ్రీనివాస్ తెలిపారు. వీడియో ఆధారాలను కోర్టు ముందు ఉంచుతామన్నారు. ఎస్పీ సమర్పించిన నివేదికపై రిప్లై వేసేందుకు సమయం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వివరాలు పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్, టర్న్ కీ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు విచక్షణారహితంగా ఇసుక తవ్వుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ జి.వంశీ దినేష్‌రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యం విచారణకు రాగా ఇసుక అక్రమ తవ్వకాలను నిలువరించాలని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్పీని హైకోర్టు ఆదేశించింది. నివేదికను కోర్టు ముందు ఉంచాలని ఇరువురి అధికారులకు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

వేసవి నాటికి ఎల్‌నినో బలహీనం

విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో దుర్భిక్షం, వడగాడ్పులు, విపత్తులకు కారణమైన ఎల్‌నినో ఈ వేసవి నాటికి బలహీనపడనుంది. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడనున్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి దేశంలో వాతావరణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం బులెటిన్ విడుదల చేసింది. ఈ నెలలో దేశంలో చలి తగ్గుతుందని.. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని అంచనా వేసింది. ఏపీ, తమిళనాడు, ఒడిశా, రాజస్థాన్, గుజరాత్ మినహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ నెలలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది. ఇంకా దక్షిణాదిలో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదు కానుందని తెలిపింది.

నీట్ పీజీ పరీక్ష ఫీజు రూ.750 తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 31: వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు (ఎండీ, ఎంఎస్)ల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్-పీజీ పరీక్ష రుసుమును తగ్గించారు. అన్ని వర్గాల అభ్యర్థులకు ఫీజును రూ.750 తగ్గించామని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్ (ఎన్‌బీఈఎంఎస్) ప్రకటించింది. జనరల్, ఓబీసీ కేటగిరీ అభ్యర్థుల నుంచి ఇప్పటిదాకా పరీక్ష ఫీజు కింద రూ.4,250 వసూలు చేశారు. ప్రస్తుత నిర్ణయంతో ఆ మెత్తం రూ.3,500కు తగ్గింది. అలాగే ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఇన్నాళ్లూ రూ.3,250 చెల్లించేవారు. ఇప్పుడు వారు చెల్లించాల్సిన ఫీజు రూ.2,500కు తగ్గింది.

శివయ్య సన్నిధిలో 'సిద్ధమా'?

(మొదటి పేజీ తరువాయి)

శివపార్వతులు మాత్రమే కనిపించాలి. ఈ నిబంధనను ఉల్లంఘించేందుకు ఇప్పటిదాకా ఎవరూ సాహసించలేదు. కానీ... ఇప్పుడు శ్రీశైలంలో జగన్ ఫ్లెక్సీలు ప్రత్యక్షమయ్యాయి. అదికూడా.. ప్రధాన ఆలయానికి అరకిలో మీటరు దూరంలోని శ్రీశైలం బస్టాండు ఆవరణలో! బుధవారం రాత్రి ఇక్కడ మూడు 'సిద్ధం' ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లికార్జునుడి దర్శనానికి వస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే వైసీపీ నేతలు హడావుడిగా జగన్ ఫ్లెక్సీలు పెట్టినట్లు భావిస్తున్నారు. - శ్రీశైలం

శతాబ్దాల కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించి మాట్లాడుతూ.. కొత్త పార్లమెంట్‌లో ఇదే తన తొలి ప్రసంగమన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. గత ఏడాది మన దేశం ఎన్నో ఘనతలు సాధించిందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని, ఆదిత్య ఎల్-1 విషన్‌ను విజయవంతంగా ప్రయోగించిందని తెలిపారు. జీ20 సమావేశాలను ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. ఆసియా క్రీడల్లో తొలిసారి 107, పారా క్రీడల్లో 111 పతకాలను సాధించామని చెప్పారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేలా 'నారీశక్తి వందన్ అధినియమ్' బిల్లును ఆమోదించుకున్నామని, ముస్లిం మహిళల కోసం 'ట్రిపుల్ తలాక్'కు వ్యతిరేకంగా కఠిన చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకొంటున్నామని, తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటు కానుందని గుర్తుచేశారు. ఆదివాసీ యోధులను స్మరించుకోవడం గర్వకారణంగా ఉందని తెలిపారు.



ఆర్థికశాఖ సహాయ మంత్రులు, అధికారుల బృందంతో నిర్మల

పేదరికాన్ని పారదోలుతున్నాం..

చిన్నతనం నుంచీ 'గరీబీ హఠావో' నినాదాన్ని వింటున్నామన్న రాష్ట్రపతి.. జీవితంలో తొలిసారి పేదరికాన్ని పెద్ద ఎత్తున పారదోలడం చూస్తున్నామని చెప్పారు. గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చామని, 'ఏక్ భారత్.. శ్రేష్ఠ్ భారత్' నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. యూపీ, తమిళనాడులో రక్షణ కారిడార్లు ఏర్పాటయ్యాయని.. రక్షణ రంగ ఉత్పత్తులు భారత్‌లో తయారవడం గర్వకారణమని తెలిపారు. 'ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా' మన బలాలుగా మారాయన్నారు. కరోనా, యుద్ధం వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలపై భారం పడకుండా చూసుకున్నామని పేర్కొన్నారు.

వారికి దీటుగా బదులిచ్చాం..

రైతులకు లాభాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ ద్వారా 10 కోట్ల మందికి పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. రూ.7 లక్షల ఆదాయం వరకు పన్ను లేకుండా చేశామని, సామాన్యులపై భారం పడకుండా పన్ను సంస్కరణలు చేపట్టామని వివరించారు. పీఎం ఆవాస్ యోజన ద్వారా 4.10 కోట్ల మందికి పక్కా ఇళ్లు నిర్మించామని, పదేళ్లలో వేల ఆదివాసీ గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని.. 2 కోట్ల మంది మహిళలు స్వయం సమృద్ధి సాధించారని చెప్పారు. యువశక్తి, నారీశక్తి, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపై దేశాభివృద్ధి ఆధారపడి ఉందని విశ్వసిస్తున్నామని తెలిపారు. సరిహద్దుల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఉగ్రవాదం, విస్తరణవాదానికి మన దళాలు గట్టిగా బదులిస్తున్నాయని పరోక్షంగా పాక్, చైనాలకు చురకలు అంటించారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో సురక్షిత పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సౌర విద్యుదుత్పత్తిలో మన దేశం ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచిందని చెప్పారు.

న్యూఢిల్లీ, జనవరి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. మోదీ 2.0 ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఆర్థిక మంత్రిగా వరుసగా ఆరోసారి నిర్మల బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుత లోక్‌సభకు ఇదే చివరి బడ్జెట్ అయినందు వల్ల ఎలాంటి ప్రకటనలు వెలువడుతాయన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఈ మధ్యంతర బడ్జెట్ లేదా ఓటాన్ అకౌంట్‌లో దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు ఎన్నికలపరంగా ముఖ్యమైన రైతులు, మహిళలకు సంబంధించిన ప్రకటనలు ఉండవచ్చన్న అంచనాలున్నాయి.

నేడే మధ్యంతర బడ్జెట్

లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. కాగా, నిర్మల ఈసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ నెలకొల్పిన రికార్డును సమం చేయనున్నారు. 2019 జూలై నుంచి ఐదుసార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌ను నిర్మల ప్రవేశపెట్టారు. గురువారం ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌తో ఆమె వరుసగా ఐదుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన గత ఆర్థిక మంత్రులు మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హాల రికార్డులను అధిగమించనున్నారు. మొరార్జీ దేశాయ్ 1959-1964 మధ్య ఆర్థిక మంత్రిగా ఐదు వార్షిక బడ్జెట్‌లు, ఒక మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తంగా ఆయన పది బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు.

'జ్ఞాన్‌వాపీ'లో పూజలు చేసుకోవచ్చు

- హిందువులకు వారాణసీ కోర్టు అనుమతి

వారాణసీ, జనవరి 31: జ్ఞాన్‌వాపీ వివాదం కేసులో హిందూ వర్గానికి భారీ ఊరట లభించింది. ఈ మసీదు సముదాయంలో ఇంతకుముందు మూసివేసిన బేస్‌మెంట్ 'వ్యాస్ కా టెఖానా'లో ఉన్న దేవతామూర్తులకు పూజలు చేసుకొనేందుకు వారాణసీ కోర్టు అనుమతించింది. కాశీ విశ్వనాథ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కడ పూజలు నిర్వహించాలని స్పష్టం చేసింది. పూజల నిర్వహణ నిమిత్తం పూజారి ప్రవేశానికి వీలుగా అక్కడి బ్యారికేడ్లను తొలగించాలని, వారం రోజుల్లోగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని బుధవారం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా వేసింది. అప్పటిలోగా అంజుమన్ ఇంతేజామియా మస్జిద్ (జ్ఞానవాపి మసీదు నిర్వహణ కమిటీ) సహా ప్రతివాదులకు అభ్యంతరాలు తెలియజేయడానికి అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేయాలని మసీదు కమిటీ భావిస్తోంది. జ్ఞాన్‌వాపీ మసీదు ప్రాంగణంలో 'శివలింగం' దొరికిందని భావిస్తున్న స్థలంలో సర్వే జరిపించేందుకు అనుమతించాలని కోరుతూ సుప్రీంకోర్టులో నలుగురు మహిళలు వ్యాజ్యం దాఖలు చేసిన నేపథ్యంలో తాజా తీర్పు వెలువడటం గమనార్హం. జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లో శృంగార గౌరి, ఇతర దేవతామూర్తులను పూజించడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆచార్య వేదవ్యాస్ పీఠం ప్రధాన పూజారి శైలేంద్ర కుమార్ పాఠక్ వ్యాస్ 2023 సెప్టెంబరు 25న పిటిషన్ దాఖలు చేశారు. 1993లో సెల్లార్‌ను అధికారులు మూసివేసే వరకూ తన తాతగారైన సోమనాథ్ వ్యాస్ అక్కడ పూజాదికాలు చేసేవారని, ఆయన శివైక్యం చెందిన నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ పూజలు చేసే హక్కు తనకు కల్పించాలని శైలేంద్ర కోరారు. అయితే సెల్లార్ మసీదు సముదాయంలో భాగమని అందువల్ల అక్కడ పూజలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వరాదని ముస్లింల తరఫు న్యాయవాది వాదించారు.

మార్చి 6 నుంచి హెచ్-1బీ వీసాల ప్రక్రియ

వాషింగ్టన్, జనవరి 31: అమెరికా హెచ్-1బీ దరఖాస్తు ప్రక్రియకు ముహూర్తం నిర్ణయించారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది మార్చి 6వ తేదీ నుంచి హెచ్-1బీ వీసాల దరఖాస్తులు స్వీకరించనున్నట్టు యూఎస్ ఫెడరల్ ఏజెన్సీ తెలిపింది. వార్షిక లాటరీ విధానంలో భారీ మార్పులు తీసుకువచ్చినట్టు పేర్కొంది. ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా.. వాటన్నింటినీ పాస్‌పోర్టు ఆధారంగా ఒకే దరఖాస్తుగా పరిగణించనున్నట్టు తెలిపింది. దీనివల్ల నకిలీలను గుర్తించడం, మోసాలను కట్టడి చేయడం వంటివి సులువవుతుందని ఫెడరల్ ఏజెన్సీ పేర్కొంది. ఎవరైనా ఒక వ్యక్తి వివిధ కంపెనీల్లో పనికోసం.. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు పెట్టినట్టయితే.. వాటిని పాస్‌పోర్టు నెంబరు ఆధారంగా ఒకే దరఖాస్తుగా పరిగణించనున్నారు. నకిలీలను అరికట్టే ప్రధాన లక్ష్యంతో నూతన విధానాన్ని తీసుకువచ్చినట్టు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం(యూఎస్‌సీఐఎస్) తెలిపింది. దీంతో అర్హులైన దరఖాస్తు దారులందరికీ అవకాశం కల్పించాలని నిర్ణయించినట్టు పేర్కొంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచి వీసా మంజూరు వరకు అన్నీ ఎలక్ట్రానిక్ విధానంలో జరుగుతాయని యూఎస్‌సీఐఎస్ వివరించింది. దరఖాస్తు దారులు ఖచ్చితంగా యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ అకౌంట్‌లో రిజిస్టర్ చేసుకుని.. తర్వాత ప్రక్రియ ప్రారంభించాలని, చెల్లింపులు కూడా దాని నుంచే చేయాలని సూచించింది. కంపెనీలకు సంబంధించి మాత్రం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఫిబ్రవరి 28నే ప్రారంభించనున్నట్టు తెలిపింది. వీసాల జారీ ప్రక్రియ అక్టోబరు 1 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొంది.

'వికసిత్' నినాదం!

- ప్రతి పంచాయతీలో వినిపిస్తున్న మోదీ స్వరం
- దేశవ్యాప్తంగా 'వికసిత్ భారత్ సంకల్ప' శిబిరాలు
- 17 కేంద్ర పథకాలపై ప్రచారం, దరఖాస్తుల స్వీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అది.. రాజస్థాన్‌లో జైసల్మేర్ జిల్లాలోని ఖుడీ గ్రామం! థార్ ఎడారిలో... ఇసుక తప్ప మరేదీ కనిపించని చిన్న ఊరు! అక్కడే... పాఠశాల ఆవరణలో సందడి వాతావరణం! ఎల్ఈడీ డిస్‌ప్లే అమర్చిన వ్యాన్ ఒకటి అక్కడ సిద్ధంగా ఉంది! తెరపై ప్రధాని మోదీ ప్రత్యక్షమయ్యారు! 'ఇది మోదీ గ్యారెంటీ! మోదీ గ్యారెంటీ అంటే... గ్యారెంటీని నిలబెట్టుకుని తీరతామని ఇస్తున్న గ్యారెంటీ' అంటూ భావోద్వేగ ప్రసంగం! వివిధ రంగాల్లో 2014తో పోల్చితే ఇప్పటికి సాధించామంటున్న ప్రగతిపై గణాంకాల ప్రదర్శన! ఇదీ అక్కడి దృశ్యం! ఇది ఆ ఒక్క గ్రామానికే పరిమితం కాదు! దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని, అన్ని గ్రామ పంచాయతీల్లోకి 'కేంద్రం' చొచ్చుకుపోతున్న వైనం! దీనిపేరే... 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'! అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠతో అంతా 'రామమయం'! ఈ నినాదంతోనే బీజేపీ ఎన్నికల కదన రంగంలోకి దిగుతోందన్నది రాజకీయ విశ్లేషకుల వాదన! ఇది నిజమే! 'వికసిత్ భారత్' పేరుతోనూ పల్లెపల్లెలో బీజేపీ ప్రచార భేరీ మోగిస్తోంది. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శిబిరాలు నిర్వహిస్తోంది. అంతేకాదు.. ఈ శిబిరాలు జరుగుతున్న తీరుతెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఇతర రాష్ట్రాలకు చెందిన మీడియా ప్రతినిధులనూ ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మీడియా ప్రతినిధులు రాజస్థాన్‌లో పర్యటించారు. ఈ బృందంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కూడా ఉన్నారు. జోధ్‌పూర్, బాడ్మేర్ జిల్లాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను ఈ బృందం పరిశీలించింది. కేంద్రం అమలు చేస్తున్న 17 పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ఈ శిబిరాల లక్ష్యం. ఆయా విభాగాలకు చెందిన అందరు అధికారులు అక్కడే ఉంటారు. జన్‌ధన్ యోజన ఖాతా తెరవడం నుంచి 'ఉజ్వల' పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందడం వరకు... అన్ని రకాల దరఖాస్తులను అక్కడే నింపి, అక్కడే సంబంధిత అధికారులకు అప్పగించవచ్చు. గ్యాస్ కోసం ఎక్కువమంది మహిళలు దరఖాస్తులు సమర్పించడం కనిపించింది. ఈ పర్యటనలో భాగంగా బాడ్మేర్ జిల్లా కలెక్టర్‌తోనూ మీడియా బృందం ముచ్చటించింది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. ఇంకా... జైసల్మేర్ జిల్లా పరిధిలోని 'తనోట్' వద్ద భారత్-పాక్ సరిహద్దుకు స్వయానా బీఎస్ఎఫ్ కమాండెంట్, ఇతర అధికారులు తీసుకెళ్లారు. సరిహద్దు భద్రతకు సంబంధించిన వివరాలు తెలిపారు.



రాజస్థాన్‌లోని జైసల్మేర్ జిల్లా ఖుడీ గ్రామంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శిబిరం... 'ఉజ్వల' దరఖాస్తులు సమర్పిస్తున్న మహిళలు.

చివరగా... పథకాలు కేంద్రానివైనా, వాటిని అమలు చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగులే! బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దీనికి ఎలాంటి ఇబ్బందీ లేదు. కానీ... ఇతర పార్టీలు అధికారంలో ఉన్న చోట, కేంద్ర పథకాల క్రెడిట్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులే తమ ఖాతాలో వేసుకుంటున్నారన్నది బీజేపీ ఆందోళన! ఆయా పథకాల్లో తమ వాటా వివరించేందుకు కేంద్ర మంత్రులు వరుస పర్యటనలు చేస్తున్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శిబిరాల లక్ష్యం కూడా అదే! పథకాల ప్రయోజనాలు అందించడం... ఆ పథకాలు కేంద్రం అమలు చేస్తున్నవే అని చెప్పుకోవడం!

హేమంత్ సోరెన్ అరెస్ట్

- అక్రమ భూలావాదేవీల కేసులో జార్ఖండ్ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

రాంచీ, జనవరి 31: అక్రమ భూలావాదేవీలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసింది. రాష్ట్ర రాజధాని రాంచీలోని సీఎం అధికార నివాసంలో దాదాపు ఏడు గంటలకుపైగా ఆయనను ప్రశ్నించిన అనంతరం తమ అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించింది. కాగా, అరెస్టుకు ముందే సోరెన్ ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కూటమి పక్షాల నేతలతో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం హేమంత్ సోరెన్‌ను ఈడీ అధికారులకు తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. హేమంత్ రాజీనామాతో జేఎంఎం ఎమ్మెల్యేలు సమావేశమై, పార్టీ శాసనసభాపక్ష నేతగా సీనియర్ నేత, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి చంపయ్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఎంఎం కూటమికి 47 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని గవర్నర్‌ను చంపయ్ సోరెన్ కోరారు. కాగా, ఈడీ విచారణ సందర్భంగా హేమంత్ సోరెన్ అధికారుల ప్రశ్నలకు సరిగా సమాధానాలు చెప్పలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అందువల్లే ఆయనను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద అరెస్టు చేసినట్లు పేర్కొన్నాయి. ఈడీ అధికారులు హేమంత్‌ను రాంచీలోని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టి, కస్టడీ కోరతారని తెలుస్తోంది. రాష్ట్రంలో జరిగిన అక్రమ భూలావాదేవీల్లో హేమంత్ సోరెన్ హస్తం ఉందని ఈడీ ఆరోపిస్తోంది. కొన్ని స్థిరాస్తులను ఆయన అక్రమంగా సొంతం చేసుకున్నారని, ల్యాండ్ మాఫియాతో సంబంధాలున్నాయని పేర్కొంటోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ఓ ఐఏఎస్ అధికారితోపాటు 14 మందిని ఈడీ అరెస్టు చేసింది. హేమంత్ సోరెన్ అరెస్టును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. కాగా, గురువారం రాష్ట్ర బంద్‌కు జేఎంఎం పిలుపునిచ్చింది.

ఈడీ అధికారులపై కేసు

ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఈడీ సోమవారం సోదాలు నిర్వహించటంపై హేమంత్ సోరెన్, రాంచీలోని ఓ ఎస్సీ/ఎస్టీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను, తన సామాజికవర్గాన్ని వేధించటానికి, ప్రతిష్ఠ దిగజార్చటానికే ఢిల్లీలో ఈడీ సోదాలు జరిపిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేజ్రీవాల్‌కు మళ్లీ మళ్లీ!

మద్యం కుంభకోణం కేసులో ఐదోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. 2022లో వెలుగు చూసిన ఢిల్లీ లిక్కర్ కుంభకోణానికి సంబంధించి.. ఇప్పటికి నాలుగు సార్లు ఈడీ సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ స్పందించకపోవడంతో తాజాగా బుధవారం ఐదోసారి సమన్లు పంపింది. ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం విచారణకు రావాలని కోరింది. "లిక్కర్ కుంభకోణానికి సంబంధించి విషయాల్ని ప్రశ్నించాల్సి ఉంది" అని సమన్లలో ఈడీ అధికారులు పేర్కొన్నారు.

నంది.. ఇక గద్దర్ అవార్డు

- వచ్చే ఏడాది నుంచి కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు పురస్కారాలు: టీ సీఎం రేవంత్

హైదరాబాద్, రవీంద్రభారతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నంది అవార్డులు విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. నంది అవార్డులను ఇక మీద గద్దర్ అవార్డులుగా అందిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది గద్దర్ జయంతి రోజున కవులు, కళాకారులు, సినీ ప్రముఖులకు గద్దర్ అవార్డు అందజేస్తామని వెల్లడించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్ర భారతీలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నంది అవార్డులపై ప్రకటన చేశారు.



ప్రకాశం జిల్లా కె.ఉప్పలపాడులో అంజయ్య భార్య, కుమారుడికి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

మనమంతా ఒక కుటుంబం

- బాబు అరెస్టుతో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు భువనేశ్వరి ఓదార్పు
- ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొనసాగిన 'నిజం గెలవాలి' యాత్ర

ఒంగోలు, నెల్లూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'మనమంతా ఒక కుటుంబం. ధైర్యంగా ఉండండి. పార్టీ మీకు అండగా ఉంటుంది' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఆయన సతీమణి నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా బుధవారం ఆమె ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి ప్రకాశం జిల్లా ఒంగోలులో బస చేసిన భువనేశ్వరి బుధవారం దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, టంగుటూరు, కొండపి మండలాల్లో నిజం గెలవాలి యాత్ర కొనసాగించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక దర్శి పట్టణంలో మరణించిన పరిశుద్ధరావు, ముండ్లమూరు మండలం శింగన్నపాలెంలో హనుమంతరావు, తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలోని ఆశ్రమంలో జంపాని నరసింహారావు, టంగుటూరులో దుగ్గినేని అరుణ్‌కుమార్, కొండపి మండలం కె.ఉప్పలపాడులో జంగాల అంజయ్య, నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం, ఆత్మకూరు గ్రామాలకు చెందిన వాయిల సుందరరావు, ఎండ్లూరి చిన్నకోటయ్యల కుటుంబాలను పరామర్శించారు. పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులు అందజేశారు. కుటుంబ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. రాత్రికి ఆమె కందుకూరులో బస చేశారు. గురు, శుక్ర వారాల్లో ఆమె నెల్లూరు నగరం, వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు మండలాల్లో పర్యటించనున్నారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్



పోటీలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

గుంటూరు(విద్య), జనవరి 31: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్టు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. తొలిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిందు యక్షజ్ఞానం కళాకారుడు గడ్డం సమ్మయ్య (పద్మశ్రీ అవార్డు గ్రహీత), సంగీత దర్శకుడు, గాయకుడు రఘు కుంచె హాజరవుతారన్నారు. ముగింపు కార్యక్రమానికి భారత క్రికెట్ జట్టు మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. విజ్ఞాన్ మహోత్సవ్‌కు పలు రాష్ట్రాల నుంచి 50 వేల మంది విద్యార్థులు వస్తారని వెల్లడించారు. విజేతలకు రూ.15 లక్షలకు పైగా బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్.రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై వైసీపీ ఎమ్మెల్యే దాడి

సుధీర్‌రెడ్డిపై తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు

ముద్దనూరు జనవరి 31: సీఎం జగన్ సొంత జిల్లా కడపలోని జమ్మలమడుగు నియోజకవర్గం ముద్దనూరులో వైసీపీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు ఆయన వర్గీయులు టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ కుడుముల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం భారీఎత్తున వైసీపీ కార్యకర్తలు, నేతలు టీడీపీలోకి చేరే కార్యక్రమం చేపట్టారు. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే, మండల టీడీపీ అధ్యక్షుడు చింతా శివరామిరెడ్డిపై దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న తెలుగు తమ్ముళ్లు తిరగబడి కుర్చీలతో వైసీపీ వర్గీయులపై దాడి చేశారు. పరస్పరం దాడి చేసుకుంటున్నా పోలీసులు మౌన పాత్రపోషించారు. దీంతో వైసీపీ వర్గీయులు మరింత రెచ్చిపోయారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వరుసకు మేనమామ అయిన కుడుముల శశిధర్‌రెడ్డి మూడేళ్లుగా ఆయనతో విభేదించి ఎర్రగుంట్ల మండలానికి చెందిన గంగవరం శేఖర్‌రెడ్డి వర్గంలో కొనసాగుతున్నారు. శేఖర్‌రెడ్డి



టీడీపీ నాయకులపై దాడి చేస్తున్న జమ్మలమడుగుల ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కూడా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో విభేదిస్తున్నారు. ఇటీవల కమలాపురంలో నిర్వహించిన 'రా..కదలిరా' సభలో శేఖర్‌రెడ్డి తన వర్గంతో కలిసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరికల కార్యక్రమం చేపట్టారు. ఈ సన్నాహాలు చేస్తుండగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వైసీపీ నేత కుడుముల మునిరాజారెడ్డిలు అనుచరులతో శశిధర్‌రెడ్డి ఇంటికి వచ్చిన టీడీపీ వర్గీయులు, మండల టీడీపీ అధ్యక్షుడు చింతా శివరామిరెడ్డిపై దాడి చేశారు. ఈ దాడికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా తిరగబడ్డారు. ఇరు వర్గాలు బాహాబాహీకి దిగాయి. శశిధర్‌రెడ్డి ఇంటి నుంచి టీడీపీ వర్గీయులను పోలీసులు బలవంతంగా బయటకు లాగేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మునిరాజారెడ్డి, వైసీపీ వర్గీయులు మాత్రం శశిధర్‌రెడ్డి ఇంట్లో నుంచే బయట రోడ్డుపై ఉన్న టీడీపీ నాయకులపై కుర్చీలు విసిరారు. అవి పోలీసులపై కూడా పడ్డాయి. వెంటనే ఇరువర్గాలు రాళ్లతో దాడులు చేసుకున్నారు. అప్పటి వరకు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు పరిస్థితి చేయి దాటుతుండడంతో ఇరువర్గాలను తరిమికొట్టారు. పోలీసుల తీరుకు నిరసనగా టీడీపీ నేత భూపేశ్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. అనంతరం ఆయనను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మార్టూరులో హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి స్టేషన్‌లోనే అదుపులోకి తీసుకున్నారు. వారిలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్, మాజీ అధ్యక్షుడు ప్రసాద్ ఉన్నారు. ఈ నేపథ్యంలో బాపట్ల డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒక సీఐ, ఆరుగురు ఎస్‌ఐలు, ఒంగోలు నుంచి వచ్చిన స్పెషల్ పోలీసులు 80 మంది, ఇంకా సిబ్బంది వందమందికి పైగా మార్టూరు సెంటర్లో బందోబస్తు నిర్వహించారు. కీలక ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా మొబైల్ వాహనాల ద్వారా మార్టూరు నుంచి బొల్లాపల్లి సెంటరు వరకు జాతీయ రహదారిపై బందోబస్తు నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. ఇక స్టేషన్‌లోనే పాగా వేసిన డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిస్థితులను తెలుసుకుంటూ టీడీపీ వారి కదలికలపై ఆరా తీసినట్లు సమాచారం. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మద్దతుదారులైన టీడీపీకి చెందిన గ్రానైట్ పరిశ్రమల యజమానులను పోలీసులు అరెస్ట్ చేయడం మండలంలో కలకలం రేపింది. అరెస్ట్ చేసినవారిని అనుసరిస్తూ టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ఏలూరిని కూడా అరెస్టు చేస్తారంటూ ప్రచారం జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. టీడీపీ మద్దతుదారులు ఆందోళనకు దిగితే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడగలవని భావించిన పోలీసు ఉన్నత అధికారులు ఉదయం నుంచే మార్టూరు సెంటర్లో భారీగా పోలీసులను మోహరించారు. మండలంలో చురుగ్గా ఉన్న టీడీపీ శ్రేణులపై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిసింది.

అధికారులపై చర్యలేవీ?

అరాచకశక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఖాకీలు వారికే కొమ్ముకాయడం.. పాలక పార్టీ నేతల మెప్పు కోసం బాధితులనే నిందితులుగా చేర్చడం.. ప్రశ్నించిన వారిపై ఎదురు కేసులు బనాయించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మార్టూరు ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులతో కలిసి తనిఖీలకు వచ్చిన వైసీపీ గూండాలను అడ్డుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులపై కేసు నమోదు చేసిన పోలీసులు.. బాధితుల ఫిర్యాదును మాత్రం బుట్టదాఖలు చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా ప్రైవేటు సైన్యంతో కలిసి తనిఖీలకు వచ్చిన అధికారులపై చర్యలు కొరవడ్డాయి. నెల్లూరు ఏడీ బాలాజీ నాయక్ ఫిర్యాదు మేరకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఇతర జిల్లాల అధికారులు మరో జిల్లాకు తనిఖీలకు వెళ్లేటప్పుడే ఉన్నతాధికారుల ఉత్తర్వులను చూపించడం ప్రక్రియ. ఇదే అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరితో పాటు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు సదరు అధికారులను అడిగారు. ఓ ఎమ్మెల్యే నిబంధనలను ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్పకుండా బలనిరూపణకు దిగడాన్ని అధికారులు ఎలా సమర్థించుకుంటారు? పైగా ఏడీ ప్రతాప్‌రెడ్డిపై గతంలోనూ పలు అభియోగాలున్నాయి. ఆయన ఉత్తరాంధ్రలోని ఓ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు సస్పెన్షన్‌కు గురయ్యారు. వైసీపీ పెద్దల ప్రాపకంతో దానిని రీవోక్ చేయించుకుని మచిలీపట్నం ఏడీగా పోస్టింగ్ వేయించుకుని వారి రుణం తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు ముందే సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పరంపరలోనే ఆయన అనుచరులైన టీడీపీ సానుభూతిపరుల ఫ్యాక్టరీలను లక్ష్యంగా చేసుకున్నారు.

డ్రైవర్ విధులేమిటి?

ఎమ్మెల్యే ఏలూరితో పాటు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులపై దాడికి పాల్పడిన శ్రీనివాస్‌ను సదరు అధికారులు ఇచ్చిన ఫిర్యాదులో వాహన డ్రైవర్‌గా పేర్కొన్నారు. ఆయన వైసీపీ నేతలతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన డ్రైవరే అని అనుకున్నా అధికారి విధుల్లో తలదూర్చాల్సిన అవసరం ఏమిటి? పైగా వాహనంలో మారణాయుధాలను క్యారీ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది? ఎమ్మెల్యేపైనే ఓ దశలో అతను దాడి చేయబోయారని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. పోలీసులు ఈ దిశగా అతనిపై విచారణ చేసిన పాపాన పోలేదు. కారణం ఒక్కటే అతనికి వైసీపీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే అధికారులతో కలిసి తన ప్రైవేటు సైన్యంతో దర్గాగా సోదాలలో భాగస్వామి అయ్యారు. నెల్లూరు మైనింగ్ ఏడీ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదులో డ్రైవర్ శ్రీనివాస్ మెడలోని సుమారు 80 గ్రాముల బంగారు చైన్ కిందపడగా దానిని దొంగిలించారని పేర్కొనడం గమనార్హం. బహుశా ఇంత కాస్ట్‌లీ డ్రైవర్ ఎక్కడా ఉండరేమో అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. శ్రీనివాస్ మార్టూరు ఘటనలో వ్యవహరించిన తీరు పక్కా వైసీపీ నేతలాగానే ఉండగా, దానిని ధ్రువీకరించే ఆధారాలు సైతం లభ్యమయ్యాయి. అయినప్పటికీ ఫిర్యాదులో అతడిని డ్రైవర్‌గా పేర్కొనడం, పోలీసులు అలాగే కేసు నమోదు చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

వైసీపీ నేతలను తలపించేలా..

ఇన్ని రోజులూ పాలకపార్టీ నేతలే పరిశ్రమలపై కక్ష కట్టి వేధించేవారు. వారు ఆడే క్రీడలో అయిష్టంగా కొంతమంది అధికారులు పావులుగా మారేవారు. కానీ మంగళవారం గ్రానైట్ ఫ్యాక్టరీల తనిఖీల పేరిట ఏడీ స్థాయి అధికారులు సృష్టించిన వీరంగం చూస్తే వైసీపీ నేతలను తలపించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసలే కష్టాలతో కునారిల్లుతున్న గ్రానైట్ రంగం ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించే ఇలాంటి అధికారులతో మరింత పతనావస్థకు చేరడం ఖాయమని, గూండాలను అడ్డుకోవడమే పాపమన్నట్లుగా తమపై కేసులు మోపి వేధించడం దారుణమని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన వీఓఏల 36 గంటల మహాధర్నా



విజయవాడలో మహాధర్నాలో నినాదాలు చేస్తున్న యానిమేటర్లు

మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి: సీపీఎం శ్రీనివాసరావు

విజయవాడ(ధర్నాచౌక్), జనవరి 31: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నాచౌక్‌లో వెలుగు వీఓఏ (యానిమేటర్స్)లు చేపట్టిన 36 గంటల మహాధర్నా బుధవారం ముగిసింది. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వీఓఏల జీవితాలతో చలగాటమాడే మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి, హెచ్‌ఆర్ పాలసీ, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వెలుగు వీఓఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు.

కేసుల ఉపసంహరణపై స్వతంత్రంగా వ్యవహరించండి

- సీఆర్‌పీసీ సెక్షన్ 321, సుప్రీం మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోండి
- కోనసీమ జిల్లా పేరు మార్పు నేపథ్యంలో అల్లర్ల కేసులపై పీపీకి ఆదేశం
- కౌంటర్ వేయాలని ప్రతివాదులకు హైకోర్టు స్పష్టీకరణ



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేసుల ఉపసంహరణ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ఆదేశించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 321, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 14కి వాయిదా వేసింది. కోనసీమ జిల్లా పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా మార్చిన సందర్భంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు వందలాది మంది నిందితులపై పెట్టిన కేసులను ఉపసంహరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో పై హైకోర్టు ఈ మేరకు స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం పై ఆదేశాలిచ్చింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోలను సవాల్ చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబూరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరపున న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. జిల్లాకు అంబేడ్కర్ పేరును తొలగించాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది సంఘ విద్రోహశక్తులు రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడులు చేస్తూ విధ్వంసానికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. నిందితులపై నమోదైన కేసులు ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన నిర్ణయం తీసుకొని జీవో జారీ చేసిందన్నారు. అమలాపురం పట్టణ, తాలూకా పోలీస్‌స్టేషన్లలో నమోదైన మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం డీజీపీకి స్పష్టం చేసిందన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 321 ప్రకారం కేసుల ఉపసంహరణ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలూ ఇవ్వడానికి వీల్లేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.... నిందితులపై నమోదైన కేసులు ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనాపరమైన నిర్ణయం తీసుకొని జీవో జారీ చేసిందన్నారు. అంతిమంగా కేసులు ఉపసంహరించాలా?లేదా అనే దానిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిర్ణయం తీసుకుంటారన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం... కేసుల ఉపసంహరణ విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమర్పించిన వివరాలను పరిగణలోకి తీసుకొని మేజిస్ట్రేట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేసింది. కేసుల ఉపసంహరణ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించాలని, సీఆర్‌పీసీ సెక్షన్ 321, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ధర్మాసనం ఆదేశించింది.

ఊరూరా జగన్ గూండారాజ్

- మార్టూరు, క్రోసూరు ఘటనలు.. రౌడీ రాజ్యానికి నిదర్శనం
- చట్టాలను అమలుచేయలేని ఎస్పీలు ఖాకీ యూనిఫాం తీసేయాలి.. వైసీపీ జెండానే కుట్టించుకోవాలి
- వ్యవస్థ పతనాన్ని అడ్డుకోలేని డీజీపీ వీఆర్ఎస్ తీసుకోవాలి: బాబు



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పాలనా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. ఊరూరా జగన్ గూండారాజ్ మాత్రమే ఉంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మార్టూరులో మారణాయుధాలతో మైనింగ్ తనిఖీలు, క్రోసూరులో రౌడీ మూకల విధ్వంసానికి పోలీసుల సహకారం అనేది పూర్తిగా పాలన గాడితప్పడమే. మార్టూరులో గూండాలు మారణాయుధాలతో గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీల పేరిట చేసిన అరాచకం వ్యవస్థల విధ్వంసానికి నిదర్శనం. మైనింగ్ శాఖలో ఒక ఏడీ స్థాయి అధికారి రౌడీలతో తనిఖీలకు వచ్చిన ఘటన రాష్ట్రంలో గూండారాజ్‌కు ఉదాహరణగా నిలుస్తోంది. దీనిని ప్రశ్నించిన వారిపైనే కేసులు పెట్టి అరెస్టు చేసినందుకు పోలీసులు, అధికారులు సిగ్గుపడాలి. క్రోసూరులో ఎమ్మెల్యే కొడుకు వందలమందితో ప్రజల ఆస్తులపై దాడికి దిగితే చర్యలు తీసుకోకపోగా, పోలీసులు సహకరించడం రాష్ట్ర పోలీసుశాఖ గౌరవాన్ని దిగజార్చడమే. ఇలాంటి ఘటనలపై డీజీపీ ఎందుకు స్పందించరు? తాను అధిపతిగా ఉన్న వ్యవస్థని తానే నడిపించలేని పరిస్థితి వచ్చినప్పుడు డీజీపీ ఆ స్థాయి పోస్టులో కూర్చోవడానికి అనర్హులు. ఒకప్పుడు దేశం కీర్తించిన మన పోలీసు శాఖ కళ్ల ముందే పతనం అవుతుంటే కట్టడి చేయలేని డీజీపీ తక్షణమే వలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలి. కిందిస్థాయి అధికారులు తప్పుచేస్తే సరిదిద్దాల్సిన జిల్లా ఎస్పీలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా అరాచకాలకు కొమ్ముకాస్తున్నారు. చట్టాన్ని అమలు చేయలేని ఆయా జిల్లాల ఎస్పీలు ఖాకీ యూనిఫాం తీసేసి వైసీపీ జెండానే యూనిఫాంగా కుట్టించుకోవాలి. పోలీసుశాఖలో ఇలాంటి అసమర్థ ఎస్పీలు, అధికారులు హోంగార్డుతో సెల్యూట్ కొట్టించుకునేందుకు కూడా అర్హులు కాదు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న అధికారులు చట్టానికి కట్టుబడి పనిచేయాలి. మరో రెండు నెలల్లో ఈ రౌడీ మూకలను ప్రజాకోర్టు శిక్షిస్తుంది. తప్పుచేసిన అధికారులను న్యాయస్థానాలు తప్పక శిక్షిస్తాయి' అని చంద్రబాబు అన్నారు.

ఉన్నత విద్యలో భారత్‌కు అతిపెద్ద నెట్‌వర్క్

- నన్నయ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

దివాన్‌చెరువు/రాజానగరం, జనవరి 31: దేశ వ్యాప్తంగా 900 విశ్వవిద్యాలయాలు, 40 వేల కళాశాలలతో ఉన్నత విద్యా విధానంలో భారత దేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందని రాష్ట్ర గవర్నర్, నన్నయ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14, 15 ఉమ్మడి స్నాతకోత్సవం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గవర్నర్ మాట్లాడుతూ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. 2035 నాటికి ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం మేర పెంచడం జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృమూర్తిని, మాతృభాషను గౌరవించుకోవాలన్నారు. జీవితంలో ప్రతి రోజు ఎన్నో పరీక్షలు ఎదురవుతాయని, ఆత్మస్థైర్యంతో వాటిని అధిగమించే దిశగా పయనించాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయం తరపున సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను కులపతి అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు.



ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత వర్సిటీలదే

- జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవంలో గవర్నర్

జేఎన్టీయూకే, జనవరి 31: వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించడంలో దేశంలోని యువతకు మార్గనిర్దేశం చేసే బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందని జేఎన్టీయూకే కులపతి, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. గవర్నర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవానికి మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్ఈ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తన వృత్తితోపాటు ఇతర వృత్తుల వారిని కూడా గౌరవించాలన్నారు. ముఖ్యఅతిథి వెంకటశేషాచారి మాట్లాడుతూ జ్ఞానం వివేకాన్ని పెంపొందించాలని, ఉద్యోగాలను ఆశించకుండా వ్యవస్థాపకులుగా మారాలని సూచించారు. అనంతరం 64మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21మందికి బంగారు పతకాలను గవర్నర్ ప్రదానం చేశారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?: అచ్చెన్న

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమ అవినీతి, అక్రమాలు ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడటం జగన్ నుంచి వారి ఎమ్మెల్యేల వరకు దినచర్యగా మారిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు ఇసుక దందాను ఆధారాలతో సహా బట్టబయలు చేసినందుకే టీడీపీ నేత కంచేటి సాయిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. సాయిపై దాడి చేస్తామంటూ వైసీపీ నేతలు బహిరంగంగా కర్రలు పట్టుకుని తిరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? సాయికి ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత' అని అచ్చెన్న అన్నారు.

ఎన్నికల ముందు జగన్నాటకం: లోకేశ్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ సీఎం సరికొత్త జగన్నాటకానికి తెరదీశారు. నాలుగన్నరేళ్ల పాటు ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. 'ఇప్పుడు నోటిఫికేషన్ ఇస్తే పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారు? పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారు? ఎన్నికల సమయానికి ఈ ప్రక్రియ పూర్తి చేయడం సాధ్యమేనా? చిత్తశుద్ధి లేని ఇలాంటి జిమ్మిక్కులు ఆపేసి జర సర్దుకోండి జగన్' అని లోకేశ్ ఎద్దేవా చేశారు.

షర్మిల వ్యాఖ్యలపై భారతీరెడ్డి నోరువిప్పాలి: బొండా

జగన్ బెయిల్ కోసం ఆయన భార్య భారతి, తన భర్త అనీల్‌కుమార్‌లు సోనియాను కలిశారన్న షర్మిల వ్యాఖ్యలపై భారతీరెడ్డి నోరు విప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ తనపై తప్పుడు కేసులు పెట్టిందని, కేంద్రంలో అధికారంలో ఉండి తనను అన్యాయంగా జైలుకు పంపిందన్న జగన్ మాటలన్నీ పచ్చి అబద్ధాలని షర్మిల వ్యాఖ్యలతో తేలిపోయింది. వాస్తవాలు ప్రజలకు తెలియాలంటే జగన్‌కు లై డిటెక్టర్ పరీక్షలు చేయాలి. చెల్లితో పాటు తల్లి కూడా త్వరలోనే జగన్ బాగోతం ప్రజల ముందు పెడుతుంది. జగన్ పాపాలు పండాయి. అందుకే షర్మిల, ఆయన చీకటి వ్యవహారాల్ని బయటపెట్టింది' అని బొండా అన్నారు.

ఆ కుక్కని చూపించి ఎగరకండి: కేశినేనిపై బుద్దా ట్వీట్

విజయవాడ, జనవరి 31: టీడీపీ అధినేత చంద్రబాబును ఉద్దేశించి విజయవాడ ఎంపీ, వైసీపీ నేత కేశినేని నాని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత బుద్దా వెంకన్న సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. 'ఈ కుక్క ఇటువైపు ఉన్నప్పుడు యజమానిపైనే అజమాయిషీ చేసేది.. అక్కడ గేటుకు కట్టి ఊరంతా తిప్పి మొరిగిస్తున్నారు. నోట్: ఈ కుక్కని చూపించి ఎగరకండి.. అన్నం పెట్టిన చేతినే కొరికే జాతి ఇది.. విశ్వాసం అనే లక్షణం కొంచెం కూడా ఉండదు' అని ట్వీట్ చేశారు. దీనిపై కేశినేని నాని స్పందించారు. చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలని, ఓడిపోయాక సొంత రాష్ట్రం తెలంగాణకు వెళ్లడం ఖాయమంటూ కేశినేని నాని ట్యాగ్ చేశారు.

సోలార్ పవర్‌తో జగన్‌కు ఇం'ధనం': పట్టాభి

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ ప్రాజెక్టులతో సీమకు కాదు ఇంధనం.. జగన్‌కే ఇం'ధనం' అని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ ఆరోపించారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పెట్టుబడుల ముసుగులో సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ పేరుతో జగన్ అనామక కంపెనీలకు రూ.వేల కోట్ల విలువైన భూములు పంచిపెడుతున్నారు. జగన్ సర్కార్ సోలార్ పవర్‌కు సంబంధించి బుధవారం కేబినెట్ సమావేశం సాక్షిగా 23,500 ఎకరాలు అదనపు భూపందేరానికి తెరలేపింది. తక్కువలో తక్కువగా ఎకరం విలువ రూ.10 లక్షలనుకుంటే.. జగన్ సర్కార్ ఒక్క రోజులో రూ.2,350 కోట్ల స్కాంకు పాల్పడింది. అడ్డగోలుగా నిబంధనలు మార్చి, అదనంగా జరిపిన భూకేటాయింపులపై మంత్రి పెద్దిరెడ్డి సమాధానం చెప్పాలి' అని పట్టాభి డిమాండ్ చేశారు.

వైసీపీకి మిగిలేది ముగ్గురు ఎంపీలే: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జగన్ పార్టీలో కేవలం ముగ్గురు లోక్‌సభ ఎంపీలు మాత్రమే ఉంటారని కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ అన్నారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఓహ్... వైసీపీ ఎంత అభివృద్ధి చెందుతున్న రాజకీయ సామ్రాజ్యం' అని ఠాగూర్ ఎద్దేవా చేశారు.

ప్రజా యుద్ధముల ఆరితేరిన యోధుడు గద్దర్: పవన్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'అతడు అనేక ప్రజా యుద్ధముల ఆరితేరిన యోధుడు'... అనే మాటలు ప్రజా నౌక దివంగత గద్దర్‌కు అన్వయించడం అతిశయోక్తి కాదు అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొనియాడారు. గద్దర్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గద్దర్ జయంతి సందర్భంగా నా పక్షాన, జనసేనపక్షాన ఆయనకు నివాళి అని పవన్ పేర్కొన్నారు.

13 వేల మంది తమ్ముళ్లపై అక్రమ కేసులు: గోరంట్ల

రాజమహేంద్రవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల్లో జరగనున్న ఎన్నికలలో టీడీపీ-జనసేనకు పోలింగ్ బూత్‌ల వద్ద ఏజెంట్లు, కేడరు లేకుండా చేయడానికి సీఎం జగన్ కుట్ర చేస్తున్నారు. ఇప్పటికే 13 వేల మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు' అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ తన స్వగృహంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఈ నెలలో విశాఖకు మోదీ!

విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)లో రూ.26 వేల కోట్లతో చేపట్టిన రెండో దశ నిర్మాణాలను(విస్తరణ) ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫిబ్రవరి రెండో లేదా మూడో వారంలో విశాఖపట్నం రానున్నారు. మల్కాపురంలోని హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ప్రాంగణం లేదా సమీపంలో ఏర్పాటుచేసే బహిరంగసభలో ప్రధాని ప్రసంగిస్తారని సమాచారం.


8న విచారణకు రండి..వైసీపీ రెబల్స్‌కు స్పీకర్ నోటీసు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్పీకర్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఆయన కార్యాలయం వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలకు బుధవారం నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే స్పీకర్ తమ్మినేని సీతారాం ముందు విచారణకు హాజరైన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి... విచారణకు గడువు కావాలని, తమకు అందించిన సీడీలు ఓపెన్ కావడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5లోగా అనర్హత వేటు ఎందుకు వేయకూడదో లిఖిత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని, 8న హాజరు కావాలని స్పీకర్ కార్యాలయం కోరింది. ఈ మేరకు కార్యాలయం నుంచి నలుగురు ఎమ్మెల్యేలకూ నోటీసులు వెళ్లాయి.

శిరోముండనం కేసు పునఃప్రారంభం

విశాఖపట్నం, జనవరి 31: తనకు ఓటు వేయలేదనే కక్షతో 1996లో ఐదుగురు దళిత యువకులను కొట్టి, ఇద్దరికి శిరోముండనం చేయించారన్న అభియోగంపై తోట త్రిమూర్తులు (ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీ)పై నమోదైన ఎస్సీ అట్రాసిటీ కేసు విచారణ బుధవారం పునఃప్రారంభమయ్యింది. బాధితుల కులం విషయంలో నిందితుడు అభ్యంతరం చెప్పడంతో విచారణపై గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది. బాధితులు తగిన ఆధారాలు సమర్పించడంతో వారిని ఎస్సీలుగానే గుర్తిస్తూ కేసు విచారణ చేపట్టాలని హైకోర్టు విశాఖపట్నంలోని ప్రత్యేక కోర్టుకు ఉత్తర్వులు జారీచేసింది.

శనగ సాగులో విప్లవం.. నంద్యాల గ్రామ్-119



నంద్యాల టౌన్, జనవరి 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆవిష్కరించిన నంద్యాల గ్రామ్ (ఎన్‌బీఈజీ)-119 రకం శనగ రైతుల ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. 2015లో నంద్యాల ఆర్ఏఆర్ఎస్ నుంచి విడుదలైన నంద్యాల గ్రామ్- 119 అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. ప్రకాశం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణంలో 40 వేల హెక్టార్లల్లో నంద్యాల గ్రామ్ 119 సాగు చేస్తున్నారు. ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి ఇస్తూ.. స్వల్పకాలిక రకం కావడంతో రాయలసీమ జిల్లాల్లో సైతం ఈ రకం సాగు అధికంగా ఉంది. చీడ, పీడలను తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలంలో పంట వచ్చే నంద్యాల గ్రామ్-119 ముున్ముందు మరింత విస్తృత స్థాయిలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శనగ ప్రధాన శాస్త్రవేత్త వి.జయలక్ష్మి చెప్పారు. 95 రోజుల స్వల్పకాలిక కాబూలి శనగ రకం, 100 గింజల బరువు 38-40 గ్రాములు, గింజ లావుగా, ఆకర్షణీయంగా ఉంటుందని తెలిపారు. హెక్టారుకు వర్షాధారంలో 17.5-20 క్వింటాళ్లు, 1 లేదా 2 తడులతో 20-25 క్వింటాళ్ల దిగుబడితో ఎండ తెగులును తట్టుకునే శక్తి ఈ రకానికి ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాల్దీవుల్లో రాజకీయ తుఫాను

మాల్దీవుల్లో రాజకీయపరిణామాలు వేగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం నియమించిన ప్రాసిక్యూటర్ జనరల్ హుస్సేన్ షమీమ్ బుధవారం ఉదయం కత్తిపోట్లకు గురి అయి ఆస్పత్రిలో చేరడం ఇప్పటికే విపక్షానికి, అధికారపక్షానికి మధ్య ఉన్న వైరాన్ని మరింత పెంచుతుంది. ఆదివారం అక్కడి పార్లమెంటులో కీలకమైన ఓటింగ్ సందర్భంలో ఉభయపక్షాల మధ్య జరిగిన దాడులు మీడియాలో విస్తృతంగా ప్రచారమైనాయి. అధ్యక్షుడు మహ్మద్ మొయిజ్జు మంత్రివర్గంలో నలుగురు మంత్రుల నియామకాన్ని తిరస్కరించి, స్పీకర్ సైతం రాజీనామా చేయాలంటూ విపక్షం డిమాండ్ చేసినప్పుడు ఈ ఘర్షణ జరిగింది. ఒకమంత్రి గట్టెక్కినా, సభ తిరస్కరించిన మిగతా ముగ్గురు మంత్రులను, అటార్నీ జనరల్‌ను అధ్యక్షుడు తిరిగి నియమించడంతో వివాదం మరింత వేడెక్కింది. మొయిజ్జు ఎన్నికైన మూడు నెలల్లోనే మాల్దీవుల్లో పరిణామాలు మారిపోవడం, అధ్యక్షుడిని అభిశంసించేందుకు విపక్షం సిద్ధపడటం వెనుక భారత్ హస్తం ఉన్నదని చాలామంది నమ్మకం.

'ఇండియా ఔట్' నినాదంతోనే మొయిజ్జు 54శాతం ఓట్లతో అధ్యక్షుడయ్యారు. తన చర్యలకు, చేష్టలకు ప్రజల మద్దతు ఉన్నదన్న వాదనతో అక్కడున్న భారత సైనికులను ఖాళీచేయమంటున్నారు. అధ్యక్షుడు కాగానే తొలిగా భారతదేశాన్ని సందర్శించే సంప్రదాయాన్ని పక్కనబెట్టి, తుర్కియే, సౌదీ అరేబియా వెళ్ళారు. తరువాత చైనా పోయి, భారీ పెట్టుబడులతో దేశాన్ని ఆదుకోమని విజ్ఞప్తిచేశారు. తిరిగి రాగానే భారత్ పేరు ఎత్తకుండా చిన్నదేశమనే కారణంతో మాల్దీవులను వేధించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇక, చైనా గూఢచర్య ఓడను మరమ్మత్తుల పేరిట లంగరువేసుకోవడానికి అనుమతించడం ఉభయదేశాల మధ్యా అగాధాన్ని మరింత పెంచింది. ఎవరికీ భయపడేది లేదు, మాల్దీవుల ప్రయోజనాలకే అగ్రస్థానం అంటూ ఎన్ని ముసుగుమాటలు చెప్పినా ఈ చర్యతో ఆయన భారతవ్యతిరేక వైఖరి మరింత స్పష్టమైంది. విపక్షం ఆయనమీద ప్రత్యక్షయుద్ధానికి దిగింది. అనాదిగా సన్నిహితంగా ఉన్న దేశాలను దూరంచేసుకోవడం వల్ల మాల్దీవుల దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతింటాయని విపక్షాలన్నీ సంయుక్త ప్రకటన చేశాయి. జమ్హూరీ పార్టీ నాయకుడు స్వయంగా అధ్యక్షుడిని కలిసి, భారతదేశాన్నీ, నరేంద్రమోదీనీ క్షమాపణలు కోరమంటూ సలహా ఇచ్చారు.

అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి సరిపడినన్ని సంతకాల సేకరణలో ఇప్పుడు విపక్షం ఉంది. 87 స్థానాలున్న సభలో 58మంది సంతకాలతో అధ్యక్షుడిని దింపివేయవచ్చునని అక్కడి రాజ్యాంగం చెబుతోంది. భారత అనుకూల పక్షమైన ఎండీపీ, దానితో చేతులు కలిపిన డెమోక్రాట్లు ఈ లెక్కకు దాదాపు సరిపోతారు. దీనికితోడు, నవంబరులో మొయిజ్జు అధ్యక్షుడు కాగానే, ఏడుగురు సభ్యులు రాజీనామా చేసి అధికారపదవులు చేపట్టగానే, తనకున్న సంఖ్యాబలంలో విపక్ష ఎండీపీ ఒక ప్రధాన సవరణ సాధించింది. దానిప్రకారం సభ మొత్తం బలం కాక, ఉన్న 80స్థానాలే పరిగణనలోకి వస్తాయి. ఈ కొత్త విధానం ప్రకారం అధ్యక్షుడిని అభిశంసించడానికి అవసరమైన సంఖ్యాబలం ఇంకా తగ్గుతుంది. ఆదివారం విపక్షాలు తిప్పికొట్టినప్పటికీ, అధ్యక్షుడు తిరిగి నియమించిన కొత్త అటార్నీ జనరల్ ఇప్పుడు సుప్రీంకోర్టులో ఈ మార్పు చెల్లకుండా చేసే ప్రయత్నంలో ఉన్నారు.

మొయిజ్జు అభిశంసన జరుగుతుందా, వెనుక భారత్ హస్తం ఉన్నదా అన్నవి అటుంచితే, ఉభయదేశాల మధ్యా అగాధం పెరగడం సరికాదు. ప్రధాని మోదీ లక్షద్వీప్‌ను సందర్శించి కొన్ని ట్వీట్లు చేయడం, వాటి ఆధారంగా అభిమానులు మాల్దీవులపని అయిపోయిందని వ్యాఖ్యానించడం, ఇందుకు ప్రతిగా మొయిజ్జు మంత్రులు ముగ్గురు నోరుపారేసుకోవడం తెలిసినవే. వారు సస్పెండ్ అయినా కూడా సమస్తరంగాలకు చెందిన మన ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో మాల్దీవులను వెంటాడి, దాని పర్యాటకాన్ని దెబ్బతీశారు. సున్నితంగా, దౌత్యంతో కాక, దెబ్బకు దెబ్బ విధానంలో వ్యవహారాలు చక్కబెట్టాలని చూసినప్పుడు, భారత్ పెద్దన్నలాగా వ్యవహరిస్తున్నదంటూ ఆడిపోసుకొనే చిన్నచిన్న పొరుగు దేశాలకు ఈ వైఖరి మరింత ఉపకరిస్తుంది, భయపెడుతుంది. పొరుగుదేశాలతో స్నేహానికే ప్రథమ తాంబూలం అంటున్నప్పుడు, తన రాజకీయ మనుగడకోసం ఒక నాయకుడు అనుసరిస్తున్న విధానాలకు ఆజ్యంపోయకుండా, చైనాకు మరింత సన్నిహితం కాకుండా జాగ్రత్తపడాలి. విదేశాంగమంత్రి జయశంకర్ అన్నట్టుగా ఎంతకాదనుకున్నా, ఎవరు వచ్చినాపోయినా, ఇరుగూ-

ఆంధ్రప్రదేశ్ మేలుకుంటుందా?

తెలంగాణ అసెంబ్లీ ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి పరాజిత అధికారపక్షం బీఆర్ఎస్ తటపటాయిస్తోంది కానీ, కొన్ని ఇతర రాష్ట్రాల అధికారపార్టీలు మాత్రం జాగ్రత్త పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నేసి అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులను మార్చడం వెనుక తెలంగాణ ప్రభావం చాలా ఉన్నది. బీఆర్ఎస్ అపజయ కారణాలలో సిటింగ్‌లకు సీట్లు ఇవ్వడం అన్న ఒక్కదాన్నే జగన్ తీసుకున్నారు. ఏమి చేసినా ఏమీ ఉపయోగం ఉండని స్థితికి జగన్ పాలన చేరింది కనుక, ఆ మార్పుల వల్ల మరింత నష్టమే తప్ప లాభం లేదు. ఆశ్చర్యకరంగా, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా తెలంగాణ ఫలితాలను నిశితంగా పరిశీలించి, అనేక స్థానాలలో అభ్యర్థుల మార్పు గురించి తన ఆంతరంగికుడు పాండియన్‌కు సూచనలిచ్చారట. పొరుగు రాష్ట్రాల ఫలితాలను చూస్తే తప్ప, సొంత రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి వ్యతిరేకతలు అర్థం కాని స్థితికి రాజకీయపార్టీలు చేరుకున్నాయన్న మాట.

అధికారపార్టీలు మాత్రమే కాదు, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలిగిన వివిధ ఒత్తిడి సమూహాలు కూడా ఇతర రాష్ట్రాల అనుభవాల నుంచి నేర్చుకుంటున్నాయి, రంగంలోకి దిగుతున్నాయి. కర్ణాటకలో 'ఎద్దేళు కర్ణాటక' పేరుతో వందలాది గాంధేయ, లౌకికవాద, సోషలిస్టు ప్రజాసంఘాలు అప్పటి అధికారపార్టీ బీజేపీని ఓడించడానికి పనిచేశాయి. భారతీయ జనతాపార్టీ మతతత్వ విభజనవాద పాలనను ఓడించడం వారి నినాదం. కాంగ్రెస్‌కు ఓటు చేయమని వారు ఎక్కడా వాచ్యంగా చెప్పలేదు. కొన్ని చోట్ల జనతాదళ్ (సెక్యులర్)కు లబ్ధి చేకూరేటట్టు కూడా వారు పనిచేశారు. తెలంగాణలో కూడా జాగో తెలంగాణ, తదితర ఐక్యకార్యాచరణ సంస్థలు బీజేపీకి, బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటువేయవలసిందిగా ప్రచారం చేశాయి. కాంగ్రెస్‌కు అనుకూలంగా వారు బాహటంగా ప్రచారం చేయలేదు కానీ, వారి 'వ్యతిరేక' నినాదాలు, కాంగ్రెస్‌కే ప్రయోజనం కలిగించాయి. బీజేపీ వల్ల దేశ సామాజిక వ్యవస్థకు, ప్రజాస్వామిక విలువలకు పెద్ద అపకారం జరుగుతోందని నమ్మేవారు 2024 సాధారణ ఎన్నికలలో కూడా ఆ పార్టీని ఓడించడానికే తమ శాయశక్తులా పనిచేస్తారు. కర్ణాటక, తెలంగాణ అనుభవాలు జాతీయస్థాయిలో కూడా ఈ పౌరసమాజ కార్యకర్తలకు పాఠాలుగా పనికివస్తాయి.

అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ ప్రజాసంఘాల వారికి పెద్ద పజిల్‌గా మారింది. అక్కడ భారతీయ జనతాపార్టీ ప్రత్యక్ష బలం నామమాత్రమే. కానీ, రాష్ట్రంలోని రెండు ప్రధాన పక్షాలూ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయి. సాధారణ ఎన్నికల తరువాత, కేంద్రంలో బీజేపీ కూటమికి మద్దతుగా అవి నిలబడతాయి. మరి ఏపీలో, తాము ఎవరికి అనుకూలంగా, ఎవరికి ప్రతికూలంగా ప్రచారం చేయాలి? కొత్తగా ప్రాణం పోసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బలం కనీసంగా కూడా లేదు. 'మేలుకో ఆంధ్రప్రదేశ్' పేరుతో, రాష్ట్రంలోని లౌకికవాదులు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, మైనారిటీ ప్రయోజనాల సంఘాలు కలసి పనిచేస్తున్న వేదికకు అందుకే అడుగు ముందుకు వేయలేని విచిత్ర పరిస్థితి నెలకొన్నది.

నిజానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకంలో వైసీపీ పాలన మీదనే కాదు, బీజేపీ మీద కూడా తీవ్రమైన అసంతృప్తి ఉన్నది. జాతీయస్థాయి విధానాల వల్ల కాదు, రాష్ట్రం మీద ఆ పార్టీ వైఖరి కారణంగానే ఆ అసంతృప్తి ఏర్పడింది. విభజనానంతరం రాష్ట్రపరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందాన ఉండిపోవడానికి బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వమే కారణమన్న అభిప్రాయం అక్కడ బలంగా ఉన్నది. 2019 ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీ బీజేపీ మీద తీవ్ర విమర్శలే సంధించింది. తరువాత వైఖరి మార్చుకోవలసి వచ్చింది. బీజేపీ తీవ్ర మత జాతీయవాద విధానాలు సహజంగానే ఆంధ్రప్రదేశ్‌లోని ఆధునిక అభ్యుదయ జీవన విధానానికి సరిపోయేవి కావు. అయినా, ప్రస్తుతం బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో మౌనాంగీకారాన్ని ఎట్లా పొందగలుగుతోంది? అధికార వైసీపీ బీజేపీతో చేస్తున్న అనధికార స్నేహం అందుకు ప్రధానకారణం. జాతీయస్థాయిలో బీజేపీకి కావలసిన అన్ని అవసరాలను వైసీపీ నెరవేరుస్తోంది. జగన్ మీద కేసులు ముందుకురాకుండా, అప్పుల తిప్పలు లేకుండా బీజేపీ సాయపడుతోంది. ఈ పరస్పర సహకారం సజావుగా సాగుతోంది. అదనంగా రకరకాల రూపాల్లో కేంద్ర పార్టీకి రాష్ట్ర పార్టీ కప్పం కూడా చెల్లిస్తోందని చెప్పుకుంటారు. వైసీపీ సరే, మరి టీడీపీ ఎందుకు బీజేపీని బోను నుంచి తప్పించింది? ఎంతకైనా తెగించగలిగిన బీజేపీని, జగన్‌ను రెంటినీ ఒకేసారి ఎదుర్కోవడం కష్టం కాబట్టి. కనీసం ఎన్నికల పోరాటమన్నా అధిక దౌర్జన్యం లేకుండా సాగడానికి బీజేపీ అండ పనికివస్తుందని!



అంతమాత్రమే కాదు, 2019 ఓటమి తరువాత తెలుగుదేశం పార్టీ తన గతవైఖరులపై ఆత్మరక్షణలో పడింది. బీజేపీని అంత తీవ్రంగా విమర్శించి పొరపాటు చేశానేమోనన్న భావనలో పడింది. జగన్ ప్రభుత్వం దూకుడు దానికి తోడయింది. తిరిగి తనను కూడగట్టుకునే ప్రయత్నంలో, ఆచితూచి వ్యవహరించడం మేలు అనుకున్నది. అయితే, బీజేపీతో బాహటంగా చెలిమి చేయడానికి టీడీపీ ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నదనుకోలేము. బీజేపీకి సొంతంగా ఉన్న ఓటు బలం లాభించేది కాకపోగా, దాని స్పర్శ రాజకీయంగా నష్టం కలిగించేది. ఎన్నికల తరువాత, తమ లోక్‌సభ సభ్యుల బలాన్ని బీజేపీకి సమర్పించడమొక్కటే వైసీపీకి అయినా టీడీపీకి అయినా ముందస్తు అవగాహన అవుతుంది. ఈ లోగా బీజేపీతో బహిరంగ స్నేహం లేదన్నట్టుగానే ఈ పార్టీలు వ్యవహరించాలి. ఈ పరిస్థితిలో బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే ప్రజాశ్రేణుల అభిమతం ఏమి కావాలి? బీజేపీకి వ్యతిరేకంగా ఓటు చేయాలనుకునేవారు ఎవరికి వేయాలి? దళితులు, ముఖ్యంగా దళిత క్రైస్తవులు, ముస్లిములు, కమ్యూనిస్టులు బీజేపీకి కానీ, బీజేపీకి సహాయపడే పక్షానికి గానీ ఓటు వేయడానికి ఇష్టపడరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీరి సంఖ్య ప్రభావవంతమైనది.

రహస్యస్నేహాలు చేస్తున్నామని ఆ పార్టీలు అనుకున్నా, ప్రజలకు కలిగే అభిప్రాయాలు వేరు. వైసీపీ వాస్తవంలో బీజేపీకి ఎంతో సన్నిహితమైనప్పటికీ, పైకి మాత్రం అంటీముట్టకుండా ఉన్నట్టు కనిపిస్తున్నది. జనసేన వల్లనో మరొకందుకో బీజేపీతో స్నేహానికి టీడీపీ ఆరాటపడుతున్నట్టు అభిప్రాయం కలుగుతున్నది. ఈ పరిస్థితిలో బీజేపీ వ్యతిరేక ఓటరు వైసీపీని ఎంచుకునే అవకాశం లేదా ప్రమాదం ఉన్నది. ప్రమాదం అనడం ఎందుకంటే, జాతీయస్థాయిలో బీజేపీని వ్యతిరేకిస్తున్న పౌరసమాజం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ దుష్పరిపాలనను కూడా వ్యతిరేకిస్తున్నది. తెలంగాణలో రాష్ట్ర అధికార బీఆర్ఎస్‌ను, కేంద్ర అధికార బీజేపీని వ్యతిరేకించినట్టే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ వ్యతిరేక, వైసీపీ వ్యతిరేక ప్రచారం చేయాలనుకుంటోంది. మరి, ఆ వైఖరి తెలుగుదేశం పార్టీకి ఉపకరించేదే, అయితే, ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ, బీజేపీ వెంట ఉండేట్టు అయితే, పౌరసమాజం లక్ష్యానికి విఘాతం కదా? అందుకే 'మేలుకో ఆంధ్రప్రదేశ్' ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ బీజేపీ వ్యతిరేక వైఖరి తీసుకోవాలని కోరుకుంటున్నారు. తమ వాదనను పార్టీ నాయకత్వానికి చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

> వైసీపీ వాస్తవంలో బీజేపీకి ఎంతో సన్నిహితమైనప్పటికీ, పైకి మాత్రం అంటీముట్టకుండా ఉన్నట్టు కనిపిస్తున్నది. జనసేన వల్లనో మరొకందుకో బీజేపీతో స్నేహానికి టీడీపీ ఆరాటపడుతున్నట్టు అభిప్రాయం కలుగుతున్నది. ఈ పరిస్థితిలో బీజేపీ వ్యతిరేక ఓటరు వైసీపీని ఎంచుకునే అవకాశం లేదా ప్రమాదం ఉన్నది. ప్రమాదం అనడం ఎందుకంటే, జాతీయస్థాయిలో బీజేపీని వ్యతిరేకిస్తున్న పౌరసమాజం, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ దుష్పరిపాలనను కూడా వ్యతిరేకిస్తున్నది. తెలంగాణలో రాష్ట్ర అధికార బీఆర్ఎస్‌ను, కేంద్ర అధికార బీజేపీని వ్యతిరేకించినట్టే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ వ్యతిరేక, వైసీపీ వ్యతిరేక ప్రచారం చేయాలనుకుంటోంది. మరి, ఆ వైఖరి తెలుగుదేశం పార్టీకి ఉపకరించేదే, అయితే, ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ, బీజేపీ వెంట ఉండేట్టు అయితే, పౌరసమాజం లక్ష్యానికి విఘాతం కదా? అందుకే 'మేలుకో ఆంధ్రప్రదేశ్' ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ బీజేపీ వ్యతిరేక వైఖరి తీసుకోవాలని కోరుకుంటున్నారు. తమ వాదనను పార్టీ నాయకత్వానికి చేరవేసే ప్రయత్నం చేస్తున్నారు.

పౌరసమాజానిదే కాదు, వైఎస్ షర్మిల కూడా దాదాపు అదే సందిగ్ధాన్ని ఎదుర్కొనబోతున్నారు. ఆంధ్రప్రదేశ్



■ కె. శ్రీనివాస్

సందర్భం

కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేయడానికి ఆమె ప్రయత్నం ప్రారంభించారు. అయితే, ఉన్నట్టుండి వెంటనే ఆ పార్టీ బలశాలిగా మారలేదు. ఎంతో కొంత బలం పుంజుకుని, కొద్దిపాటి ప్రభావాన్ని మాత్రమే వేయగలుగుతుంది. కాంగ్రెస్ సమీకరించగలిగే ఓట్లు, జగన్ బలాన్ని చీల్చితే తెలుగుదేశం పార్టీకి మేలు జరుగుతుంది. లేదా, ఏదో పెనుమార్పు జరిగి పెద్ద సంఖ్యలో ఆమె పక్షాన మోహరింపు సాధ్యపడితే- అందువల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలి జగన్‌కే ప్రయోజనం చేకూరవచ్చు. టీడీపీకి అయినా, వైసీపీకి అయినా షర్మిల కృషి ఉపయోగపడడం కాంగ్రెస్ విధానాలకు అనుకూలం అవుతుందా? ఆ రెండు పార్టీలూ కేంద్రంలో బీజేపీకే మద్దతు ఇచ్చే పక్షంలో, కాంగ్రెస్ తన జాతీయ ప్రత్యర్థికి మేలు చేసినట్టు కదా? ఇప్పటివరకు అయితే, షర్మిల జగన్‌ను, బీజేపీని ఘాటుగా విమర్శిస్తున్నారు. చంద్రబాబు జోలికి అంతగా పోవడం లేదు. చంద్రబాబు బీజేపీని వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టమైన వైఖరి తీసుకోగలిగితే, వామపక్షాలు, ప్రజాసంఘాలతో పాటు, కాంగ్రెస్ బేషరతు మద్దతుకూడా లభిస్తుంది. కానీ, అంతటి సాహసం ఆయన చేస్తారా? రామమందిర ప్రాణప్రతిష్ఠకు వెళ్లి నరేంద్రమోదీ ప్రాభవాన్ని కళ్లారా చూసిన తరువాత, సాధారణ ఎన్నికలలో బీజేపీ మరింత బలం పెంచుకుంటుందన్న ఊహాగానాలు వినిపిస్తున్న తరుణంలో బీజేపీకి దూరం అని స్పష్టంగా చెప్పడం అంత సులభమేమీ కాదు. కానీ, రిస్క్ తీసుకోగలిగితే, విజయానికి అదనపు మెట్లు సమకూరతాయి.

> ప్రధాన పార్టీలతో, వాటి వైఖరులతో నిమిత్తం లేకుండా, ప్రజాస్వామిక సమాజం తన పని చేసుకుపోవాలి. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన, చేస్తున్న అన్యాయాలను చెప్పడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ దుష్పరిపాలనను ఎండగట్టాలి. వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలు ఉత్తరదేశమంతా ఏకపక్షంగానే ఉండవచ్చు, తక్కిన దక్షిణాది వలెనే ఏపీ కూడా తన ప్రత్యేకతను ఎందుకు చూపగూడదు?

ప్రధాన పార్టీలతో, వాటి వైఖరులతో నిమిత్తం లేకుండా, ప్రజాస్వామిక సమాజం తన పని చేసుకుపోవాలి. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు చేసిన, చేస్తున్న అన్యాయాలను చెప్పడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ దుష్పరిపాలనను ఎండగట్టాలి. దేశాన్ని ఆవరిస్తున్న మతతత్వ నియంతృత్వాన్ని వ్యతిరేకించేవారిని సమీకరించి, తమతో ఏకీభవించేవారికే వారు ఓటు వేస్తారన్న వాతావరణం కల్పించాలి. అటువంటి భావాలకు అనుకూలత పెరిగితే, ప్రధాన పార్టీలు కూడా తమ వైఖరిని సమీక్షించుకోవచ్చు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ తనకు తిరుగులేని మద్దతుగా మారుతున్న ప్రభుత్వ వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకుంటే ధైర్యం చేయవచ్చు. ప్రజల అండదండలు ఉండగా, ఎవరి తెరవెనుక మద్దతో తనకెందుకు అనుకుంటే, స్వేచ్ఛాయుతమైన విజయాన్ని అందుకోవచ్చు. వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాలు ఉత్తరదేశమంతా ఏకపక్షంగానే ఉండవచ్చు, తక్కిన దక్షిణాది వలెనే ఏపీ కూడా తన ప్రత్యేకతను ఎందుకు చూపగూడదు?

ఆసరా కాదు.. అక్కచెల్లెమ్మలకు టోకరా

ప్రతి బహిరంగ సభలో నా అక్క చెల్లెమ్మలు అంటూ రాగాలు తీసే జగన్‌రెడ్డి పాలనలో మహిళకు చేసింది శూన్యం. జనాన్ని వంచించడంలో ఆయన్ని మించిన ఘనులు లేరు. మా మెనిఫెస్టో బైబిల్, ఖురాన్‌తో సమానం అని మహిళలను బులిపించి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి, అన్ని డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా అని చెప్పి వారికి పంగనామాలు పెట్టారు. ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలుచేశామని గప్పాలు చెబుతున్నారు. రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే, 79 లక్షల మందికే ఆసరా అంటూ, సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75శాతం మందికి టోకరా వేయడం జగన్ మోసకారితనానికి నిదర్శనం. కోటిమందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళల్లో ఆసరా వల్ల లబ్ధిచేకూరేది 25 శాతం మందికి మాత్రమే. అందులోనూ... ఐదు, పదివేలు రుణం తీసుకున్న వారే ఎక్కువ.

ఏప్రిల్ 11, 2019న ఖాతాలో నిల్వ ఉన్న రుణ మొత్తాన్ని నాలుగు వాయిదాలలో జగన్ రద్దు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళల గ్రూపులకు సరాసరి లక్షా, లక్షన్నరకు మించి ఏ బ్యాంకులు రుణాలు ఇవ్వవు. బీసీలకు రూ.2 నుంచి 3 లక్షలు మాత్రమే ఇస్తాయి. మిగిలిన వర్గాలకు రూ.5 నుంచి 15 లక్షల వరకు రుణాలు ఇస్తాయి. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మహిళలకు అతి తక్కువగా మాత్రమే రుణాలు రద్దయ్యాయి. పైకి నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని కల్లబొల్లి మాటలు చెప్పే జగన్‌రెడ్డి ఆచరణలో వారికి పథకాల ఫలాలు దూరం చేసి, దగా చేస్తున్నారు. డ్వాక్రా మహిళల జీవనప్రమాణాలు తిరోగమన బాట పట్టడంతో అన్ని వర్గాలు, అన్ని రంగాలు దెబ్బతిన్నాయి.



టీడీపీ హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.5 లక్షల వరకు వర్తింపజేశారు. తాను అధికారంలోకి వస్తే దానిని రూ.10 లక్షలకు పెంచుతానని నమ్మించిన జగన్, తీరా అధికారంలోకి రాగానే దానిని రూ.3 లక్షలకు కుదించి మహిళలను మోసం చేశారు. ఆ మూడు లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోంది, ఇక జగన్‌రెడ్డి ఇచ్చిందేంటి? వృద్ధాప్యంలో ఆదుకుంటాయని డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2,118 కోట్ల అభయహస్తం నిధులను కూడా దారి మళ్లించారు. ఉన్నతి పథకంతో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చంద్రబాబు రూ.800 కోట్లిస్తే.. జగన్‌రెడ్డి ఆ పథకాన్ని రద్దు చేశారు. 45 ఏళ్లకే పెన్షన్ అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసి, చేయూత అంటూ దగా చేశారు. రూ.1.80 లక్షలు అందాల్సిన సాయానికి గండికొట్టారు. ప్రభుత్వ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలను తరలిస్తూ అందుకయ్యే ఖర్చును కూడా వారితోనే పెట్టించి డ్వాక్రా సంఘాల నిధులు హారతి కర్పూరంలా కరిగించారు. నిత్యావసరాల ధరలు, అప్పులు, పన్నులు, ఛార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపారు.

> ఆర్థికంగా అభివృద్ధి చెంది మహిళలు తమ కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో వారి ఆర్థిక స్వావలంబన కోసం చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుడితే, జగన్‌రెడ్డి వాటిని నిర్వీర్యం చేశారు. గ్యారంటీ లేనిదే పైసా అప్పు ఇచ్చేది లేదని రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకులు తేల్చి చెప్పడంతో, పొదుపు మహిళలు దశాబ్దాలుగా పైసా పైసా కూడబెట్టుకుని బ్యాంకుల్లో జమచేసుకున్న రూ.8,702 కోట్ల మూలధనాన్ని కొల్లగొట్టేస్తున్నారు. ఇంకా ఏ మొహం పెట్టుకొని నేనే రాష్ట్రానికి కావాలంటున్నారో మరి జగన్‌రెడ్డి?

తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని పక్కాగా అమలు చేసింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక ఉన్న డ్వాక్రా రుణాలు రూ.13,655. డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికీ రూ.10,000 చొప్పున రూ.8,500 కోట్ల రుణాలు మాఫీ చేశారు. అందరికీ సమన్యాయం చేయాలనే లక్ష్యంతో పసుపు–కుంకుమ కింద 2018–19లో రూ.10 వేల కోట్లు చెల్లించారు. వడ్డీ రాయితీ కింద రూ.2,514 కోట్లు చెల్లించారు. అయినా టీడీపీ రుణమాఫీ చేయలేదంటూ జగన్‌రెడ్డి ప్రచారం చేశారు. మరోవైపు 2014 ఏప్రిల్ 1 నాటికి డ్వాక్రా సంఘాల ఎన్‌పిఏలు 10.33 శాతం (SLBC 182) ఉండగా, 2019 ఏప్రిల్ 1 నాటికి 1.56 శాతానికి తగ్గించిన ఘనత చంద్రబాబుది (SLBC 206). అయినా.. ఎన్‌పిఏలు 18 శాతం అంటూ నిస్సిగ్గుగా అబద్ధపు రాతలు రాశారు. 2019 ఏప్రిల్ 1 నాటికి డ్వాక్రా సంఘాల అవుట్ స్టాండింగ్ అమౌంట్ రూ.27,571 కోట్లు. దాన్ని చూపించి డ్వాక్రా సభ్యులు అప్పుల్లో కూరుకుపోయారని చెప్పడం వారి బుద్ధి రాహిత్యానికి అద్దం పడుతోంది. అదే నిజమైతే.. 2023 అక్టోబర్ 10 నాటికి (SLBC 224) డ్వాక్రా సంఘాల మొత్తం రుణాలు రూ.58,598 కోట్లున్నాయి. అంటే అప్పటికంటే ఇప్పుడు ఇంకా అప్పుల్లో కూరుకుపోయినట్లా? ఆర్థికంగా అభివృద్ధి చెంది మహిళలు తమ కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో వారి ఆర్థిక స్వావలంబన కోసం చంద్రబాబు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుడితే, జగన్‌రెడ్డి వాటిని నిర్వీర్యం చేశారు. గ్యారంటీ లేనిదే పైసా అప్పు ఇచ్చేది లేదని రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకులు తేల్చి చెప్పడంతో, పొదుపు మహిళలు దశాబ్దాలుగా పైసా పైసా కూడబెట్టుకుని బ్యాంకుల్లో జమచేసుకున్న రూ.8,702 కోట్ల మూలధనాన్ని కొల్లగొట్టేస్తున్నారు. ఇంకా ఏ మొహం పెట్టుకొని నేనే రాష్ట్రానికి కావాలంటున్నారో మరి జగన్‌రెడ్డి? ఆయన్ని భరించడానికి మహిళా లోకం సిద్ధంగా లేదు.

డ్వాక్రా వ్యవస్థ ఏర్పాటుతో మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే కాకుండా.. ఎవరూ ఊహించని విధంగా అంతర్జాతీయ వేదికలపై మహిళల్ని నిలబెట్టిన ఘనత చంద్రబాబుది. దేశంలోనే తొలిసారిగా దళిత మహిళకు స్పీకర్ పదవి; మహిళా కండక్టర్ నియామకం, దీపం పథకం కింద 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు; మహిళల పేరు మీదనే ఇళ్ల పట్టాలు–భూముల కొనుగోలు; డ్వాక్రా మహిళలకు రైతు బజార్లు, ఇసుక ర్యాంపుల నిర్వహణ బాధ్యతలతో మహిళా శక్తిని గుర్తించింది టీడీపీయే. తెలుగు రాష్ట్రాల్లో మహిళలు సాగిస్తున్న ప్రగతికి తెలుగుదేశం ప్రభుత్వం వేసిన పునాదులే కారణం. మహిళలకు ఆస్తిహక్కు, రాజకీయంగా 9శాతం రిజర్వేషన్లు, స్త్రీ అభ్యున్నతికి పద్మావతీ మహిళా వర్సిటీ ఏర్పాటు, స్థానిక సంస్థలు, కళాశాలలు, ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేసింది తెలుగుదేశమే. మహిళలకు 11 రకాల ఉచిత వైద్యపరీక్షలు, రక్ష పథకం కింద బాలికలకు ఉచిత శానిటరీ నాప్‌కిన్లు, సామూహిక శ్రీమంతాలు, పెళ్లి కానుక పథకం, తల్లికి వందనం, కిషోర్ బాలికా సంరక్షణ పథకం, గృహిణి, రోషిణి, ముస్లిం మహిళలకు డ్వామా వంటి పథకాలు విజయవంతంగా అమలు చేశారు. మద్య నిషేధం చేస్తామని మహిళల ఓట్లు వేయించుకున్న జగన్, నాసిరకం మద్యంతో మహిళల మాంగళసూత్రాలు తెంచారు. డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారు. స్త్రీ నిధి, ఉన్నతి రద్దు చేశారు. ఎన్టీఆర్ బేబీ కిట్లు, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్, దీపం పథకాలు నాశనం చేశారు. బాలింతలకు రూ.5 వేలు పథకం నిలిపివేశారు. పెళ్లి కానుక పథకాన్ని రద్దు చేసి, కళ్యాణమిత్రల్ని రోడ్డున పడేశారు.

తప్పులు చేసినవాడు అయినా మారతాడేమో కానీ మోసం చేసే బుద్ధి ఉన్నవాడు మారడు. సంక్షేమ పథకాలను అక్కచెల్లెమ్మల ఓట్ల కోసం వాడుకొని, అవసరం తీరాక వాటి కోతలకు పూనుకోవడం వంటి చర్యలకు పాల్పడి, వాటిపై ఆధారపడిన వారిని మోసం చేశారు జగన్‌రెడ్డి. వైసీపీది చరిత్ర ఎరుగని మోసంగా డ్వాక్రా మహిళలు అర్థం చేసుకోవాలి. ఇటువంటి మహిళా ద్రోహి ప్రభుత్వాన్ని సాగనంపడానికి మహిళాలోకం కదలాలి.

■ ఆచంట సునీత
తెలుగునాడు అంగన్‌వాడీ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షురాలు

రాయలసీమ 'ఉద్యమాల పెద్దన్న'

రాయలసీమలో పెద్దన్నగా పేరుగాంచిన ఒక ధిక్కార స్వరం, పీడిత ప్రజల పెద్ద గొంతుక జనవరి 14వ తేదీన 76 సంవత్సరాల వయసులో మూగబోయింది. ఈయన పీడిత ప్రజలకోసం నిరంతరం పరితపిస్తూ, కడవరకూ ప్రజాందోళన కార్యక్రమాలలో భాగస్వామి అయి, 'ఉద్యమాల పెద్దన్న'గా పేరుపొందారు. ముఖ్యంగా భారత విప్లవోద్యమ నాయకుడు తరిమెల నాగిరెడ్డి వారసత్వాన్ని కొనసాగించిన అనంతపురం నివాసి పెద్దన్నకు 14వ తేదీ సాయంత్రం సీపీఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర నాయకత్వంతో పాటు, వివిధ విప్లవ పార్టీలు, ప్రజా సంఘాలు, ఆయన నిర్మాణం చేసిన వివిధ కాలనీల ప్రజలు, వివిధ సంఘాల కార్మికులు కడసారి ఘనంగా వీడ్కోలు పలికాయి.



సామాజికంగా అణచివేతకు గురయ్యే రజక వృత్తి కులంలో జన్మించిన పెద్దన్న, తరిమెల నాగిరెడ్డి రాజకీయాలకు వారసునిగా, నాయకునిగా గుర్తింపు పొందారు. సీపీఐ (ఎం–ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యునిగా, పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శిగా, రీజనల్ కమిటీ సభ్యునిగా పలు ముఖ్యమైన బాధ్యతలను పెద్దన్న నిర్వహించారు. విప్లవ కార్మిక సంస్థ ఏఐఎఫ్‌టియు(న్యూ) కేంద్ర కార్యవర్గసభ్యునిగా, రాష్ట్ర అధ్యక్షునిగా చివరివరకు బాధ్యతలు నిర్వహించారు.

1974లో యువజన కాలనీ ఏర్పాటు, అనంతపురం పట్టణంలో హెచ్‌ఎల్‌సి కాలనీతో పాటు, నాగిరెడ్డి భవన్ పేరుతో పార్టీ కార్యాలయం, నాగిరెడ్డి సొంత గ్రామం తరిమెలలో స్థూపంతో పాటు భవనాన్ని నిర్మించారు. పార్టీ సీనియర్ నాయకులు మండ్ల సుబ్బారెడ్డి పేరుతో కాలనీ, కమ్యూనిటీ భవనం, స్థూపం నిర్మించారు. అలానే మరికొన్ని కాలనీలను నిర్మించి వేలాది శ్రామిక కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన రజక కుటుంబాల కోసం పోరాడి 'రజక నగర్'ను నిర్మించారు. అనంతపురం వ్యాప్తంగా విస్తరించిన అసంఘటిత రంగంలోని కార్మికులను యూనియన్లలోకి సంఘటితం చేసే కృషి జరిపారు. తెలుగుగంగ హెచ్‌ఆర్ కార్మికులను సంఘంగా ఏర్పరచి, వారి హక్కులకై పోరాడారు. శ్రోత్రియం భూముల సమస్య, ఈనాం భూములు, కణేకల్లులో పేదల ఇళ్ళ నిర్మాణం, రాయదుర్గం చేనేత కార్మికుల సమస్యలు, భగత్‌సింగ్ కాలనీ నిర్మాణం తదితర అంశాలలో తిమ్మారెడ్డితో కలిసి జిల్లా ఉద్యమ నిర్మాణంలో పెద్దన్న భాగస్వాములయ్యారు.

అనారోగ్యం వెంటాడుతున్నా కడదాకా ప్రజా కార్యక్రమాలలో మనోధైర్యంతో పాల్గొన్నారు. పార్టీలో, కుటుంబంలో ఒడిదొడుకుల నడుమ మార్క్సిజం పట్ల, పార్టీ నాయకత్వం పట్ల దృఢమైన విశ్వాసంతో ఆఖరి శ్వాస వరకు కొనసాగిన పెద్దన్నకు జోహార్లు.

– ముప్పాళ్ళ భార్గవశ్రీ, సీపీఐ ఎంఎల్ నాయకులు

కాపులకు ఇదే మంచి తరుణం!

గత పది సంవత్సరాలుగా, అంటే 2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు నాయుడు సుదీర్ఘ పాదయాత్ర ప్రారంభించిన నాటి నుంచి ఆంధ్రలో కాపులకు రాజకీయంగా మంచి కాలం మొదలైనట్టుగా కనబడుతున్నది. సంఖ్యాపరంగా ఏ ఒక్క కులం కంటే కూడా కాపు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి) కులస్థులు అధిక సంఖ్యలో ఉన్నారనే భావం సమాజంలో ఉండడంతో రాష్ట్ర రాజకీయాల చూపు కాపు కులం పైకి మళ్ళింది.

కాపులలో దాదాపు 75శాతానికి పైబడి ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారనడంలో మరో అభిప్రాయానికి తావు లేదు. గ్రామాల్లో అయితే చిన్నపాటి రైతులు, రైతు కూలీలు, చిన్న చిన్న జీవనోపాధి వృత్తులు; పట్టణాల్లో అయితే చిన్న చిన్న రోజువారీ వృత్తులు, ఆటో ఇతర వాణిజ్య వాహనాల డ్రైవర్లుగా, హెల్పర్లుగా, రోడ్ల పక్కన చిన్న చిన్న రోజువారీ వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకునే వారిగా కాపులు పెద్ద సంఖ్యలో కనిపిస్తూ ఉంటారు. విద్య, ఉపాధి వ్యవహారాలలో వారికి ప్రభుత్వం చేయూత ఇవ్వాల్సిన అవసరాన్ని 2014 ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా చంద్రబాబు నాయుడు పదే పదే ప్రస్తావించారు. నిజానికి, కాపుల ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని అంత బలంగా, స్పష్టంగా, సూటిగా ప్రస్తావించిన ఆ స్థాయి నాయకుడు చంద్రబాబు కంటే ముందు ఎవరూ లేరు.

2009 ఎన్నికలకు ముందు అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర రెడ్డి కాపుల సమస్యను ప్రస్తావించినప్పటికీ ఆ ప్రస్తావనలో 'ఫోర్స్' లేదు, కమిట్‌మెంట్ కనపడలేదు. అందుకే 2009 ఎన్నికల్లో గెలిచిన తరువాత రాజశేఖర రెడ్డి ఆ ప్రస్తావన తీసుకురాలేదు.

కాపులకు రిజర్వేషన్ అంశంపై, చంద్రబాబు నాయుడు మాటల్లో వ్యక్తమైన సీరియస్‌నెస్ రాష్ట్రంలోని కాపుల ఇంటింటికీ చేరింది. చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడితే తమ చిరకాల స్వప్నం అనుభవంలోకి వస్తుందని కాపులు ఆశించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక, కాపులకు సంబంధించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పేద కాపులకు విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కాపుల అభ్యున్నతికి సంబంధించి, ప్రభుత్వపరంగా ఇది పెద్ద ముందడుగు.

రిజర్వేషన్లకు సంబంధించి బీసీలలో తలెత్తిన అపోహల నేపథ్యంలో చంద్రబాబు నాయుడు నిర్ణయం మాత్రం తీసుకోలేకపోయారు. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తే

> కాపుల ఆర్థిక, సామాజిక వెనుకబాటును దృష్టిలో పెట్టుకుని సానుకూల దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని పవన్ కళ్యాణ్, ముద్రగడ పద్మనాభం తదితర నేతలు గుర్తించాలి. ఎన్నికల తరువాత ఏర్పడబోయే ప్రభుత్వాధినేతతో సానుకూలంగా, సౌమ్యంగా వ్యవహరించడం ద్వారా కాపు సమస్యకు పరిష్కారం సాధించాలి.



స్థానిక సంస్థల పాలక వర్గాలలో ప్రస్తుతం బీసీలకు గల రిజర్వేషన్లు కాపులకూ వర్తిస్తాయని బీసీలలో ఆందోళన వ్యక్తం అయింది. తెలుగుదేశం పార్టీకి వెన్నెముక లాంటి బీసీ వర్గంలో తలెత్తిన ఈ ఆందోళనను ఎలా హ్యాండిల్ చేయాలన్నది ప్రభుత్వానికి కూడా ఒక పట్టాన అర్థం కాలేదు. కాపులకు రిజర్వేషన్ కోసం అప్పటి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి గ్రామమే కార్యక్షేత్రంగా మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఒక పక్క, ఇటు బీసీలలో ఎగసిపడుతున్న ఆందోళనలు రెండో పక్క... మధ్యలో చంద్రబాబు నాయుడు నలిగిపోయారు.


నిజానికి కాపుల విద్య ఉపాధి అవకాశాలలో రిజర్వేషన్లకు బీసీలు వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదు. కాపులు సంఖ్యాపరంగా బాగా ఎక్కువగా ఉన్నందున స్థానిక సంస్థల పాలక వర్గాలలో తమకు ఉండే రిజర్వేషన్లలో అధిక భాగం వారికి వెళ్ళిపోతాయేమో అని మాత్రమే బీసీలు ఆందోళనకు లోనయ్యారు. విషయం చాలా సున్నితంగా తయారైంది.

అగ్రవర్ణాలుగా గుర్తింపు పొందుతున్న బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, కమ్మ, వెలమ మొదలైన కులాల సరసనే కాపు కులం కూడా ఉంటున్నప్పటికీ రాష్ట్రంలో ఒక పెద్ద కులంగా ఉన్న కాపుల ఆర్థిక వెనుకబాటును దృష్టిలో పెట్టుకుని, విద్య ఉపాధిలో రిజర్వేషన్లు కల్పిస్తే బీసీలకు అభ్యంతరం ఉండదని, కాపులకూ అభ్యంతరం ఉండదని కాకినాడకు చెందిన గోకేడ రాంబాబు అప్పటి హోమ్ మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు కూడా పూర్తిగా కన్విన్స్ అయ్యారు. అప్పటి దాకా ఆయనకు ఈ ఐడియా తట్టలేదు. 'ఒక మొండి సమస్యకు పరిష్కారం చూపెట్టారు, థాంక్స్ రాజప్పా...' అంటూ వారిద్దరినీ ముఖ్యమంత్రి అభినందించారు.

విద్య, ప్రభుత్వ ఉపాధి రంగాలలో కాపులకు 5శాతం రిజర్వేషన్ వర్తింపచేయడానికి చంద్రబాబు సన్నద్ధం అయ్యే నాటికి, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి 10శాతం వర్తింప చేస్తూ కేంద్రం రాజ్యాంగ సవరణ చేసింది. ఆ పది శాతంలో ఐదుశాతం కాపులకు వర్తింప చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్క నిముషంలో నిర్ణయం తీసుకుంది. కాపుల కల దాదాపుగా నెరవేరింది. కానీ అది అమలులోకి రాకుండానే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఆ విధంగా కాపు బిడ్డలకు విద్య, ఉపాధి అవకాశాలలో చంద్రబాబు పెట్టిన రిజర్వేషన్ ముద్ద వారి నోటికి అందకుండాపోయింది.

కాలగమనంలో ఐదు సంవత్సరాలు గడిచాయి. మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయి. చంద్రబాబుపై అప్పుడు వరద గోదారిలా విరుచుకుపడిన ముద్రగడ పద్మనాభం ఇప్పుడు జనసేన పార్టీ పట్ల సానుకూల భావనతో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. కాపు కమ్యూనిటీకి సంబంధించినంత వరకు ఇదొక సానుకూల పరిణామం. కాపుల ఆర్థిక, సామాజిక వెనుకబాటును దృష్టిలో పెట్టుకుని సానుకూల దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని పవన్ కళ్యాణ్, ముద్రగడ పద్మనాభం తదితర నేతలు గుర్తించాలి. ఎన్నికల తరువాత ఏర్పడబోయే ప్రభుత్వాధినేతతో సానుకూలంగా, సౌమ్యంగా వ్యవహరించడం ద్వారా కాపు సమస్యకు పరిష్కారం సాధించాలి. 'కాపులకు రాజ్యాధికారం' అంటే ఏదో ఎక్కడో లేదు. వారి పిల్లలకు విద్య, ప్రభుత్వ ఉపాధి మార్గాల మెరుగుదలలో ఉంది. రాజకీయాలు పక్కన బెట్టి వీరి వెనుక ఏపీలోని కాపులు సంఘటితం కావడంలో విజ్ఞత ఉంది. కాపు కుల అభ్యున్నతి ఉంది. అందుకు, ఇదే తగిన సమయం. రాజకీయాలు ఎందుకు? రోటీ, కపడా, ఔర్ మకాన్ కావాలి గానీ!

● భోగాది వేంకట్రాయుడు



వందనాలమ్మా..!

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రానికి నూరేళ్లు



ఆ కొండ ఆధ్యాత్మికతకు ఆలవాలం. మతసామరస్యానికి నిలయం. అది ఒక్క కొండ మాత్రమే కాదు.. ఖండాంతరాలకు విస్తరించిన మనదేశ ఖ్యాతి. దక్షిణ భారతంలో రెండో అతిపెద్ద మరియ మాత గుడి. ఇది నిన్న.. మొన్నటి కథ కాదు. వందేళ్ల నాడు పురుడు పోసుకున్న చరిత్ర. బ్రిటీష్ పాలనలో పునాది వేసుకున్న ఈ పుణ్యక్షేత్రం నూరు వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను వేడుకగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో మేరీమాత తిరునాళ్ల ప్రారంభ సూచికగా నవదిన ప్రార్థనలకు శ్రీకారం చుట్టారు. వందేళ్ల గుర్తుగా ఈ ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది.

- దక్షిణ భారతంలో రెండో అతిపెద్ద మరియ క్షేత్రం
- 1924లో ఏర్పాటుచేసిన బ్రిటీష్ ప్రభుత్వం
- 1971లో పూర్తిస్థాయి చర్చిగా అవతరణ
- 1947 నుంచి ఏటా మేరీమాత ఉత్సవాలు
- ఘనంగా నవదిన ప్రార్థనలు ప్రారంభం
- ఈనెల 9, 10, 11 తేదీల్లో తిరునాళ్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దక్షిణాదిలో ఉన్న అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో గుణదల రెండోది. తమిళనాడులోని వేళంగిణీ మాత ఆలయం తర్వాత అంతటి ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ వెలసిన లూర్దుమాత విగ్రహం ఫ్రాన్స్ దేశంలోని లూర్దు నగరంలో ఉన్న మేరీమాత విగ్రహాన్ని పోలి ఉంటుంది. ఈ విగ్రహం ఒక గుహలో ఉంటుంది. ఏటా ఫిబ్రవరి 9 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఫ్రాన్స్‌లోని లూర్దు నగర శివారులో ఉన్న కొండ దిగువన వంట చెరుకు ఏరుకోవడానికి బెర్నడెట్ అనే బాలిక వెళ్లింది. ఆమెకు మేరీమాత ఒక స్త్రీ రూపంలో కనిపించి మాట్లాడింది. ఈ విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. మేరీమాత బాలికకు కనిపించిన ఫిబ్రవరి 11వ తేదీని గుర్తు చేసుకుంటూ అక్కడ ఏటా ఉత్సవాలను నిర్వహిస్తారు.





శిఖరాగ్రాన శిలువ

అదే మాదిరిగా గుణదల పుణ్యక్షేత్రంలో 1924, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి ఉత్సవాలను ప్రారం భించారు. అదే సంవత్సరంలో బ్రిటీష్ ప్రభుత్వం గుణదలలో సెయింట్ జోసెఫ్ ఇన్‌స్టిట్యూట్ అనే అనాథ శరణాలయం ఏర్పాటు చేసింది. ఇటలీకి చెందిన ఫాదర్ పి.ఆర్లాటి దీనికి రెక్టార్‌గా నియ మితుల య్యారు. ఆయనే గుణదల కొండపై ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన గుహలో మేరీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. అప్పుడే మేరీమాత ఆలయానికి అంకురార్పణ జరిగింది. కాలక్రమంలో ఈ క్షేత్రానికి జనాదరణ పెరిగింది. దీంతో 1971వ సంవత్సరంలో పూర్తిస్థాయిలో చర్చిని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడికి క్యాథలిక్‌లు, అనాథ బాలలు, క్రైస్తవ మత కన్యలు వచ్చి మరియమ్మ ఉత్సవాలను నిర్వహించడం మొదలుపెట్టారు. 1947వ సంవత్సరంలో విజయవాడలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన క్యాథలిక్‌లు, ఫాదర్ ఆర్లాటి ఆధ్వర్యంలో కొండపై ఆరోగ్యమాతను ప్రతిష్ఠించి, గుహ ప్రాంగణంలో విశాలమైన దివ్య బలిపీఠాన్ని నిర్మించారు.

వాస్తవానికి 1946వ సంవత్సరంలో అప్పటి ఫాదర్ బియాంకి, జిప్రిడా, బ్రదర్ బెర్తోలి, ఎల్‌క్రిప్పా గుణదల కొండపై మరియమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, గుహ వద్ద భారీ బలిపీఠాన్ని నిర్మించా లని భావించారు. ఇందులో భాగంగా గుహ వద్ద శిలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. 1974లో ఫాదర్ బియాంకి అత్యవసరంగా ఇటలీకి వెళ్లాల్సి వచ్చింది. తర్వాత కురిసిన భారీ వర్షాలకు బలిపీఠం నిర్మాణాలు కొట్టుకుపోయాయి. ఫాదర్లు ఎక్కడా నిరుత్సాహం చెందకుండా బియాంకి తిరిగి వచ్చే సమయానికి బలిపీఠం పనులు పూర్తి చేయిం చారు. 1947లో ఇక్కడ భారీస్థాయిలో మేరీమాత ఉత్సవాలు నిర్వహించారు. కొండపై శిలువను ప్రతిష్ఠించారు. కాలక్రమంలో భక్తులు అక్కడికి వెళ్లడానికి మెట్లమార్గాన్ని అభివృద్ధి చేశారు. ఈ కాలిబాటలో క్రైస్తవులు పవిత్రంగా భావించే వయాడోలరోసా అనే 14 స్థలాల విశిష్టతను తెలియజేసే ఏసుక్రీస్తు జీవిత ఘట్టాలను ఏర్పాటు చేశారు.

పోలీస్.. పక్షపాతం



2022లో టీడీపీ నాయకులపై లాఠీచార్జి చేస్తున్న అప్పటి గుడివాడలోని వన్‌టౌన్ సీఐ గోవిందరాజు (ఫైల్)

వైసీపీకి అనుకూలంగా పోలీసులు.. గుడివాడలో మరీ ఘోరం

అధికార పార్టీ అయితే చాలు.. దాడికి దిగినా పెద్దగా పట్టించుకోరు.. కార్లను ధ్వంసం చేసినా కదలరు, మెదలరు.. కార్యాలయాలపై కొట్లాటకొచ్చినా చూస్తూ ఊరుకుంటారు.. రెచ్చగొట్టినా ఎందుకులే.. అని వదిలేస్తారు.. ప్రాణాలు తీసేందుకొచ్చినా పోనీలే.. అని పక్కకు తప్పుకొంటారు.. గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని అడుగులకు మడుగులొత్తుతూ, ప్రతిపక్షంపై పగ సాధిస్తున్నారు పోలీసులు. 2022లో అమరావతి పాదయాత్రికులపై దాడులు మొదలు.. మంగళవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీల వార్ వరకూ ప్రతిచోటా పోలీసుల పక్షపాత ధోరణి ప్రతిపక్ష టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రాణసంకటంగా మారింది. వైసీపీ అయితే చూసీచూడనట్టుగా ఉండటం, టీడీపీ అయితే లాఠీచార్జీలకు పాల్పడటం పరిపాటిగా మారింది.



కృష్ణలంకలో వివాదానికి కారణమైన ఫ్లెక్సీ ఇదే.. పోలీసుల జోక్యం తరువాత వైసీపీ ఫ్లెక్సీని అలాగే ఉంచి, జనసేన ఫ్లెక్సీని మాత్రం తొలగించారు

అడుగడుగునా టీడీపీ కార్యక్రమాలకు అడ్డు

- దాడులకు దిగుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని అనుచరులు
- పట్టనట్టుగా వ్యవహరిస్తున్న పోలీసులు
- 2022లో అమరావతి రైతులపై దాడితో మొదలు
- గతరాత్రి ఫ్లెక్సీల వార్ వరకూ ఏకపక్షమే..
- కృష్ణలంకలో యథాతథంగా వైసీపీ 'సిద్ధం' ఫ్లెక్సీలు
- జనసేన 'మేము సిద్ధమే' ఫ్లెక్సీలు మాత్రం తొలగింపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/గుడివాడ) : గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ గుడివాడ పోలీసులు స్వామిభక్తి చాటుకుంటున్నారు. వైసీపీ అల్లరిమూకలు, నాని ముఖ్య అనుచరులు టీడీపీ కార్యాలయాలు, వాహనాలు, ర్యాలీలపై దాడులకు తెగబడుతున్నా పోలీసులకు కనిపించవు. ఏమీ చేయకున్నా టీడీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారింది. 2022లో అమరావతి పాదయాత్రికులపై దాడులతో మొదలుపెట్టి ఈనెల 18వ తేదీ ఎన్టీఆర్ వర్ధంతి, మంగళవారం రాత్రి జరిగిన ఫ్లెక్సీల వివాదం వరకూ పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

అడుగడుగునా దాడులే..

- 2022లో శాంతియుతంగా సాగుతున్న అమరావతి మహాపాదయాత్రికులపై వైసీపీ నాయకులు అసభ్యంగా ప్రవర్తించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ వివాదంలో పోలీసులు ఒక్కరిపై కేసు నమోదు చేయలేదు.
- ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో 2022 సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కేసినో వ్యవహారంలో టీడీపీ నియమించిన నిజనిర్ధారణ కమిటీపై ఏకంగా ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ తదితరులు దాడిచేసి బొండా ఉమా కారును ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంలో కనీసం ఒక్క వైసీపీ నాయకుడిపై కేసు లేదు.
- 2022లో క్రిస్మస్ పర్వదినాన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు హత్యకు వైసీపీ నాయకుడు మెరుగుమాల కాళీ తన అనుచరులతో యత్నించినా పోలీసులు చూస్తూ ఉండిపోయారు. పెట్రోలు సంచులతో గడ్డం గ్యాంగ్ వీరంగం సృష్టించింది. పాత్రికేయులపై కూడా దాడి జరిగింది. పోలీసులకు విషయం తెలిసినా పరిస్థితిని సీరియస్‌గా తీసుకోలేదు. టీడీపీ శ్రేణులపై వన్‌టౌన్ సీఐ గోవిందరాజు తన ప్రతాపం చూపారు.
- 2023, జనవరి 18వ తేదీన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియానికి రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాదయాత్ర చేరుకోగానే, జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలతో వైసీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించుకుంటూ వచ్చారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరులు గుత్తా నాని, యార్లగడ్డ సత్యభూషణ్, యార్లగడ్డ మురళీకృష్ణ, అట్లూరి శశి, శొంఠి శశి తదితరులు టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబుతో వాగ్వివాదానికి దిగారు. అదే సమయంలో కొందరు వైసీపీ కార్యకర్తలు గుడ్లవల్లేరుకు చెందిన టీడీపీ

- మిగతా 6లో



దుష్టపాలన అంతానికి హోమం

- 6లో..

రాష్ట్రంలో దుష్టపాలన పోయి, టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో మంచిపాలన రావాలని, ప్రజలు సంతోషంగా జీవించాలనే సంకల్పంతో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులు బుధవారం హోమం చేశారు. గురునానక్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో జరిగిన హోమ క్రతువులో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మద్యంపై యుద్ధం

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 'మద్యంపై యుద్ధం' పేరిట బుధవారం లెనిన్ సెంటర్‌లో మహిళలు నిరసన చేపట్టారు. మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని మృతదేహంలా ఉంచి, మరో వ్యక్తి మందు కొడుతుండగా.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.

సీటీఎఫ్ ఏడీసీపీగా శ్రీహన్‌బాబు

- శాంతిభద్రతల విభాగం ఏడీసీపీ-2గా కనకరాజు

విజయవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సిటీ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా కృష్ణాజిల్లా అదనపు ఎస్పీ ఆర్.శ్రీహన్‌బాబు నియమితులయ్యారు. మంగళగిరిలోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో ఉన్న టి.కనకరాజును శాంతిభద్రతల విభాగం అదనపు డీసీపీ-2గా నియమించారు. రాష్ట్రంలో అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ సిటీ టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా ఉన్న జీవీ రమణమూర్తిని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. శాంతిభద్రతల విభాగం అదనపు డీసీపీ-2గా ఉన్న సీహెచ్ లక్ష్మీపతిని పల్నాడు జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. లక్ష్మీపతి ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌కు ఏడీసీపీగా వ్యవహరిస్తున్నారు. విజయవాడ హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఉన్న కేవీ ప్రేమ్‌జిత్‌ను విశాఖపట్నం హోంగార్డ్స్ విభాగానికి బదిలీ చేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు డీసీపీగా ఉన్న కె.శ్రీనివాసరావును ఇంటెలిజెన్స్ విభాగంలో ఏఆర్ అదనపు ఎస్పీగా నియమించారు. గుంటూరు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా ఉన్న కె.కోటేశ్వరరావును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు ఎటాచ్‌మెంట్ ఇచ్చారు. విశాఖపట్నం ఏఆర్, హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఉన్న యు.రామ్మోహనరావును విజయవాడలోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ)కు బదిలీ చేశారు.

ఆయువు తీసిన ఆటో

తండ్రి ఆటో కిందే పడి తనయుడు మృతి



ప్రమాదానికి కారణమైన ఆటో ఇదే.. (ఇన్‌సెట్‌లో) చిన్నారి రిషిక్ (ఫైల్)

- రెక్కాడితే కానీ డొక్కాడని జీవితం
- ఆటోపైనే 20 ఏళ్లుగా జీవనాధారం
- చిన్నారిని చిదిమేసిన ఆటో
- దుఃఖసాగరంలో మోటూరు

గుడివాడ రూరల్, జనవరి 31 : రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. అయినా ఆనందంగా సాగిపోతున్న సంసార సాగరం. ముద్దు ముద్దు మాటలు చెప్పే ఓ బాబు, మురిపెంగా చూసుకుంటున్న ఓ పాప. ఆటో వేయగా వచ్చిన డబ్బుతో ఆ దంపతులు ఏ చీకూ చింత లేకుండా ఉన్నదాంట్లోనే సంతోషంగా బతుకుతున్నారు. విధికి కన్నుకుట్టిందో ఏమో. ఆటో రూపంలో వచ్చి ఆ ఆనందాన్ని దూరం చేసింది. ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచేసింది. గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు వరిగంజి రిషిక్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి ఆటో కింద పడి రిషిక్ మృతిచెందిన ఘటనను వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. వరిగంజి మురళీకృష్ణ (35)కు 20 ఏళ్ల నుంచి ఆటోనే జీవనాధారం. రిషిత (30)తో వివాహమైనా, ఇద్దరు పిల్లలు పుట్టినా ఆటో నడపగా వచ్చిన డబ్బుతోనే జీవిస్తున్నారు. రోజూ మాదిరిగానే మురళీకృష్ణ ఆటో నడిపి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. 3 గంటల సమయంలో తిరిగి ఆటో తీసి ఇంజన్ స్టార్ట్ చేశాడు. అయితే, కుమారుడు వెనుకే ఉన్న విషయాన్ని మురళీకృష్ణ గమనించలేదు. ఆటోను వెనక్కి నడపగా, అక్కడే ఆడుకుంటున్న రిషిక్‌పైకి ఆటో చక్రం ఎక్కింది. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు గుడివాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లముందే విగతజీవిగా మారడంతో ఏరియా ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు. గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఓదారుస్తున్నప్పటికీ వారి రోదన ఆపలేదు.

వైసీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి రమేశ్

అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖర్



సింహాద్రి రమేశ్



సింహాద్రి చంద్రశేఖర్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో అభ్యర్థుల ప్రకటనకు వైసీపీ తెరదించింది. మచిలీపట్నం పార్లమెంట్ సహా దాని పరిధిలోని అన్ని స్థానాలకు దాదాపు అభ్యర్థులను ఖరారు చేసింది. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను ప్రకటించింది. మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము, పెనమలూరు నుంచి జోగి రమేశ్ పేర్లను ఇప్పటికే ప్రకటించగా, అవనిగడ్డ నుంచి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పేరును బుధవారం ప్రకటించారు. పామర్రు, గన్నవరం, గుడివాడ స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే, గుడివాడ నుంచి కొడాలి నాని పేరు లాంఛనమే. గన్నవరం నుంచి వంశీ పోటీపై అనుమానాలు ఉన్నా చివరికి ఆయనే అభ్యర్థిగా ఉండొచ్చని పార్టీ శ్రేణుల మాట. పార్టీ నుంచి ఆర్థిక దన్ను కోసమే వంశీ ఊగిసలాట ధోరణి కనబరుస్తున్నారని వారు చెబుతున్నారు. పామర్రు నుంచి కైలే అనిల్ విషయంలోనూ మార్పు ఉండకపోవచ్చని సమాచారం.

అనూహ్యంగా..

అవనిగడ్డ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ప్రముఖ టీడీపీ నాయకుడు సింహాద్రి సత్యనారాయణ తనయుడిగా, ప్రముఖ కేన్సర్ వైద్యుడిగా దివిసీమవాసులకు చంద్రశేఖర్ సుపరిచితులు. సౌమ్యుడిగా పేరొంది.. రాజకీయాలకు దూరంగా ఉండే సత్యనారాయణ వైసీపీ నుంచి రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం లేక..

మచిలీపట్నం ఎంపీగా సింహాద్రి రమేశ్‌ను బరిలోకి దింపడంపై వైసీపీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి. అవనిగడ్డ ఎమ్మెల్యేగా రమేశ్ ఎన్నో అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నారు. ఆయన దుందుడుకు వైఖరి పలుమార్లు వివాదాస్పదమైంది. ఈ పరిస్థితుల్లో ఆయన్ను ఎంపీగా బరిలోకి దింపడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఊహించని రీతిలో బాలశౌరి వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో ప్రత్యామ్నాయం కోసం వైసీపీ వెతుకులాట ప్రారంభించింది. పలు పేర్లు పరిశీలనలోకి వచ్చినా ఎవరూ మచిలీపట్నం నుంచి పోటీకి సుముఖత చూపలేదు. ప్రత్యామ్నాయం లేక రమేశ్ వైపు వైసీపీ పెద్దలు మొగ్గు చూపారని సమాచారం.

రెవెన్యూలో భారీగా బదిలీలు

- రెండు జిల్లాల్లో 56 మంది తహసీల్దార్లకు స్థానచలనం

- 6లో..

రెవెన్యూలో ఎన్నికల బదిలీలు

- ఉమ్మడి జిల్లాలో 56 మంది తహసీల్దార్లకు స్థానచలనం
- ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు బదిలీలు
- ఎన్టీఆర్, కృష్ణాజిల్లా డీఆర్‌వోల బదిలీ
- పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎన్నికలు తరుముకొస్తున్న వేళ.. ఎన్నికల విధుల్లో ప్రధానంగా భాగస్వామ్యమయ్యే రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వం భారీగా బదిలీలు నిర్వహించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలో డిప్యూటీ కలెక్టర్లు, డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (డీఏవో) సూపరింటెండెంట్స్, తహసీల్దార్లు భారీగా బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 56 మంది తహసీల్దార్లను ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు బదిలీ చేశారు. 8 మందికి బదిలీలు కల్పించలేదు. ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో)గా వల్లభనేని శ్రీనివాసరావును నియమించారు. ప్రస్తుతం డీఆర్‌వోగా ఇటీవలే వచ్చిన ఎస్‌వీ నాగేశ్వరరావును శ్రీకాళహస్తి దేవస్థానం ఈవోగా బదిలీ చేశారు. కృష్ణాజిల్లాకు చెందిన కె.ప్రేమంత్ కుమార్‌ను విజయవాడలోని ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ కల్పించారు.

జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ బదిలీలు ఇలా..

ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసే ఇంతియాజ్ పాషాను, కాకినాడ జిల్లా మెజిస్టీరియల్ సెక్షన్‌లో పనిచేసే బీ హేమకుమారి (ఎన్టీఆర్ కలెక్టరేట్)ను రాజమహేంద్రవరం జిల్లా, కోఆర్డినేషన్ సెక్షన్‌లో పనిచేసే సీహెచ్ దుర్గా ప్రసాద్ (ఎన్టీఆర్ కలెక్టరేట్)ను భీమవరం జిల్లాలకు బదిలీ చేశారు. తహసీల్దార్ల బదిలీల్లో ఎం పాల్ (రెడ్డిగూడెం)ను బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఎన్ సురేష్‌బాబు (తిరువూరు)ను భీమవరం జిల్లా, గడ్డం బాలకృష్ణారెడ్డి (గంపలగూడెం)ను కాకినాడ జిల్లా, చాట్ల వెంకటేశ్వర్లు (ఏ కొండూరు)ను ఏలూరు జిల్లా, ఎస్ నరసింహారావు (నందిగామ)ను కాకినాడ జిల్లా, జే సుశీల దేవి (చందర్లపాడు)ను భీమవరం జిల్లా, బీ అనయ్య (వీరులపాడు)ను కాకినాడ జిల్లా, ఎం సూర్యారావు (జగ్గయ్యపేట)ను కాకినాడ జిల్లా, కే లక్ష్మీ కల్యాణి (పెనుగంచిప్రోలు), ఎస్ శ్రీనివాసరావు (డీఏవో - విజయవాడ సబ్ కలెక్టర్)ను కాకినాడ జిల్లా, వీ రాజకుమారి (కేఆర్ఆర్‌సీ - సబ్ కలెక్టర్ విజయవాడ)ను కాకినాడ జిల్లా, ఎం శ్రీనివాసరావు (ఇబ్రహీంపట్నం)ను కాకినాడ జిల్లా, కాలి లక్ష్మి (విజయవాడ వెస్ట్)ను కాకినాడ జిల్లా, ఎం వెంకట రామయ్య (విజయవాడ తూర్పు)ను బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆర్‌వీవీ రోహిణీ దేవి (జీ కొండూరు)ను భీమవరం జిల్లా, ఎం.శ్రీనివాసు (మైలవరం)ను కాకినాడ జిల్లాలకు బదిలీ చేశారు.



డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

ఎన్నికల ప్రక్రియకు కమిషనర్‌ను దూరం పెట్టండి

▸▸ జిల్లా అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, జనవరి 31 : కొండపల్లి మున్సిపాలిటీలో మెజార్టీ సభ్యుల మనోభావాలను దెబ్బతీస్తూ అభివృద్ధిలో భాగస్వాములు చేయకుండా ఓటర్ల తుది జాబితా సమర్పించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిన కమిషనర్ (ఏఈఆర్‌వో) చింతకుంట్ల వెంకటేశ్వర్లును ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచాలని టీడీపీ కౌన్సిలర్లు, నేతలు బుధవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అడిషనల్ డైరెక్టర్ ఆశాజ్యోతికి, జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావులకు బుధవారం ఫిర్యాదు చేశారు. జంపాల సీతారామయ్య, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చెన్నుబోయిన చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్డుదారులకు రేషన్ పంపిణీ

▸▸ ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్

కృష్ణలంక : కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ ఫిబ్రవరి 1వ తేదీ గురువారం నుంచి ప్రారంభమవుతుందని జేసీ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఎండీయూ ఆపరేటర్లు గురువారం నుంచి ప్రతిరోజు ఉదయం 7 గంటలకు షెడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార ఫిబ్రవరి 1వ తేదీన గురువారం నుంచి 17వ తేదీ వరకు కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసేలా ఆదేశించామన్నారు. విటమిన్ ఎ, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12, ఐరన్ కలిపిన పోషక విలువలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేయుచున్నందున కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితోపాటు పట్టణ కార్డుదారులకు చిక్కీ, గోధుమ పిండిని కేజీ రూ.16కే ఇవ్వడం జరుగుతుందన్నారు. సరుకుల పంపిణీలో ఫిర్యాదులు వుంటే టోల్ ఫ్రీనెం.1967కు ఫిర్యాదు చేయాలని జేసీ తెలిపారు.

భూ హక్కుల చట్టంలో లోపాలను సరిచేయండి

రెవెన్యూ మంత్రి ధర్మానకు న్యాయవాదుల జేఏసీ విజ్ఞప్తి

వన్‌టౌన్, జనవరి 31: భూ హక్కుల చట్టంలో లోపభూయిష్టంగా ఉన్న అనేక సెక్షన్లను సరిచేయాలని న్యాయవాదుల జేఏసీ నేతలు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు విజ్ఞప్తి చేశారు. భూహక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో చర్చలకు రావాలని పిలుపురావడంతో బుధవారం జేఏసీ నేతలు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 508 రద్దు చేయడమో, లేదా కొంతకాలం పాటు సస్పెండ్ చేయడమే చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన హామీ రాతపూర్వకంగా ఇవ్వాలని, లేకుంటే ఆందోళనను విరమించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మంత్రి స్పందిస్తూ చట్టాన్ని ఇప్పుడే అమలు చేయడం లేదని, న్యాయవాదులు సూచించిన వాటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఒక ప్రకటన చేస్తామన్నారు. అభ్యంతరాలను నిశితంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. జేఏసీ చైర్మన్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ సుందర్, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే రాఘవరెడ్డి, విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, బెజవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, డీపీ రామకృష్ణ, యూ సునీల, అయ్యల రాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు పథకంతో నష్టపోతాం

ప్రత్యామ్నాయం చూపాలని మంత్రి బొత్సను కోరిన ఆటో కార్మికులు

వన్‌టౌన్, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వ ఉచిత బస్సు పథకంతో నష్టపోయే ఆటోకార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఐఎఫ్‌టీయూ నేతలు బుధవారం రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన నేతలు ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం యోచనతో ఆటో, మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారని, ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే పోలారి మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు మంచిదేనని, మరిన్ని పథకాలు అమలు చేయాలని, అయితే ద్వారా నష్టపోయే వర్గాలకు ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంత్రి స్పందిస్తూ కర్నాటక, తెలంగాణలో అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఇక్కడి ఆటో కార్మికులను ఎలా ఆదుకోవాలన్నదానిపై పరిశీలిస్తామన్నారు. నేతలు డి.శ్రీనివాసరావు, ఏ రవిచంద్ర, సీహెచ్ పెద్దిరాజు, డీ శ్రీధర్‌బాబు, పఠాన్ రఫీ, వై అప్పారావు, సీహెచ్ యాదగిరి, ఆర్ శ్రీనివాసరావు, బ్రహ్మం మంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం

- జర్నలిస్టు హౌసింగ్ స్కీం జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్

కృష్ణలంక, జనవరి 31: అర్హత ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఇంటిస్థలాలను మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేయనున్న ఇళ్లస్థలాలకు సంబంధించి జర్నలిస్టు హౌసింగ్ స్కీం జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్‌వో ఎస్‌వీ నాగేశ్వరరావుతో కలిసి జర్నలిస్టుల ఇళ్లస్థలాల మంజూరుపై చర్చించారు. జీవో నెం.535 ప్రకారం అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు మంజూరుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపారు. నిబంధనల మేరకు జిల్లాలో అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్సర్, వెటరన్ పాత్రికేయులకు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచిన అర్హతలు, నిబంధనల ప్రకారం స్థలాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, జిల్లా కార్యాలయం నుంచి ప్రాథమిక వెరిఫికేషన్ జరిగి జిల్లాకు 1,277 దరఖాస్తులు వచ్చాయని, ఆయా దరఖాస్తులను ఆయా మండల తహసీల్దార్లకు పంపి పరిశీలిస్తున్నట్టు తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించేందుకు అవసరమైన స్థలాలను త్వరగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లాస్థాయి కమిటీ సభ్యులు ఒ.వెంకటరామిరెడ్డి, తిరుమలరావు, పి.ఫణీంద్రరెడ్డి, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే

భూ హక్కు చట్టం రద్దు చేస్తాం

▸▸ న్యాయవాదులకు టీడీపీ నేతల హామీ
▸▸ దీక్షకు సీపీఐ రామకృష్ణ సంఘీభావం
▸▸ 43వ రోజుకు రిలే నిరసన దీక్షలు



న్యాయవాదుల రిలే దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ రామకృష్ణ, నెట్టెం, బొండా తదితరులు

విజయవాడ లీగల్, జనవరి 31 : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే సైకో ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం-2022 రద్దు చేస్తామని టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు నెట్టెం రఘురాం, బొండా ఉమ, దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), తదితరులు న్యాయవాదులకు హామీ ఇచ్చారు. భూ హక్కు చట్టం-2022ను వ్యతిరేకిస్తూ బెజవాడ బార్ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు 43వ రోజుకు చేరాయి. బుధవారం నాటి నిరసన దీక్షలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతి, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడపాటి లక్ష్మీనారాయణలతో పాటు 40మంది పాల్గొన్నారు. వీరికి సంఘీభావం ప్రకటించేందుకు వచ్చిన టీడీపీ నాయకులు మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, అధికారంలోకి వచ్చిన వెంటనే భూ హక్కు చట్టం-2022ను రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. సైకో జగన్ పాలనలో ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులతో పాటు న్యాయవాదులను కూడా రోడ్డెక్కించారని మండిపడ్డారు. త్వరలో జగన్‌ను ప్రజలు ఓటు ద్వారా ఇంటికి పంపడం ఖాయమన్నారు.

ప్రచార పిచ్చి పరాకాష్టకు : సీపీఐ రామకృష్ణ

ప్రభుత్వం ఇచ్చే అన్ని పాసుపుస్తకాలు, టైటిల్‌డీడ్ డాక్యుమెంట్లపైనా తాతల నాటి ఆస్తులను మార్పులు చేసినా రైతు ఫొటో ఒకటి వుంటే నాలుగైదు చోట్ల జగన్ బొమ్మ వేసుకోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వానికి ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరిందనిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. న్యాయవాదులు 43 రోజులుగా నిరసన దీక్షలు చేస్తూ వ్యతిరేకతను తెలియజేస్తున్నా ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. గ్రామ గ్రామాన, పట్టణాలు కూడళ్లలో ఆట పాటల ద్వారా భూ హక్కు చట్టం వలన కలిగే నష్టాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కూడా న్యాయవాదులపైనే వుందన్నారు.

ప్రజానాట్యమండలి కళాకారులు ఆట పాటల ద్వారా వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. అనంతరం న్యాయవాదులు సామూహికంగా వంటా వార్పు నిర్వహించారు. కార్యక్రమంలో బెజవాడ బార్ కార్యవర్గసభ్యులతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలి

చేతులకు సంకెళ్లతో న్యాయవాదుల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పెనుభూతం లాంటి భూహక్కు చట్టం రద్దు అయ్యేందుకు ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటు అనే



వజ్రాయుధంతో తగిన బుద్ధి చెప్పాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. మచిలీపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం భూ హక్కు చట్టాలను రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనలో మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం, సీనియర్ న్యాయవాది పోతురాజు తదితరులు మాట్లాడారు. న్యాయానికి సంకెళ్లు వేసి చీకటి చట్టంతో ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారన్నారు. నిరసన ప్రదర్శనలో న్యాయవాదులు పుప్పాల ప్రసాద్, టి.సత్యనారాయణ, కె.వి.ఎస్. ప్రకాశరావు, ఎండీ మస్తాన్, జి.శ్రీనివాస్, సర్వా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం కలిగించాలి : మండలి

చల్లపల్లి : భూ హక్కు చట్టం ద్వారా నిర్ణయాత్మక అధికారాలు తహసీల్దార్‌ల చేతుల్లో ఉంచటం అత్యంత ప్రమాదకరమనీ, ఈ చట్టానికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో భూ హక్కు చట్టం వల్ల కలిగే నష్టాలు, అనుసరించాల్సిన విధానాలపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టంపై ప్రభుత్వం వెనుకడుగు వేసేలా ఐక్యంగా పోరాడదామన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే చట్టాలను ఉల్లంఘిస్తు, అవినీతికి అధికారులే ఆజ్యం పోస్తున్న పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్ని చైతన్యం చేయాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది, జనసేన నేత మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ప్రజల ఆస్తులు, మనుగడకు ఇబ్బందికరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావటం



దురదృష్టకరమన్నారు. సీపీఐ రాష్ట్ర నేత వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టం ద్వారా ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని తెలిపారు. సీపీఎం నేత శీలం నారాయణరావు మాట్లాడుతూ, భూ హక్కులపై సమస్య ఏర్పడితే గ్రామీణ ప్రాంత రైతాంగం, సామాన్యులు హైకోర్టులో కేసు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందనీ, ఇది చాలా దుర్మార్గమన్నారు. సీపీఐ సీనియర్ నేత మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ పార్టీనేత జన్ను జగన్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గుణదల కొండపై స్మృతివనం

▸▸ మేరీ మాత శతాబ్ది మహోత్సవాల నవదిన ప్రార్థనలు ప్రారంభం
▸▸ మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ



పూర్వపు పీఠాధిపతి బిషప్ డోమ్నిని గ్రాసి కాంస్య విగ్రహం ఆవిష్కరణలో గురువులు

గుణదల, జనవరి 31 : గుణదలమాత నూరు వసంతాల మహోత్సవ నవదిన ప్రార్థనలు బుధవారం కనుల పండుగలా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజులు గుణదలమాత నూరు వసంతాల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ భక్తులనుద్దేశించి సందేశమిస్తూ దేవుని తల్లి అయిన మరియ మాతను ఆశ్రయిస్తే భక్తుల కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. నూరు వసంతాల మహోత్సవాల సందర్భంగా గుణదలమాత క్షేత్రం అభివృద్ధికి దోహదపడిన పూర్వపు పీఠాధిపతులు బిషప్ డోమ్నిని గ్రాసి, బిషప్ అంబ్రోస్ డి బతిస్తా, గురువులు ఫాదర్ అర్లాటి, ఫాదర్ బియాంకి, బ్రదర్ బెర్తోలి, బ్రదర్ క్రిప్పా, బ్రదర్ జియాని డేవిడ్‌ల పేరిట స్మృతివనం ఏర్పాటు చేసి వారి విగ్రహాలను ఆవిష్కరించడం ఆనందదాయకమన్నారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ.. వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండియా, నేపాల్ అపోస్తోలిక (పోప్) రాయబారి మహా ఘన లియోపోల్డో జిరెల్లి, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు హాజరుకానున్నారన్నారు. కొండపై నూతనంగా ఏర్పాటు చేసిన స్మృతివనం మహనీయుల నూతన విగ్రహాలను పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఆవిష్కరించారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బెంజిసర్కిల్ సెంట్ పాల్స్ కథెడ్రల్ నుంచి గుణదల మాత పుణ్యక్షేత్రం వరకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై లూర్దుమాతను భక్తులు భారీ ఊరేగింపు చేశారు. గురువులు సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు దివ్యప్రసాదం అందజేశారు.

ఆడుదాం ఆంధ్రాతో ప్రజల్లో క్రీడా సంస్కృతి

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక, జనవరి 31 : ప్రజల్లో క్రీడా సంస్కృతి ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్, జేసీ పి.సంపత్‌కుమార్‌తో కలిసి బుధవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభించారు. కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పతాకాన్ని జేసీ సంపత్‌కుమార్, 'ఆడుదాం ఆంధ్రా' పతాకాన్ని ముఖ్యఅతిథులతో కలిసి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆవిష్కరించారు. క్రీడాకారులు ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. క్రీడా స్ఫూర్తి ప్రతిజ్ఞ అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు విలువైన క్రీడాకారులను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు గత డిసెంబరు 26న జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రారంభమయ్యాయని ఆపై మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు విజయవంతంగా ముగిసాయని, బుధవారం జిల్లాస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో విజేత జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాయని, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బ్యాడ్మింటన్ కేటగిరిల్లో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. జిల్లాస్థాయి విజేతలు ఫిబ్రవరి 6 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జిల్లా స్థాయి పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, క్రీడాకారులకు రవాణా, భోజన, వసతి తదితర సదుపాయాలు కల్పించినట్టు కలెక్టర్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా నోడల్ అధికారి, జేసీ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం ఆనందించదగ్గ విషయమన్నారు. జిల్లాస్థాయిలో 69 మ్యాచ్‌లు జరుగనున్నాయని, పోటీలను విజయవంతం చేయాలన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలకు నగదు, ఇతర బహుమతుల కోసం రూ.12 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కూడా దక్కించుకోవచ్చని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేదలకు కేశినేని నాని, జగన్ ఏమిచ్చారో చెప్పాలి

▸▸ కొలికిపూడి శ్రీనివాసరావు

వన్‌టౌన్, జనవరి 31 : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) సేవాభావంతో పేదలకు అండగా ఉంటున్నారని, టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), సీఎం జగన్‌లు నేరుగా పేదలకు ఏమిచ్చారో స్పష్టం చేయాలని టీడీపీ నాయకుడు కొలికిపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు, లోకేశ్‌లపై విమర్శలు చేస్తే ప్రచారం జరుగుతుందన్న ఉద్దేశ్యంతో కేశినేని నాని అవాకులు చవాకులు పేలుతున్నాడన్నారు. దారితప్పిన శ్రీనివాస్ ఇష్టాను సారం వ్యవహరిస్తే టీడీపీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఎంపీ విజ్ఞత కోల్పోకుండా మర్యాదను కాపాడుకుని మాట్లాడాలని హితవు చెప్పారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్‌కు టీడీపీ ఐదుసార్లు అవకాశం ఇవ్వడమే కాకుండా ఆయన భార్యకు జడ్పీ పరిషత్ చైర్‌పర్సన్ ఇస్తే పార్టీకి ద్రోహం చేశారన్నారు. కేశినేని నాని వ్యాపారంలో నష్ట పోవడంలో పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు.

పోలీస్.. పక్షపాతం

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తను చెంపపై కొట్టడంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలోనూ పోలీసులు ఎవరిపై చర్య తీసుకోలేదు.

చంద్రబాబు పర్యటనలోనూ..

జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న చంద్రబాబు పర్యటనలోనూ పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. 2023, ఏప్రిల్ 13న చంద్రబాబు పర్యటన నేపథ్యంలో స్థానిక శరత్ థియేటర్ వద్ద వైసీపీ జెండాలను కట్టుకుని సుంకర శ్యామ్ అలియాస్ పెద్ద ఆవు టీడీపీ నాయకులపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. టీడీపీని, నాయకులను తిడుతూ హల్‌చల్ చేశాడు. మాగంటి బాబు అనుచరులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య బాహాబాహీ జరిగింది. ఈ వివాదాన్ని పోలీసులు చూసీచూడనట్టుగా వదిలేశారు.

- ఈనెల 18వ తేదీన స్థానిక బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియానికి బయల్దేరిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. వాహనాలకు అడ్డుగా పోలీసులు పెట్టిన బారికేడ్లను టీడీపీ శ్రేణులు తోసివేశారు. దీంతో అసహనానికి గురైన వన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు టీడీపీ కార్యకర్తపై లాఠీతో విరుచుకుపడ్డారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద అన్నదాన కార్యక్రమం దగ్గర ఉన్న ఎమ్మెల్యే నాని తన అనుచరులను టీడీపీ ర్యాలీపైకి ఉసిగొల్పారు. దీంతో నాని ముఖ్య అనుచరులు వల్లూరుపల్లి సుధాకర్, గుడ్లవల్లేరు బాబ్జీ తమ అనుచరులతో కలిసి ఒక్కసారిగా టీడీపీ ర్యాలీపైకి దాడికి తెగబడేందుకు ప్రయత్నించారు. ఒకదశలో వెనిగండ్ల రామును సైతం పోలీసులు అడ్డుకున్నారు.
- గుడివాడ మండలం వలివర్తిపాడులోని రీసర్వే నెంబర్ 180లోని రూ.కోట్ల విలువైన మధ్యతరగతి వారికి చెందిన 60 మందికిపైగా చెందిన ప్లాట్లను కబ్జా చేశారు. ఈ వ్యవహారంలో నాని ముఖ్య అనుచరుడిపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా.. దర్యాప్తు ఇంచు కూడా ముందుకు సాగలేదు.

జనసేన ఫ్లెక్సీలే తొలగించారు.. వైసీపీవి వదిలేశారు..

విజయవాడ కృష్ణలంకలో వైసీపీ ఏర్పాటుచేసిన సిద్ధం ఫ్లెక్సీలకు పోటీగా జనసేన నాయకులు మేమూ సిద్ధమే.. అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ వివాదం ముదిరి రెండుపక్షాల నడుమ ఘర్షణకు దారితీయడంతో పోలీసులు జోక్యం చేసుకుని జనసేన ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగించి, వైసీపీవి అలాగే ఉంచారు.



కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి

రాష్ట్రంలో మంచి పాలన రావాలని కేశినేని శివనాథ్ హోమం

వన్‌టౌన్, జనవరి 31 : రాష్ట్రంలో దుష్టపాలన పోయి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంచిపాలన రావాలని, ప్రజలు సంతోషంగా జీవించాలన్న సంకల్పంతో టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్(చిన్ని) దంపతులు హోమాలు నిర్వహించారు. గురునానక్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో హోమాలకు బుధవారం వేదమంత్రాల మధ్య మహాపూర్ణాహుతి నిర్వహించారు. శ్రీచక్ర నవావరణార్చన, సుదర్శన హోమం, నరసింహ హోమం, అయుత చండీ యాగాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం, దేవినేని ఉమా, గద్దె రామమోహన్, బుద్దా వెంకన్న నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు, తంగిరాల సౌమ్య, శావల దేవదత్, యార్లగడ్డ వెంకట్రావు, గన్నె ప్రసాద్(అన్న), అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాహుల్ ప్రధాని కావాలని..


పెనుగంచిప్రోలు, జనవరి 31 : వచ్చే ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయమని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లు బుధవారం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్వే మాట్లాడుతూ, దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాహుల్ ప్రధాని కావాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు చెప్పారు. ఏపీలో వైఎస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. ఉమ్మడి ఆంధ్రాలో 42 పార్లమెంట్ స్థానాలు కాంగ్రెస్ పార్టీకే వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల


మచిలీపట్నం టౌన్, జనవరి 31 : కృష్ణావిశ్వవిద్యాలయం నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి విడుదల చేశారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మీడియాతో మాట్లాడారు. 6773 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 3715 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. 54.85 ఉత్తీర్ణతా శాతం ఉందన్నారు. డిసెంబరులో పరీక్షలు నిర్వహించి జనవరిలో ఫలితాలు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, పరీక్షల నియంత్రణాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలో సిత్రాలు!

జగ్గయ్యపేట రూరల్, జనవరి 31 : ఓటర్ల తుది జాబితాలో చిత్ర విచిత్రాలు కనిపిస్తున్నాయి. ఓటరు పేరు హిందీ భాషలో.. మిగిలిన వివరాలు తెలుగులో ముద్రించటంతో పాటు మృతులకు కూడా ఓటు హక్కు కల్పించారు.



మృతుల ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేసినా వారి పేర్లు తాజాగా జాబితాలో ఉండటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనుమంచిపల్లి, గౌరవరం గ్రామాల జాబితాల్లో అమెర చినవీరయ్య మూడేళ్ల క్రితం మృతి చెందాడు. కాటంశెట్టి త్రిపాదు ఏడాది క్రితం మృతి



హిందీలో నమోదైన పేరు

చెందాడు. వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. బూత్ నెం 18, 19లో ఓటరు పేర్లు హిందీలో నమోదు కాగా విగిలిన వివరాలు తెలుగులో ఉన్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించటం లేదని నేతలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు జాబితాను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సీటీఎఫ్ ఏడీసీపీగా శ్రీహన్‌బాబు

- శాంతిభద్రతల విభాగం ఏడీసీపీ2గా కనకరాజు

విజయవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సిటీ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీగా కృష్ణా జిల్లా అదనపు ఎస్పీ ఆర్.శ్రీహన్‌బాబు నియమితులయ్యారు. మంగళగిరిలోని డీజీపీ ప్రధాన కార్యాలయంలో ఉన్న టి.కనకరాజును శాంతిభద్రతల విభాగం అదనపు డీసీపీ-2గా నియమించారు. రాష్ట్రంలో అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ సిటీ టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా ఉన్న జీవీ రమణమూర్తిని గుంటూరు జిల్లా అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. శాంతి భద్రత విభాగం అదనపు డీసీపీ- 2గా ఉన్న సీహెచ్ లక్ష్మీపతిని పల్నాడు జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీగా బదిలీ చేశారు. లక్ష్మీపతి ప్రస్తుతం స్పెషల్‌బ్రాంచ్‌కు ఏడీసీపీగా వ్యవహరిస్తున్నారు. విజయవాడ హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఉన్న కేవీ ప్రేమ్‌జిత్‌ను విశాఖపట్నం హోంగార్డ్సు విభాగానికి బదిలీ చేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు డీసీపీగా ఉన్న కె.శ్రీనివాసరావును ఇంటెలిజెన్స్ విభాగంలో ఏఆర్ అదనపు ఎస్పీగా నియమించారు. గుంటూరు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీగా ఉన్న కె.కోటేశ్వరరావును ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ఎటాచ్‌మెంట్ ఇచ్చారు. విశాఖపట్నం ఏఆర్, హోంగార్డ్సు కమాండెంట్‌గా ఉన్న యు.రామ్మోహనరావును విజయవాడలోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ)కు బదిలీ చేశారు.

కొత్త డీసీపీగా కృష్ణకాంత్ పటేల్

ఐపీఎస్‌ల బదిలీల్లో నగర డీసీపీగా ఆనంద్‌రెడ్డిని నియమించిన ప్రభుత్వం ఆయన బదిలీని నిలుపుదల చేసింది. ఆనంద్‌రెడ్డి స్థానంలో కొత్తగా కర్నూలు ఎస్ఈబీ అదనపు ఎస్పీగా ఉన్న కృష్ణకాంత్ పటేల్‌ను నియమించింది. నగర డీసీపీగా ఉన్న విశాల్‌గున్నీకి డీఐజీ పదోన్నతి రావడంతో ఆయనను విశాఖపట్నం రేంజ్ డీఐజీగా బదిలీ చేశారు. విశాఖపట్నం డీసీపీగా ఉన్న ఆనంద్‌రెడ్డిని ఇంటెలిజెన్స్ విభాగానికి పంపి నగరానికి కృష్ణకాంత్ పటేల్‌ను కేటాయించింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	121, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

నాట్యంలో షణ్ముఖ ప్రియకు ప్రథమ స్థానం



వన్‌టౌన్, జనవరి 31: ఇటీవల రాజమహేంద్రవరంలో లాస్యప్రియ కూచిపూడి నృత్యనికేతన్ నిర్వహించిన జాతీయ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విజయవాడ వన్‌టౌన్ కూరపాటి స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న షణ్ముఖ ప్రియకు ప్రథమ బహుమతి వచ్చింది. ప్రథమ బహుమతితో నాట నాట్య బాల పురస్కార్ అవార్డును కూడా కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా స్కూల్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో బాలికను అభినందించారు. ప్రిన్సిపాల్ యుగంధరాచార్య, పాఠశాల కార్యదర్శి కూరపాటి నారాయణరావు, సహాయ కార్యదర్శి చంటి, కవిటీ సభ్యులు శ్రీరామ్, రజిత్‌లు బాలికకు అభినందనలు అందచేశారు.

5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ముగిసిన సదస్సు

భారతీనగర్, జనవరి 31: ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెమినార్ హాల్‌లో మూడు రోజులపాటు కొనసాగిన 5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై అవగాహన సదస్సు బుధవారంతో ముగిసింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రీసెర్చ్ ఫోరం, కమ్యూనికేషన్ రీసెర్చ్ గ్రూప్, ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో డాక్టర్ వి.వినోద్‌కుమార్, డీఏడీటీ సీఈవో డాక్టర్ క్రాస్టన్ షోడర్, డైరెక్టర్ నీలేష్ లంకిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు 5జీ కమ్యూనికేషన్ ప్రాముఖ్యతను, వర్గీకరణను వివరించారు. ఈ సందర్భంగా ఈసీఈ డిపార్ట్‌మెంట్ సర్టిఫికెట్స్‌లను పంపిణీ చేసింది. రిసోర్స్ పర్సన్‌లను సత్కరించారు. కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి.జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఈసీఈ హెచ్‌వోడీ ఎం.రామకృష్ణ, ఈసీఈ రెండు, మూడు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పాల్గొన్నారు.

జగన్ ద్రోహాలను యువత గమనిస్తున్నారు

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు
● వంద మంది టీడీపీలో చేరిక

మధురానగర్, జనవరి 31: ఒక్కచాన్స్ పేరిట జనాన్ని మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రానికి చేసిన ద్రోహం యువత గమనించారని, అందుకే టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్ అని నమ్మి టీడీపీలోకి వస్తున్నారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. 29వ డివిజన్ మధురానగర్‌లో వివి నరసరాజు రోడ్డులో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో పందిరి రాము, హనుమంతు శంకర్, వెంపటాపు దుర్గాప్రసాద్ అధ్వర్యంలో వైసీపీ నుండి 100 మంది యువత టీడీపీలోకి వచ్చారు. వారందరికి కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను అన్ని వర్గాల ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో వైసీపీని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి నెక్కంటి ప్రసాద్, కార్యదర్శి రాబిల్లి సూరి, బీసీ సెల్ నాయకులు సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు, మహిళా అధ్యక్షురాలు రాజి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా



మాట్లాడుతున్న నవనీతం సాంబశివరావు



ప్రసంగిస్తున్న నాగుల్ మీరా

ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలి

సత్యనారాయణపురం: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, సెంట్రల్‌లో బొండా ఉమామహేశ్వరరావును గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు పిలుపునిచ్చారు. టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం 21డివిజన్లకు సంబంధించిన బీఎల్వోలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా తరగతులను రాష్ట్రపరిశీలకులు కృష్ణ, వెంకన్న, సందిరెడ్డి గాయత్రి, నాగుల్‌మీరా, ఎద్దుపాటి రామయ్య నిర్వహించారు ఇందులో ఓటర్ లిస్టు మొదలుకొని, ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తుకు గ్యారెంటీ, టెలిగ్రామ్ బూత్ పై టీడీపీ తదితర విభాగాల్లో, ఎన్నికలకు సంబంధించిన అంశాలను టీడీపీ బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. కె.ధనశేఖర్, కె.రూప్‌కుమార్, పడమటి రామకృష్ణ, సూర్యనారాయణ, గోపి, వైకుంఠం, శేషంరాజు ప్రసాద్, శ్రీరాములు, సుబ్బారావు, కొండా పాల్గొన్నారు.

బీసీలంతా టీడీపీ వైపే: నాగుల్‌మీరా

రాణిగారితోట: రాణిగారితోట 17వ డివిజన్‌లో ముని టవర్స్ వద్ద బుధవారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కే. నాగుల్ మీరా మాట్లాడు తూ బలహీన వర్గాలను జగన్ ప్రభుత్వం అణిచి వేస్తోందన్నారు. ఎవరెన్ని చేసినా బీసీలంతా టీడీపీవైపే ఉన్నారనేది వైసీపీ నాయకులు గుర్తుంచు కోవాలని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టీడీపీ అంటే బీసీల గెండెల్లో నుంచి వచ్చిన పార్టీ అని, బీసీలను అభివృద్ధి చేసింది, వారికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించింది దేశంలోనే ఒక రాజకీయ పార్టీ అది కూడా ప్రాంతీయ పార్టీ టీడీపీ మాత్రమేనని దేశం మొత్తం చెప్పుకుంటుందని అన్నారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, కొక్కెర తిరుపతయ్య, వేముల దుర్గారావు, రాయిరంగమ్మ, ముని పోలిపల్లి, పీరుబాబు, ఆదిబాబు, గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు.

సూర్య చరిష్మాకు అభినందన



విజయవాడ కల్చరల్, జనవరి 31: కేలో ఇండియా యూత్ గేమ్స్-2023లో షటిల్ బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ మహిళా కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థిని టి.సూర్యచరిష్మా ప్రతిభ కనబరిచింది. చెన్నైలో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగిన అండర్ 19 బాలికల సింగిల్స్‌లో ప్రథమ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ సత్కరించారు.

సర్వికల్ కేన్సర్‌పై 4న ఉచిత వైద్యపరీక్షలు

పటమట, జనవరి 31 : ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు సర్వికల్ కేన్సర్‌పై ఉచిత వైద్యపరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4న (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బందర్ రోడ్డు, అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో ఉచిత పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వికల్ కేన్సర్ గుర్తించే పాప్‌స్మియర్ పరీక్ష, షుగర్ పరీక్షలు ఉచితంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవారు 9849545117, 9490113583 నెంబర్లను సంప్రదించి ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం

జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్



చిరు వ్యాపారులను కలిసిన పోతిన మహేశ్

వన్‌టౌన్, జనవరి 31: వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనమవుతుందని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్ చార్జి పోతిన మహేశ్ అన్నారు. ఇంటింటికి రాబోయే టీడీపీ- జనసేన కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్‌లో పర్యటించిన ఆయన రోడ్ల వెంట చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిని పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరువ్యాపారుల బతుకులు బాగుపడేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. 53వ డివిజన్ జనసేన అధ్యక్షుడు పొట్నూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డివిజన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. చేపల మార్కెట్ వద్ద బూరాడవారి వీధి నుంచి పర్యటన కొనసాగింది.

డ్రైవర్లు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● డీటీసీ పురేంద్ర



పరీక్షలు చేయించుకుంటున్న డీటీసీ పురేంద్ర

కృష్ణలంక, జనవరి 31: దృష్టిలో పాలు వున్న డ్రైవర్లు ఆరునెలలకు ఒకసారి కంటి పరీక్షలను చేయించుకోవాలని డీటీసీ ఎం.పురేంద్ర అన్నారు. బందరురోడ్డులోని డీటీసీ కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ శారీరక వైకల్యాలు, వృద్ధాప్యం కలిగిన డ్రైవర్లు వాహనాలు నడపవద్దని ఆయన కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. ఈ శిబిరంలో 200 మందికి పైబడి డ్రైవర్లకు కంటి పరీక్షలు, బీపీ, షుగర్, సాధారణ పరీక్షలు నిర్వహించామని, పిన్నమనేని సిద్ధార్థ జనరల్ హాస్పటల్ వైద్య నిపుణులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డీటీసీ తెలిపారు. డాక్టర్ల బృందానికి డీటీసీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీవో వై.ఐశ్వర్యరెడ్డి, మోటారువాహన తనిఖీ అధికారులు పీవీ రమణ, కె.వెంకటేశ్వర రావు, ఎస్.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, కార్యాలయ పరిపాలన అధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, అబ్దుల్ సత్తార్, చంద్రకళ, ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కేవీవీ నాగమురళి, ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఈ-రిసోర్సెస్ నిర్వహణపై అవగాహన సదస్సు

భారతీనగర్, జనవరి 31: ఆంధ్రా లయోల కళాశాలలో సుస్థిరమైన అకడవిక్ లైబ్రరీ డెవలప్‌మెంట్ కోసం ఈ-రిసోర్సెస్ నిర్వహణపై అవగాహన సదస్సు బుధవారం కళాశాల సెమినార్ హాల్‌లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మనసు ఫౌండేషన్ ఎడిటర్, కంపోజర్ పి.అశోక్ కుమార్ పాల్గొని తెలుగు సాహిత్యం ఉజ్వల చరిత్రను సేకరించి నిధిగా ఉంచి భావితరాలకు అందించాలని విద్యార్థులకు తెలిపారు. కోల్‌కత్తా లైబ్రరీ ప్రిన్సిపాల్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్ సేనాపతి మాట్లాడుతూ డిజిటల్ రంగంలో లైబ్రేరియన్లు ఎదుర్కొనే సవాళ్లు, కాపీరైట్ సమస్యలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను వివరించారు. ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, పి.బాలశౌరి, కరస్పాండెంట్ సగాయరాజ్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.శివప్రసాద్, విజయనగరం ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ కె.ఉమామహేష్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి.ఎ.ప్రసాద్‌రావు, కో- ఆర్డినేటర్ టి.రోజామణి, నాలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు, రీసెర్చ్‌స్కాలర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన

భవానీపురం, జనవరి 31 : 45వ డివిజన్ సొరంగం ఎదురుగా కొండప్రాంతంలో రూ.19.40లక్షల వ్యయంతో చేపట్టే రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ షైలవరపు మాదురి లావణ్య బుధవారం శంకుస్థాపన చేశారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. నాయకులు డి. హస్సేన్, ముత్తా వాసులు పాల్గొన్నారు.

రోడ్లు, మెట్ల పనులకు శంకుస్థాపన

44వ డివిజన్‌లో మణెమ్మ బడ్డీకొట్టు ప్రాంతంలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టే రోడ్లు, మెట్లు డ్రెయిన్ల నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ షైలవరపు రత్నకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. కొండ ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎం. దుర్గారావు పాల్గొన్నారు.

కాపు కల్యాణమండపానికి స్థలం కేటాయింపుపై హర్షం

వన్‌టౌన్, జనవరి 31: పశ్చిమలో కాపు కల్యాణ మండపానికి స్థలం కేటాయించడంపై పశ్చిమ కాపు కార్పొరేటర్లు హర్షం వెలిబుచ్చారు. బుధవారం కొత్తపేటలోని ఒక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, యలకల చలపతిరావు, షైలవరపు రత్నకుమారి, మాధురి, లావణ్య, అత్తలూరి ఆదిలక్ష్మిలు పాల్గొని మాట్లాడుతూ, కల్యాణ మండపం నిర్మాణానికి సహకరిస్తామన్నారు.

తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధిపై దాడి

వన్‌టౌన్, జనవరి 31: తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి షైలపల్లి అప్పలరాజు ఎలియాస్ రాజుపై అదే పార్టీకి చెందిన 50 వ డివిజన్ అధ్యక్షుడు కుప్పల గంగాధర్ కులం పేరిట దూషించి దాడికి పాల్పడినట్లు బుధవారం కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన రాజుకు గంగాధర్ మధ్య గతంలో పార్టీ బ్యానర్ల ఏర్పాటు విషయంలో వివాదాలు జరిగాయి. గతంలో రాజును హత్య చేయడానికి కూడా గంగాధర్ ప్రయత్నించాడు. రెండు రోజుల క్రితం పార్టీ కార్యక్రమాల నేపథ్యంలో బ్యానర్ల ఏర్పాటుకు రాజు వద్ద గంగాధర్ డబ్బు తీసుకున్నాడు. అయితే బ్యానర్లలో రాజు స్థాయిని తగ్గించి ఉంచడంతో ఇద్దరి మధ్య వాదులాట జరిగింది. బుధవారం రాజు ఆ విషయమై ప్రస్తావించాడు. దీంతో కోపోద్రిక్తుడైన గంగాధర్ అతనిని రాడ్‌తో కొట్టి కులం పేరుతో దూషించాడు. రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం అక్రమ రవాణాలో ఆరుగురు అరెస్టు

వన్‌టౌన్, జనవరి 31: వన్‌టౌన్, భవానీపురం, సూర్యారావుపేట పోలీసు స్టేషన్ల పరిధిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 182 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ప్రకాష్‌నగర్ కు చెందిన బొంతు సుజాత, బి.శ్రీను, సతీష్ కుమార్‌లు గత కొన్ని రోజులుగా వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్ , శివాలయం వీధుల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు దాడి చేసి వారి నుంచి 83 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సూర్యారావుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని టానిక్ బార్ వాచ్‌మెన్ మాచర్ల శ్రీను మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని 49 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. విద్యాధరపురం కొండబడి స్కూల్ ఎదురుగా ఉంటున్న ఉమ్మడిశెట్టి దుర్గారావు అలియాస్ దుర్గ భవానీపురం ఐరన్‌యార్డ్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారు. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని 20 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గొల్లపూడి బైపాస్‌రోడ్డులో మద్యం అక్రమంగా విక్రయిసున్న సితార సెంటర్‌కు చెందిన షేక్ నజీర్‌ను పోలీసులో అదుపులోకి తీసుకుని 30 క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులందరినీ అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భవానీపురం: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ ఐఎంపీఎల్ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు కోటా నాగేశ్వరరావు వీధి, గణేష్ వీధి, 18 పోర్షన్ల ఏరియా, గంగరాజు క్వారీ, ఆకుల సాంబయ్య వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ ఈఈ బీవీ. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి పెట్టాలి

విజ్ఞాన్ లారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్



ఫణీంద్ర కుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

మొగల్రాజపురం, జనవరి 31: విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా పరిశోధనల వైపు కూడా దృష్టి పెట్టాలని విజ్ఞాన్ లారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ గుంటూరు ప్రిన్సిపాల్ కె. ఫణీంద్ర కుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులతో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో పరిశోధన దృక్పథం ఉన్న వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నూతన ఆవిష్కరణలు సులువగా చేయాలంటే విద్యార్థులు సి, జావా లాంగ్వేజ్‌లు, డేటా మేనేజ్‌మెంట్, వెబ్ సర్వీసెస్, డేటా స్ట్రక్చర్‌లో నైపుణ్యం సాధించాలని సూచించారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు (ఏఐ) కొత్త పుంతలు తొక్కుతోందని తద్వారా పరిశోధనలు సులభంగా త్వరితగతిన చేయవచ్చని చెప్పారు. కార్యక్రమం అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, సదస్సు కన్వీనర్ కంప్యూటర్ సైన్సు విభాగాధిపతి రవికిరణ్, జి. సామ్రాట్ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాల్లో మైమరిపించిన కచేరీలు


విజయవాడ కల్చరల్, జనవరి 31: సంగీత సన్మండలి అధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన సంగీతోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం 18 బృందాలు కచేరీలు చేశాయి. విశాఖపట్నంకు చెందిన సర్వజ్ఞ ప్రారంభ గాత్రం చేయగా నగరానికి చెందిన పోహూరి గౌరీనాథ్ ముగింపు కచేరీ చేశారు. పిండిప్రోలు సర్వజ్ఞ (విశాఖపట్నం) గాత్రం, కె.యశస్విని దత్త, సిహెచ్.శ్రీదేవి, ఎం.శర్వాణి-గాత్రత్రయం, పెద్దిపట్ల శైలజ (రాజమండ్రి) గాత్రం, ముద్రాడి వైష్ణవి -గాత్రం, పొన్నపల్లి రమాభగవాన్-గాత్రం, భిలాయ్‌కి చెందిన గంటి సరోజ-గాత్రం, ఒలివేటి నీరజ-గాత్రం, ఎస్.సాత్విక, కె.భువనశృతి-గాత్రయుగళం, కె.లక్ష్మీనరసమ్మ-గాత్రం, రాజమండ్రికి చెందిన వి.ఎల్.తులసీ విశ్వనాథ్, వి.నీరజ-గాత్రం, పోహూరి గౌరీనాథ్-గాత్రం, బి.సుజాత-వీణావాదనం, కార్తికేయ చరణ్, వి.లిఖిత, వి.సాత్విక, ఎస్.లక్ష్మీ ఉష వర్ణ, ఎస్.జయశ్రీ-బృంద వీణా వాదనం, ఇంద్రకీలాద్రి శర్మ, పి.మురారి-వేణు ద్వయ కచేరీ, కొండసాయి ప్రసన్న, ఎస్.అమృతవర్షిని-వీణా ద్వయ కచేరీ, ఎస్.వనమాలి, ఎస్.మాధవ్-వేణుద్వయ కచేరీ, హైదరాబాద్‌కు చెందిన అచల శంకరనాథ్-వీణా వాదనం, రాజమండ్రికి చెందిన అయ్యగారి సత్యప్రసాద్, అయ్యగారి రాజ్యలక్ష్మిల వీణాద్వయ కచేరీలు శ్రోతలను మైమరిపించాయి. బ్రోవభారమా-బహుదారి రాగంలో, శోభిల్లు సప్తస్వర, ఏనాడి నోము ఫలమో, గానమూర్తే, మీవల్ల గుణదోషమేమి వంటి కీర్తనలతో మైమరిచారు. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ నిర్వహించారు. జొన్నవిత్తుల ప్రభాకర్ శాస్త్రి, సుజాత కాపూరు, వేమూరి వెంకటేశ్వరనాథ్, గండూరి శ్రీనివాసమూర్తి, కందుల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోపూరి గౌరీనాథ్ గాత్ర కచేరి

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 1 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

విడాకుల వార్తలకు చెక్



సూర్య, జ్యోతిక దంపతులు తాము విడిపోబోవడం లేదని చెప్పకనే చెప్పారు. తమ విదేశీ విహార యాత్రతో విడాకుల వదంతులకు ముగింపు పలికారు. సినిమాలకు విరామం ఇచ్చిన సూర్య, జ్యోతిక ఫిన్లాండ్ వెళ్లి ఆనందంగా గడిపారు. ఆ వీడియోను బుధవారం సోషల్ మీడియాలో జ్యోతిక షేర్ చేశారు. ఇలాంటి పర్యటనలతో ఈ ఏడాదంతా తమకు ఆహ్లాదం పంచాలని ఆమె ఆకాంక్షించారు. చాన్నాళ్ల తర్వాత సూర్య, జ్యోతిక కలసి కనిపించడంతో వారు విడిపోబోతున్నారనే వార్తలకు ఇక ముగింపు పలికినట్లైందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. పిల్లల చదువు, బాలీవుడ్ సినిమాలు చేస్తుండడంతోనే తాను ముంబైలో ఉంటున్నాననీ, తమ వైవాహిక జీవితంలో ఎలాంటి ఇబ్బందులు లేవని జ్యోతిక గతంలోనూ పలు సందర్భాల్లో తెలిపారు. సూర్య నటించిన 'కంగువ' చిత్రం త్వరలోనే విడుదలవనుంది. 'సైతాన్', 'శ్రీ'తో పాటు మరో హిందీ చిత్రంలోనూ జ్యోతిక నటిస్తున్నారు.



ఈ సినిమా ట్రైలర్‌ని పదిసార్లు చూశా

అడివి శేష్

'ఈ వేదిక పై ఉన్న వాళ్లంతా ఏదో ఒక కల కని సాధించిన వాళ్లే. సుహాస్ గొప్పస్థాయికి వెళ్తాడని చెప్పగలను. ఇలాంటి టాలెంటెడ్ ఆర్టిస్టులు అరుదుగా ఉంటారు. ఈ సినిమా ట్రైలర్‌ను పదిసార్లు చూశా. అంత బాగా నచ్చింది. సినిమా పెద్ద హిట్ కావాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. సుహాస్ హీరోగా నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్' చిత్రానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'నిర్మాతగా నేను మీ ముందు నిలబడడానికి ముగ్గురు వ్యక్తులు కారణం.. అల్లు అరవింద్, శిరీష్, బన్నీ వాసు. దర్శకుడు దుష్యంత్ ఈ సినిమా కోసం రెండేళ్లు పనిచేశాడు. ఈ చిత్రం రిలీజ్ అయ్యాక అతని లైఫ్ మారిపోతుంది. అలాగే హీరో సుహాస్ మరో సినిమా జోలికి పోకుండా ఏడాది పాటు ఈ మూవీ మీదే ఫోకస్ చేశారు' అన్నారు. 'నేను గీతా ఆర్ట్స్‌లో నటిస్తున్నానంటే మా పేరెంట్స్ నమ్మలేదు. నాకు అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థాంక్స్ ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో 'అంబాజీపేట మ్యారేజి బాండ్'లో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చానని చెప్పగలను. దీనికి దర్శకుడు దుష్యంత్ డిటెయిలింగ్ కారణం' అన్నారు సుహాస్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బన్నీ వాసు, ఎస్.కె.ఎన్, దర్శకుడు సాయి రాజేశ్ తదితరులు కూడా మాట్లాడారు.

శేఖర్ కమ్ములతో మూడో సినిమా!



అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకొనే అద్భుతమైన చిత్రాలను రూపొందించడంలో పేరొందిన దర్శకుడు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం నాగార్జున, ధనుష్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణంలో ఉండగానే శేఖర్ కమ్ములతోనే మరో చిత్రాన్ని నిర్మించనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ బుధవారం ప్రకటించింది. శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించనున్నాయి. సోనాలి నారంగ్ ఈ చిత్రానికి సమర్పకురాలు.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ చిత్రం లార్జర్ దాన్ లైఫ్‌గా ఉండబోతోందని నిర్మాతలు వెల్లడించారు. టాప్ క్లాస్ టెక్నీషియన్లతో, హై బడ్జెట్‌తో చిత్రాన్ని నిర్మిస్తామన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ప్రస్తుతం నిర్మిస్తున్న చిత్రం పూర్తి కాగానే కొత్త సినిమా సెట్స్‌కు వెళుతుందని నిర్మాతలు వెల్లడించారు. ఇంతకుముందు నాగచైతన్య, సాయిపల్లవి, శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో 'లవ్‌స్టోరీ' చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహనరావు నిర్మించిన సంగతి విదితమే.

యాక్షన్ సీక్వెన్స్‌తో



సుమన్ బాబు దర్శకత్వంలో ఎస్‌వీవీ సుబ్బారెడ్డి నిర్మించిన చిత్రం 'ఎర్రచీర'. శ్రీరామ్, కారుణ్య చౌదరి జంటగా నటించారు. మార్చి 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రం యాక్షన్ ట్రైలర్‌ను నిర్మాత దిల్‌రాజు చేతుల మీదుగా విడుదల చేశారు. 45 నిమిషాల పాటు సాగే గ్రాఫిక్స్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ అని ఈ సందర్భంగా నిర్మాత తెలిపారు. ఈ చిత్రంలో రఘుబాబు, అలీ, అన్నపూర్ణమ్మ కీలకపాత్రలు పోషించారు.

మెకానిక్ సందేశం



మణిసాయి తేజ, రేఖా నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకత్వంలో ఎం నాగమునెయ్య నిర్మించారు. ఈ నెల 2న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా 'మెకానిక్' ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా చిత్రబృందం ఆవిష్కరించింది. ఫ్లోరైడ్ బాధిత ప్రజల జీవితాలే ఇతివృత్తంగా తెరకెక్కిన 'మెకానిక్' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'మంచి సినిమా తీశాం. సందేశంతో పాటు వాణిజ్య హంగులూ ఉన్నాయ'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా నిర్మాతల ధైర్యం వల్లే మంచి సినిమా తీయగలిగాం. సిద్ శ్రీరాం ఓ పాట పాడారు. తనికెళ్ల భరణి గారి సహకారం మరువలేనిద'న్నారు.

'ధీర' విజయవంతం కావాలి

దిల్ రాజు



'చదలవాడ బ్రదర్స్‌ను పాతికేళ్ల నుంచి చూస్తూనే ఉన్నా. అనూరాధ ప్రొడక్షన్స్ బేనరుపై ఎన్నో అద్భుత చిత్రాలు నిర్మించారు. ప్రారంభంలో నాకు వారితో పెద్దగా పరిచయం లేదు. 'దసరా' చిత్రాన్ని శ్రీనివాసరావుగారు కొన్నారని తెలిసిన తర్వాత ఆయన్ని కలిశాను. ఆ తర్వాత వ్యక్తిగతంగా ఎంతో దగ్గరయ్యాం. ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా నేను గెలవడం కోసం ఆయన చాలా సాయం చేశారు. శ్రీనివాసరావుగారి అబ్బాయి లక్ష్ నటించిన 'ధీర' ట్రైలర్ బాగుంది. అతని కష్టానికి, యూనిట్ శ్రమకు తగిన ప్రతిఫలం రావాలి. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు దిల్ రాజు. మంగళవారం జరిగిన 'ధీర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. చిత్రం బిగ్ టికెట్‌ను దిల్ రాజు, గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఇన్నేళ్లలో ఏ హీరోని నేను డేట్స్ అడగలేదు. ఎంతో మంది కొత్త దర్శకులను పరిచయం చేశాను. 'ధీర' చిత్రంతో విక్రాంత్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మా అబ్బాయి లక్ష్ ను చూసి గర్విస్తుంటాను. 'ధీర' ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఐదేళ్ల నుంచి నేను ఓ సినిమా తీస్తున్నా. అది పాన్ వరల్డ్ చిత్రం. మా బేనర్‌లో ఇప్పుడు పదహారు చిత్రాలు తయారవుతున్నాయి. ప్రతి నెలా ఒకటి చొప్పున విడుదల చేస్తాం.' అని చెప్పారు. 'ఈ సినిమాలో పాత్రకూ, రియల్ లైఫ్‌లోని నా క్యారెక్టర్‌కూ ఏ మాత్రం సంబంధం లేదు. పక్కనోడి గురించి పట్టించుకోకుండా తనకు నచ్చింది చేస్తుంటాడు. అలాంటి వాడికి ఓ మిషన్ అప్పగిస్తే, ఆ ప్రయాణంలో వచ్చే సమస్యల్ని 'ధీర'లో చూపిస్తున్నాం. మా నాన్నగారు లేకపోతే నేను లేను. ఆయన వన్ మ్యాన్ ఆర్మీ. విజయాలు వచ్చినా, అపజయాలు ఎదురైనా ఆయన బ్యాలెన్స్‌డ్‌గా ఉంటారు. మా సినిమాతో పాటు విడుదలవుతున్న చిత్రాలన్నీ ఆడాలి' అన్నారు లక్ష్. ఎన్టీఆర్ నటించిన 'డ్రైవర్ రాముడు' రిలీజ్ అయిన ఫిబ్రవరి రెండున వస్తున్న 'ధీర' సక్సెస్ కావాలని నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ చెప్పారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ కోరారు. 'ధీర' చాలా యూనిక్ పాయింట్ అని దర్శకుడు విక్రాంత్ చెప్పారు. హీరో పాత్రకు కూడా గ్రే షేడ్స్ ఉంటాయనీ, ఎనభై శాతం చిత్రం నైట్ ఎఫెక్ట్‌లోనే ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వై.వి.ఎస్.చౌదరి తదితరులు మాట్లాడారు.

దమ్ బిర్యానీలాంటి హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి



'సినిమాలో అందమైన హ్యూమన్ ఎమోషన్ ఉంది. సినిమా కథకు అసలైన పాయింట్ అదే. శాపం అనేది చిన్న డ్రైవింగ్ ఫోర్స్ మాత్రమే. కథలో ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేది ఎమోషన్‌కే. అన్ని దినుసులు ఉన్న దమ్ బిర్యానీ లాంటి సినిమా 'హ్యాపీ ఎండింగ్' అని చెప్పారు యశ్ పూరి. ఆయన హీరోగా నటించిన 'హ్యాపీ ఎండింగ్' చిత్రం ఫిబ్రవరి 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా యశ్ మీడియాతో మాట్లాడుతూ 'పురాణాల్లోని శాపాలు అనే కాన్సెప్ట్ తీసుకుని మా దర్శకుడు కౌశిక్ ఈ చిత్రకథ తయారు చేశారు. సినిమాలో అంతా ఫన్. వినోదభరితంగా సాగిపోతుంది. ముఖ్యంగా చివరి పదిహేను నిముషాలు మిస్ కావద్దు.' అన్నారు, మూడు వేల ఏళ్ల కిందటి కాన్సెప్ట్ తీసుకుని ఇప్పటి జనరేషన్ ఆడియన్స్‌కు నచ్చేలా చిత్రాన్ని తీసినట్లు యశ్ చెప్పారు. ' న్యూ హీరో యంగ్ ఆడియన్స్‌ను అట్రాక్ట్ చేయాలంటే కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండాలి. ఫ్రెండ్స్‌తో మీరు ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. నేను నాలుగు సినిమాలు చేశాను. అన్నింటిలోనూ స్టోరీ ఫస్ట్ హీరో. నేను సెకండ్ హీరోని. ఈ చిత్రంలోనూ అంతే' అని తెలిపారు యశ్.

కౌన్సెలింగ్

కూలింగ్ గ్లాసెస్ అవసరమే!

డాక్టర్! కొద్దిపాటి ఎండను కూడా నా కళ్లు తట్టుకోలేకపోతున్నాయి. చలువ కళ్లజోడు తప్పనిసరిగా పెట్టుకోవాలా? అసలు నాకెందుకు ఇలా జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్.

ఎండ, వేడి, అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్... వీటన్నిటి నుంచి కళ్లకు రక్షణ కల్పించాలంటే చలువు కళ్లద్దాలు ధరించాలి. సాధారణంగా మార్కెట్లో ఎన్నో రకాల కూలింగ్ గ్లాసెస్ దొరుకుతూ ఉంటాయి. వాటిలో చవకవీ, ఖరీదైనవీ ఉంటాయి. వీటిలో ఏది కొనాలి? అనే విషయంలో అయోమయానికి గురవుతూ ఉంటాం. అయితే చలువ కళ్లద్దాలు వేటితోనైనా కళ్లకు రక్షణ దొరుకుతుంది. అయితే వాటికి అతినీలలోహిత కిరణాలను ఆపే 'యువి ప్రొటెక్షన్' ఉందా? అనేది తెలుసుకోవాలి. చవక చలువ కళ్లద్దాలతో పోలిస్తే, ఖరీదైన ప్రముఖ కంపెనీ ఉత్పత్తులు ఈ ఫిల్మ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తాయి. కాబట్టి కళ్లకు పూర్తి రక్షణ కోరుకుంటే, మన్నికైన, నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్‌నే ఎంచుకోవాలి. తక్కువ ఖర్చులో చలువ కళ్లజోడు కొనే సమయంలో వాటి అద్దాల నాణ్యత పరిశీలించాలి. చత్వారం ఉన్న వాళ్లు ఎండ సోకితే నల్లబడే 'ఫొటోక్రోమ్' జోడు ఎంచుకోవాలి.



ఫొటో సెన్సిటివిటీ

కళ్లు ఏ కొద్ది ఎండ, వెలుగులను తట్టుకోలేని స్థితి ఇది. ఎక్కువగా ఎండ బారిన పడిన వాళ్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో వారి కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఈ సమస్యను సరి చేయడం అసాధ్యం. ఇలాంటివారు బయటకు వెళ్లినప్పుడల్లా చలువు కళ్లద్దాలను ధరిస్తూ ఉండాలి.

డాక్టర్ శ్రీలక్ష్మి నిమ్మగడ్డ
క్యాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్, హైదరాబాద్.

బ్యూటీ

జుట్టు సంరక్షణ ఇలా...

మార్కెట్లో దొరికే క్రీమ్స్ కాకుండా మన ఇంట్లోని వంటగదిలో ఉండే వాటితోనే హెయిర్‌మాస్క్‌లు వేసుకోవచ్చు. ముఖ్యంగా సహజసిద్ధమైన మాస్క్‌లు వేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

- బౌల్‌లో నాలుగు టేబుల్‌స్పూన్లు తాజా అలోవెరా జెల్‌ను, రెండు టేబుల్ స్పూన్లు కొబ్బరినూనె కలిపి మిక్స్ చేయాలి. దీన్ని మాడుకు పట్టేలా పట్టించాలి. అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు అందం, ఆరోగ్యంగా ఉంటుంది.



- టేబుల్ స్పూన్ తేనె, ఒక పచ్చి అరటిపండును మెత్తగా చేసుకోవాలి. రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె కూడా తీసుకోవాలి. ఈ మిశ్రమం అంతా కలిపి జుట్టుకు పట్టిస్తే కుదుళ్లు గట్టిగా ఉంటాయి.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, టేబుల్ స్పూన్ తేనె కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టులో చుండ్రు పోతుంది.
- రెండు ఉల్లిపాయలను గ్రైండ్ చేసి, అందులో కొబ్బరినూనె టీస్పూన్ వేయాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే జుట్టు ఊడిపోదు.
- ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనె, గుప్పెడు కరివేపాకు వేసి వేడిచేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత జుట్టుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తే జుట్టు పెరుగుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే పేస్ట్ చేయాలి. ఇందులోకి టేబుల్ స్పూన్ కొబ్బరి పాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత కడిగేస్తే జుట్టు గట్టిగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, టీస్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ను తరచూ పట్టిస్తుంటే తల చల్లగా ఉంటుంది. జుట్టులోని దురద తగ్గుతుంది.
- గుప్పెడు మందార పూలను పేస్ట్‌గా చేయాలి. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరినూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే జుట్టు పెరుగుతుంది.
- ఒక కోడిగుడ్డు వైట్‌తో పాటు టీస్పూన్ నిమ్మరసం కలిపి మిశ్రమాన్ని కలపాలి. దీన్ని జుట్టుకు పట్టిస్తే జుట్టులో ఫ్రెష్‌నెస్ వస్తుంది.

వంటింటి చిట్కాలు

- గ్యాస్‌బర్నర్‌ను తరచుగా శుభ్రం చేస్తుండాలి. లేకపోతే మురికి చేరి మంట తగ్గిపోతుంది. తద్వారా వంట ఆలస్యం అవుతుంది.
- వెల్లుల్లి రెబ్బల పొట్టు సులువుగా తీయాలంటే మాత్రం వాటిని వేడినీటిలో వేసి తర్వాత తీస్తే సులువుగా పొట్టు ఊడిపోతుంది.
- ఆమ్లెట్ రుచికరంగా ఉండాలంటే.. గుడ్ల సొనను గిలక్కొట్టేప్పుడు మూడు చెంచాలు పాలు కలిపితే సరి.
- ఉల్లిపాయల ముక్కలను వేయించేప్పుడు కాస్త చక్కెర వేసి కలిపితే రుచిగా ఉంటుంది.
- తీపి బోండాలను చేయాలనుకున్నప్పుడు పిండిలో నీళ్లకు బదులు పాలు వాడితే బావుంటాయి.

స్ఫూర్తి

'ఆడపిల్లకు ఒంటి మీద నగల కన్నా పేరు చివర విద్యార్హతలే విలువైనవి'... అనే తన తల్లి మాటల స్ఫూర్తితో 'టైమ్స్' (తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ) నెలకొల్పారు. తద్వారా చదువు'కొనలేని' అమ్మాయిలకు అండగా నిలిచారు. అమెరికాలో స్థిరపడినా, సొంతూరు రావినూతలకు సేవ చేయాలనే సంకల్పంతో ఇక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాటి సరోజిని... 'టైమ్స్' ఫౌండేషన్ సేవల గురించి 'నవ్య'తో చెబుతున్నారిలా.



చదువు'కొనలేని' అమ్మాయిల కోసం..

"ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న కుటుంబాల్లో అమ్మాయిల చదువుకు ఎప్పుడూ రెండో ప్రాధాన్యతే. ఈ విషయంలో మధ్యతరగతిలో కొంత మార్పు కనిపిస్తున్నా... అణగారిన వర్గాల్లో మాత్రం అలానే కొనసాగుతోంది. నేను ఉద్యోగరీత్యా ఇరవై ఏళ్ల కిందట అమెరికాలో స్థిరపడ్డాను. అప్పుడప్పుడు సొంతూరికి వెళుతుంటాను. ఆ సమయంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అమ్మాయిలు చాలామంది కుటుంబ పరిస్థితులు అనుకూలించక కూలి పనులకు వెళ్లడం గమనించాను. ఒక కుటుంబంలో అయితే అక్కాచెల్లెళ్లు ఇద్దరూ బ్రిలియంట్ స్టూడెంట్స్. ప్రమాదవశాత్తు వాళ్ల నాన్న చనిపోవడంతో కుటుంబ భారమంతా తల్లి మీద పడింది. ఆమెకు ఇద్దరినీ చదివించే స్తోమత లేక, ఒకరిని తన వెంట వ్యవసాయ పనులకు తీసుకెళ్లేది. 'పదో తరగతిలో 500కు పైగా మార్కులు వచ్చిన అమ్మాయి కూలికి వెళ్లడం ఏమిట'ని నాలో నేను కుమిలిపోయాను. మరొక అమ్మాయికి తల్లి లేదు. తండ్రి బాధ్యతారాహిత్యం వల్ల అమ్మాయి భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. ఇంకొక అమ్మాయి తల్లిదండ్రులిద్దరూ అప్పుల బాధతో పురుగులమందు తాగి చనిపోయారు. దాంతో తానూ కాలేజీ మానేయాల్సిన పరిస్థితి. ఇలాంటివారి గురించి విని బాధపడుతూ కూర్చొని లాభం లేదనిపించింది. నా శక్తికొద్దీ సాయపడాలనుకున్నాను. వారందరినీ చదివించే బాధ్యత తీసుకున్నాను.

అమ్మ పేరుతో...

మనం చేసే మంచి పనికి ఒక వేదికంటూ ఉంటే బావుంటుంది అని నా స్నేహితులు సూచించారు. దాంతో 'ఆడపిల్లకు ఒంటి మీద నగలకన్నా పేరు పక్కన విద్యార్హతలే విలువైనవి' అని నమ్మే మా అమ్మ పేరుతో 'తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ' (టైమ్స్) నెలకొల్పాం. ప్రస్తుతం నలభైమంది నిరుపేద ఆడపిల్లల ఉన్నత చదువుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని సమకూరుస్తున్నాం. ఇలా ఏటా పదిమంది చొప్పున కొత్త విద్యార్థులను తీసుకుంటూ 'టైమ్స్' సేవలను మరింతమందికి చేరువ చేయాలని భావిస్తున్నాం.

స్థానికులు ట్రస్టీలుగా...

'టైమ్స్' సహకారంతో హైందవి అనే విద్యార్థిని ఇంజనీరింగ్ పూర్తి చేసింది. రెండేళ్లు ఉద్యోగం చేసి, దాచుకున్న డబ్బుతో, ఇప్పుడు అమెరికాలో మాస్టర్స్ చదువుతోంది. మరో అమ్మాయి సుచిత్ర సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరి తన తమ్ముడు, చెల్లెలు చదువు బాధ్యతను స్వీకరించింది. తండ్రి లేని ఆ కుటుంబానికి పెద్ద దిక్కు అయింది. వీళ్లిద్దరి విజయ గాథలు మాలో మరింత మందికి సాయం చేయాలన్న తృష్ణను పెంచాయి. 'టైమ్స్'ను కేవలం మా వ్యక్తిగత సంస్థలా మార్చకుండా, సమాజం పట్ల బాధ్యతగా మెలిగే మరికొంతమంది స్థానికులను ఇందులో ట్రస్టీలుగా చేర్చాం. భారత్‌కు వచ్చినప్పుడల్లా ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని మేడికొండూరు, రావినూతల, నూజెళ్లపల్లి, దుద్దుకూరు, పంగులూరు గ్రామాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళుతుంటాం. అక్కడి ఉపాధ్యాయుల ద్వారా పదో తరగతి లేదా ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి, పై చదువులకు వెళ్లలేని విద్యార్థినులను గుర్తించి, వారికి పూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'టైమ్స్' గురించి తెలిసి నెల్లూరు, చిత్తూరు తదితర జిల్లాల నుంచి కూడా కొందరు మమ్మల్ని సంప్రతిస్తున్నారు. అయితే, చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, చదువు కొనలేని అమ్మాయిలకు మాత్రమే సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. అదీ ట్రస్ట్ సభ్యులంతా కలిసి ప్రతి ఒక్క విద్యార్థిని దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించిన తర్వాతే వారి చదువు బాధ్యత స్వీకరిస్తాం. విద్యార్థినులకు ఫీజు చెల్లించడంతో వదిలేయకుండా... ఫోన్, వాట్సప్‌ల ద్వారా ఎప్పటికప్పుడు వారి బాగోగులు విచారిస్తుంటాం. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుంటాం. మా నాన్న కూడా నిత్యం పర్యవేక్షిస్తుంటారు. విద్యార్థినుల ఎంపికకు అత్యుత్తమ ప్రతిభ, పేదరికమే ప్రామాణికం. అంతకు వించి కుల, మత భేదాలకు ఇక్కడ తావు లేదు. బంధు ప్రీతికి అవకాశం లేదు. మా విద్యార్థినుల జాబితా చూస్తే అది సుస్పష్టం అవుతుంది.

> **పర్వతాన్ని అధిరోహించాం**
>
> మా అమ్మాయి వర్ష, నేను కలిసి టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాం. తర్వాత ఎవరెస్టు బేస్ క్యాంప్ వరకు వెళ్లాం. డిజిటల్ ప్రపంచంలో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లకే అతుక్కుపోకుండా ఆరుబయట ఆటలతో శారీరక దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో చిన్నప్పటి నుంచి వర్షకు ట్రెక్కింగ్ అలవాటు చేశాం. తాను ఇప్పుడు ఆఫ్ మారథాన్ పూర్తి చేసింది. ఎవరెస్టు ఎక్కేందుకు సిద్ధమవుతోంది.



> **అదే ప్రధాన కారణం...**
>
> మా పుట్టింటి వారిది గుంటూరు జిల్లా వేములూరిపాడు. మాది విద్యావంతుల కుటుంబం. మా అమ్మ బీఎస్సీ, నాన్న ఇంజనీరింగ్ చదివారు. నాకు తమ్ముడు, చెల్లి. అమ్మానాన్న మా ముగ్గురికీ చిన్నప్పుడు ఒక్కటే చెప్పారు... 'మీకెవరికి డొనేషన్ అంటూ కట్టం. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సీటు సంపాదించుకొనేలా మీరే బాగా చదవాలి' అని. మేమంతా అలానే చదివాం. చెల్లి డాక్టరుగా, తమ్ముడు, నేను కార్పొరేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డాం. చాలాకాలం కిందట అనారోగ్యంతో అమ్మ కన్నుమూశారు. ఆమె పేరుతోనే ఫౌండేషన్ ప్రారంభించాం. నా భర్త పూనాటి రవీంద్రది ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతల. ఆయన చిన్న రైతు కుటుంబం నుంచి వచ్చారు. మా రవికన్నా వాళ్ల పెద్ద చెల్లి అపర్ణ చాలా బాగా చదివేవారు. అయితే అత్తమ్మ వాళ్లకు ఇద్దరినీ చదివించే స్తోమత లేక 7వ తరగతి తర్వాత మా ఆడపడుచుకు పెళ్లి చేశారు. దాంతో తనవల్లే చెల్లి చదువుకోలేకపోయిందని మా వారు ఎప్పుడూ బాధపడుతుండేవారు. 'టైమ్స్' ద్వారా కేవలం ఆడపిల్లల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా మేము ముందుకెళ్లడానికి రవీంద్ర అనుభవం కూడా ఒక ప్రధాన కారణం. ఆయనకు ఆస్తులు కూడబెట్టాలన్న ఆలోచన లేదు. నాకు నగలు, చీరల మీద ఇష్టం లేదు. మా ఇద్దరి అభిరుచులు, ఆసక్తులు ఒక్కటే. అది 'టైమ్స్' ద్వారా వీలైనంత ఎక్కువ మందికి సాయపడటమే.

బహిర్భూమి రహిత గ్రామం...

'టైమ్స్'తో అనుబంధంగా ఉన్న అయిదు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇంగ్లీషు నిఘంటువులు, వ్యాకరణం లాంటి పుస్తకాలను ఏటా ఉచితంగా ఇస్తున్నాం. అలా ఇప్పటి వరకు మూడు వేలమందికి పంచాం. రావినూతలలోని అణగారిన వర్గాల పిల్లల కోసం గౌరవ వేతనంతో ప్రత్యేకంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి, ఉచితంగా ట్యూషన్లు నిర్వహిస్తున్నాం. బడికి సక్రమంగా వెళ్లని వారిని, అసలు బడికే వెళ్లని పిల్లలను... యాభై మంది వరకు గుర్తించాం. వాళ్ల ఇళ్లకు వెళ్లి, పెద్దలతో మాట్లాడి చిన్నారులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపేలా అవగాహన కల్పిస్తున్నాం. రావినూతల 'బండ', 'యానాది' కాలనీలను చూశాక... నేటికీ చాలా గ్రామాల్లో మరుగుదొడ్డి సౌకర్యంలేని ఇళ్లు ఎన్నో ఉన్నాయని మాకు తెలిసింది. దాంతో నా భర్త పూనాటి రవీంద్ర ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఊరిలో 220కు పైగా మరుగుదొడ్లు కట్టించారు. రావినూతలను బహిర్భూమి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం. గ్రామీణ బాలికలకు నెలసరి ఆరోగ్యం మీద గైనకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం.

నిరంతర సేవ...

ప్రస్తుతం నేను అమెరికాలోని ఒక కార్పొరేట్ కంపెనీలో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. నా భర్త కూడా మరొక కార్పొరేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్ స్థాయిలో ఉన్నారు. ఉద్యోగ జీవితంలో లక్ష్యాన్ని చేరుకోవడం, మనల్ని మనం నిరూపించుకోవడం, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు... ఈ ఆనందాలన్నింటినీ ఇరువురం ఇరవై ఏళ్లుగా అనుభవిస్తున్నాం. అందుకు పూర్తి భిన్నంగా, మరొకరికి సహాయపడటం ద్వారా అసలైన సంతోషాన్ని ఇప్పుడు అస్వాదిస్తున్నాం. 'టైమ్స్' ద్వారా 'ఇన్ని వందల మందిని చదివించాలి. ఇన్ని గ్రామాలకు మా సేవలు చేరువవ్వాలి' లాంటి లక్ష్యాలేమీ మేము పెట్టుకోదలుచుకోలేదు. మాకు ఉద్యోగ జీవితం, సొసైటీ సేవలు మినహా ఇతర వ్యాపకాలేమీ లేవు. మా అమ్మాయి వర్ష పూనాటి కూడా ఫౌండేషన్ సేవల్లో చురుగ్గా పాల్గొంటోంది. కనుక మేం తలపెట్టిన ఈ సేవా కార్యక్రమాలు మాతో ఆగకూడదు. అవి నిరంతరం కొనసాగాలని అనుకొంటున్నాం. నిజానికి 'టైమ్స్' బలం, బలగమంతా రావినూతల గ్రామ ప్రజలు, మా ట్రస్ట్ సభ్యులే. వారందరి సమష్టి శ్రమ, సహకారంవల్లే మేం తలపెట్టిన సేవా కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగుతున్నాయి. నిస్వార్థంతో సాటి మనిషికి సాయపడాలనుకొనే మంచి వ్యక్తులు 'టైమ్స్'కు వాలంటీర్లుగా ఉన్నారు. అలాంటి వ్యక్తులు దొరకడం మాకు పెద్ద వరం. గ్రామస్తుల భాగస్వామ్యంతో రావినూతలను ప్లాస్టిక్ రహిత పల్లెగా... స్వచ్ఛ గ్రామంగా మార్చాలన్నది మా ఆలోచన. ఆ దిశగానూ అడుగులు వేస్తున్నాం."

> **అమెరికాలోని విద్యార్థులకు...**
>
> కాలిఫోర్నియాలోని హెవార్డ్, టెన్నెసన్ హైస్కూల్ విద్యార్థినులకు కెరీర్ విషయంలో మార్గనిర్దేశం చేస్తున్నాను. ఈ స్కూలు పిల్లలంతా అత్యంత నిరుపేదలు. వారి తల్లిదండ్రులు కూడా పెద్దగా చదువుకోలేదు. ఇంకా చెప్పాలంటే, వారంతా మెక్సికో, క్యూబా తదితర దక్షిణ అమెరికా దేశాల నుంచి పొట్ట చేత పట్టుకొని వచ్చినవారు. అలాంటి వారికి సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల మీద అవగాహన కల్పించడం ద్వారా మెరుగైన అవకాశాలను చేరువ చేయచ్చనే ఉద్దేశంతో వారంలో ఒకరోజు తరగతులు తీసుకొంటున్నాను. అందులో పన్నెండు మందికి ఈ మధ్యనే మ్యాక్ ల్యాప్‌టాప్‌లు ఇచ్చాం.



• సాంత్వన్

కేర్‌టేకర్



ఒడిశా నిస్తిపూర్ గ్రామం... అరచండి ప్రాంతం... ఒకప్పుడు ఇది వలస పక్షులకు స్వర్గధామం. సందర్శకుల తాకిడి... వేటగాళ్ల అలికిడికి వాటి సంచారం తగ్గింది. కొందరు స్థానిక మహిళలను ఇది కలవరపెట్టింది. పన్నెండుమంది కలిసి ఒక జట్టుగా ఏర్పడి... శీతాకాలం విడిదికి వచ్చే ప్రియ నేస్తాలకు రక్షణ కవచంలా నిలిచారు. పరిసరాలను వాటికి అనువుగా మలిచి... ఆహ్లాదకరమైన ఆతిథ్యం అందిస్తున్నారు.

వలస పక్షుల రక్షకులు

> "సూర్యకాంతి బృందం అలుపెరుగని కృషితో ఒకప్పుడు అనూహ్యంగా తగ్గిన పక్షుల వలస తిరిగి ఊపందుకుంది. రెండేళ్లలో సాధారణ స్థితికి చేరుకుంది."

అరుదైన పక్షి జాతులకు విహార కేంద్రం ఒడిశాలోని నిస్తిపూర్. శీతాకాలం వచ్చిందంటే.. రకరకాల పక్షులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ వాలుతాయి. పచ్చని పైరులు... విస్తారంగా చెట్లు... నీటి కొలనులు... చుట్టూ కొండలు... ఎన్నెన్నో ప్రకృతి సోయగాలతో అరచండి చిత్తడి నేలలు (వెట్‌లాండ్స్) అలరారుతాయి. దీనికి విభిన్న పక్షుల కేరింతలు, కిలకిలారావాలు అదనపు ఆకర్షణ. అందుకే ఇక్కడ సందర్శకుల తాకిడి విపరీతంగా ఉంటుంది. ఈ సంఖ్య ఏటికేడూ పెరుగుతూ పోతోంది. కానీ అదే వలస పక్షుల పాలిట శాపంగా మారింది.

'ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో మా ప్రాంతమంతా కాలుష్యమయంగా మారింది. దగ్గర్లోని అరచండి ఆలయానికి వచ్చే భక్తులు, మైకులు, వాయిద్యాలతో శబ్ద కాలుష్యం కూడా ఎక్కువైంది. మరోవైపు వేటగాళ్ల అలజడి. వీటన్నిటి నేపథ్యంలో పక్షుల సంఖ్య క్రమంగా తగ్గింది. చిన్నప్పటి నుంచి నేను వాటిని చూస్తూ పెరిగాను. అవి ఆకాశంలో అలా ఎగురుతుంటే... జంటలుగా ఊసులాడుకొంటుంటే... ప్రతి దృశ్యం నాకు అద్భుతంగానే అనిపించేది. మనసు పరవశించేది. ఆ తరువాత కాలంలో కాలుష్యానికి కొన్ని, వేటగాళ్ల ఆహారానికి మరికొన్ని... మృత్యువాత పడటం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఏటా వేలమంది పర్యాటకులకు కనువిందు చేస్తున్న పక్షులు... ఒక్కొక్కటిగా కనుమరుగవుతుంటే తట్టుకోలేకపోయాను. ఈ సమస్యకు పరిష్కారం కనుగొని... పూర్వంలా పక్షులు ఇక్కడ హాయిగా విహరించేలా ఏదైనా చేయాలనుకున్నాను' అంటూ చెప్పుకొచ్చారు సూర్యకాంతి మొహంతి. పన్నెండుమంది మహిళలు కలిసి ఏర్పడిన వలస పక్షుల సంరక్షణ బృందంలో ఆమె ఒకరు.

అవగాహన కల్పించి...

వేటగాళ్లు పక్షులను వేటాడి తినేవారు. మరికొందరు వల వేసి పట్టుకుని, వాటికి ఉన్న ప్రత్యేక ఆకర్షణను మార్కెట్లో సొమ్ము చేసుకొనేవారు. "ఇది పక్షుల వలసలపై తీవ్ర ప్రభావం చూపింది. దీనిపై గ్రామస్తులందరితో సమావేశమయ్యాను. నాతో మరో పదకొండు మంది గృహిణులు కలిసి నడిచారు. అందరం ఇంటింటికీ తిరిగాం. కాలుష్యానికి, వేటకు అడ్డుకట్ట వేయపోతే అరుదైన పక్షులు అంతరించిపోతాయని వివరించి చెప్పాం. ముందు మా ఇంటి మగవాళ్లకు అవగాహన కల్పించాం. వారి సహకారంతో ఊళ్లో వారందరినీ ఒక తాటి పైకి తేగలిగాం. ముఖ్యంగా రసాయనాలు లేకుండా సేంద్రియ ఎరువులతో పంటలు పండించాల్సిందిగా రైతులను కోరాం. ఎందుకంటే పక్షుల ఆహారానికి ఇక్కడి వరి పంటలే ఆహారం. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడితే... అవి తినే ఆహారం విషతుల్యం అవుతుంది. అందుకే రైతులను సేంద్రియ సాగు వైపు ప్రోత్సహించాం. వాళ్లు కూడా పెద్ద మనసుతో అర్థం చేసుకున్నారు. తరువాత మా పన్నెండు మంది మహిళలం కలిసి 'అరచండి పక్షి సురక్ష సమితి' ఒకటి ఏర్పాటు చేశాం. వలస పక్షులకు రక్షణ కవచంలా నిలిచాం" అని చెప్పారు సూర్యకాంతి.



పరిరక్షణ... పరిశుభ్రత...

వలస పక్షులకు ఎలాంటి హానీ కలగకుండా చూసుకోవడానికే ఈ మహిళలు పరిమితం కాలేదు. ఉదయం లేవగానే వారు ఇక్కడి చిత్తడి నేలను పరిశుభ్రం చేస్తారు. పర్యాటకులు వాడి పడేసిన వస్తువులు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తారు. పరిసరాల్లో చెత్తాచెదారం వేయడం, బిగ్గరగా శబ్దాలు చేయడంవల్ల పక్షులు బెదిరిపోతాయని, ఆ ప్రభావంతో వలసలు తగ్గిపోతాయని సందర్శకులు, ఆలయానికి వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తారు. ప్లకార్డులు ప్రదర్శిస్తారు. ఈ మహిళల కృషికి గ్రామ పెద్దలు కూడా మద్దతుగా నిలిచారు. రైతులు పక్షి ప్రేమికులుగా మారి... సేంద్రియ సాగు వైపు మళ్లారు. గతంలో కంటే అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

తిరిగి విడిదికి...

సూర్యకాంతి బృందం అలుపెరుగని కృషితో ఒకప్పుడు అనూహ్యంగా తగ్గిన పక్షుల వలస తిరిగి ఊపందుకుంది. రెండేళ్లలో సాధారణ స్థితికి చేరుకుంది. గత ఏడాది చివరల్లో ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి పక్షుల గణన కూడా చేపట్టారు. అందులో తేలిందేమంటే.. పూర్వంలా వందల రకాల పక్షులు మళ్లీ అరచండికి వలస వస్తున్నాయని. 'మేమే కాదు... సందర్శకులు, గ్రామస్తులు కూడా ఇప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటున్నారు. వాటి ప్రశాంత విహారానికి భంగం కలగకుండా, వేటగాళ్ల నుంచి ప్రాణహాని లేకుండా చూసుకొంటున్నారు. నిజంగా ఇది శుభపరిణామం' అంటూ సంతోషం వ్యక్తం చేశారు బృందంలోని మరో సభ్యురాలు స్నేహాంజలి బిస్వాల్.

అందరి బాధ్యత...

కేవలం పన్నెండు మంది మహిళలు కలిసి కృషి ఫలితం... వలస పక్షులకు మళ్లీ అరచండీ బాట పట్టడం. అదే ప్రభుత్వం, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తే... ఈ ప్రాంతం మరింతమందికి ఆహ్లాదం, ఆనందం పంచుతుందంటారు స్థానికులు. 'ఇదివరకటిలా మా గ్రామం పక్షుల విహారంతో చూపరులను ఆకట్టుకుంటోంది. అందులో సందేహం లేదు. కానీ కొన్ని అరుదైన జాతులు క్రమంగా తగ్గిపోతున్నాయి. స్వచ్ఛంద, ప్రభుత్వ సంస్థలు, సందర్శకులు... అందరూ కలిసి నడిస్తేనే వాటిని రక్షించుకోగలుగుతాం. ఇక్కడే కాదు... వన్యప్రాణులకు ఆవాసమైన ఏ ప్రాంతమైనా కాలుష్యం, వేటగాళ్ల బారిన పడకుండా చూసుకోవాలి. లేదంటే వాటి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది' అంటున్న సూర్యకాంతి బృందం... తమ ప్రయత్నాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

స్పోర్ట్స్

మా అమ్మ ఆరోగ్యంగానే ఉంది

కోహ్లీ సోదరుడు వికాస్

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ తల్లికి తీవ్ర అనారోగ్యం అంటూ సోషల్ మీడియాలో రెండో రోజులుగా హల్‌చల్ చేస్తున్న వార్తలను అతడి సోదరుడు వికాస్ ఖండించాడు. అవన్నీ తప్పుడు కథనాలన్నాడు. 'మా అమ్మ ఆరోగ్యం గురించి అసత్య ప్రచారం జరుగుతోంది. ఆమె బేషుగ్గా.. ఫిట్‌గా ఉన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇలాంటి వదంతులను వ్యాప్తి చేయవద్దని ప్రతి ఒక్కరినీ అభ్యర్థిస్తున్నా'నని వికాస్ ఇన్‌స్టాలో పోస్టు పెట్టాడు. కోహ్లీ తల్లి సరోజ్ కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, అందుకే అతడు ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం జరుగుతోంది.

కోహ్లీ కెప్టెన్ అయ్యుంటే టీమిండియా ఓడేది కాదు!

ఇంగ్లండ్ మాజీ సారథి వాన్



లండన్: విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో అయితే హైదరాబాద్ టెస్ట్‌లో భారత జట్టు ఓటమి పాలై ఉండేది కాదని ఇంగ్లండ్ మాజీ ఆటగాడు మైకేల్ వాన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ కెప్టెన్సీ తీరును తప్పుపట్టాడు. ఉప్పల్ టెస్ట్‌లో 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా.. భారత్ 28 పరుగులతో ఓడడం ఫ్యాన్స్‌ను షాక్‌కు గురి చేసింది. 'టెస్టుల్లో విరాట్ సారథ్యాన్ని టీమిండియా ఎంతో మిస్ అవుతోంది. రోహిత్ గొప్ప ఆటగాడే. కానీ, ఈ మ్యాచ్‌లో ఏదో లోకంలో ఉన్నట్టుగా నిలుచుండిపోయాడు. పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ మార్పులు కూడా చేయలేదు. పోప్ రివర్స్ స్వీప్‌లకు అతడి వద్ద సమాధానమే లేకపోయింద'ని వాన్ ఓ కాలమ్‌లో రాశాడు.

తెలంగాణ 6, ఆంధ్ర 13

ఖేలో ఇండియా క్రీడలు



లక్ష్మీసిరి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణ ఆరు, ఆంధ్రప్రదేశ్ 13వ స్థానంతో ముగించాయి. చెన్నైలో వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో తెలంగాణ మొత్తంగా 13 స్వర్ణాలు సహా 24 పతకాలతో ఆరో స్థానంలో.. ఆంధ్రప్రదేశ్ 7 స్వర్ణాలతో కలిపి 27 పతకాలు సొంతం చేసుకొని 13 స్థానంతో సరిపెట్టుకుంది. మహారాష్ట్ర ఓవరాల్ చాంపియన్ టైటిల్ గెలుచుకుంది. బాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఆంధ్ర ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. ఇక, ఆఖరి రోజు జరిగిన బాలికల టెన్నిస్ సింగిల్స్ ఫైనల్లో తెలంగాణ అమ్మాయి దండు లక్ష్మీసిరి 1-6, 3-6తో రేవతి (తమిళనాడు) చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. స్విమ్మింగ్‌లో 500 మీటర్ల ఫ్రీస్టయిల్ కేటగిరీలో వ్రితి అగర్వాల్ స్వర్ణం సాధించింది.

పూర్తిగా స్పిన్నర్లతోనే?



విశాఖ టెస్ట్‌కు ఇంగ్లండ్ వ్యూహం



విశాఖపట్నం: భారత్‌తో జరిగే రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ తన వ్యూహాన్ని మార్చబోతోందట! విశాఖపట్నంలో జరిగే ఈ టెస్ట్‌కు మొత్తం స్పిన్నర్లతోనే బరిలోకి దిగాలని భావిస్తోందట!! హైదరాబాద్‌లో జరిగిన మొదటి టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో వెనుకంజలో నిలిచి కూడా..పర్యాటక జట్టు అద్భుత విజయం దక్కించుకుంది. ఇందుకు ప్రధాన కారణం అరంగేట్ర స్పిన్నర్ టామ్ హార్ట్‌లీ. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లు తీసి జట్టు విజయంలో అతడు కీలక భూమిక పోషించాడు. రెండో టెస్ట్ జరిగే విశాఖ పిచ్ కూడా స్పిన్నర్లకు అనుకూలిస్తుందని అంచనా వేస్తున్నారు. అలాగే భారత బ్యాటర్లు స్లో బౌలర్ల బౌలింగ్‌లోనూ తడబాటుకు లోనవుతున్న తీరును చూసిన ఇంగ్లండ్ జట్టు యాజమాన్యం తమ సంప్రదాయానికి భిన్నంగా..పూర్తిగా స్పిన్నర్లతోనే ఆడితే ఎలా ఉంటుందని ఆలోచిస్తోంది. ఇంగ్లండ్ కనుక ఇదే వ్యూహాన్ని అమలు చేస్తే..20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ విశాఖ టెస్ట్‌లో అరంగేట్రం చేసే అవకాశాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. 'మా స్పిన్నర్లందరినీ ఆడించేందుకు భయపడబోం' అని ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్ అనడం రెండో టెస్ట్‌కు ఆ జట్టు వ్యూహాన్ని పరోక్షంగా తెలియజేస్తోంది. హార్ట్‌లీకి, బషీర్ తోడైతే మాత్రం భారత్‌కు కష్టాలు తప్పవు.

లీచ్ దూరం!



ఇంగ్లండ్ సీనియర్ స్పిన్నర్ జాక్ లీచ్ రెండో టెస్ట్‌కు దాదాపు దూరమైనట్టే. హైదరాబాద్ టెస్ట్ తొలి రోజు ఆటలో ఫీల్డింగ్ సందర్భంగా అతడి ఎడమ మోకాలికి గాయమైంది. దాంతో బుధవారం జరిగిన ప్రాక్టీస్‌లో లీచ్ పాల్గొనలేదు. మైదానం వెలుపల అతడికి జట్టు ఫిజియో చికిత్స చేస్తూ కనిపించాడు.



పిచ్‌ను పరిశీలిస్తున్న సిరాజ్

గిల్, శ్రేయా‌స్‌పై ఆందోళన లేదు..

శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ వైఫల్యాలపై ఆందోళన చెందడంలేదని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నాడు. ఇక..ఇంగ్లండ్ దూకుడుకు విశాఖ టెస్ట్‌లో తెలివిగా చెక్ పెట్టాలని జట్టుకు సూచించాడు. హైదరాబాద్ టెస్ట్‌లో భారత్ 190 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకున్నా.. 28 రన్స్‌తో మ్యాచ్ ఓడిన సంగతి తెలిసిందే. 'జట్టులోని యువ బ్యాటర్లకు ఎక్కువగా టెస్ట్‌లు ఆడిన అనుభవం లేదు. అందువల్ల వారి బ్యాటింగ్ ఫామ్‌పై ఆందోళన చెందడంలేదు. గిల్, శ్రేయాస్, జైస్వాల్ త్వరలో భారీ స్కోర్లు చేస్తారు' అని రాథోడ్ విశ్వాసం వ్యక్తం చేశాడు.

వామ్మో..భారత వికెట్లా..: ఫోక్స్

భారత పిచ్‌లపై వికెట్ కీపింగ్ ఎంతో కష్టమని..ఇంగ్లండ్ కీపర్ బెన్ ఫోక్స్ అభిప్రాయపడ్డాడు. 'భారత వికెట్లపై బంతులు అనూహ్యంగా బౌన్స్ అవుతాయి. అందుకే స్పిన్నర్ల బౌలింగ్‌లోనూ వికెట్లకు దూరంగా ఉండి కీపింగ్ చేయాలి' అని చెప్పుకొచ్చాడు.

అది సహజంగా వచ్చిందే..

బజ్‌బాల్ వ్యూహాన్ని తమ జట్టు బ్యాటర్లంతా పూర్తిగా వంటబట్టించుకున్నారని ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ తెలిపాడు. అలా ఆడడం ప్రారంభించాక వారంతా బ్యాటింగ్‌లో ఎంతో మెరుగయ్యారన్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన బ్రెండన్ మెకల్లమ్ తానాడే రోజుల్లో దూకుడైన బ్యాటింగ్‌కు మారుపేరుగా నిలిచాడు. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా వచ్చాక సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ దూకుడుగా ఆడే 'బజ్‌బాల్' విధానాన్ని..ఆ జట్టుకు అలవాటు చేశాడు. బజ్‌బాల్ వ్యూహాన్ని అనుసరించడం మొదలుపెట్టాక ఇంగ్లండ్ ఇప్పటి వరకు ఒక్క టెస్ట్ కూడా ఓడిపోకపోవడం విశేషం. 'ఇంగ్లండ్ దేశవాళీలో చాలా జట్లు దూకుడుగా ఆడతాయి. అంటే..బజ్‌బాల్ మాకు సహజంగా వచ్చిందే' అని క్రాలీ వివరించాడు.

టాప్‌లోనే అశ్విన్

టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: టీమిండియా ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో బౌలర్‌గా నెంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 853 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. పేసర్ బుమ్రా ఓ స్థానం మెరుగుపరచుకొని నాలుగో ర్యాంక్‌కు ఎగబాకాడు. జడేజా ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్లలో జడేజా టాప్‌లో, అశ్విన్ రెండో స్థానంలో ఉండగా, అక్షర్ పటేల్ ఆరో ర్యాంక్‌కు పడిపోయాడు. ఇక బ్యాటర్ల విభాగంలో భారత్ నుంచి విరాట్ కోహ్లీ ఆరో ర్యాంకుతో టాప్-10లో నిలిచాడు.

అతడిపై భారమే కానీ..

న్యూఢిల్లీ: గాయంతో షమి జట్టుకు దూరం కావడం.. ప్రధాన పేసర్ బుమ్రాపై భారం పెంచేదేనని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. అయితే బుమ్రా ప్రస్తుతం శారీరకంగా దృఢంగా ఉన్న నేపథ్యంలో..ఆ భారం అతడికి సమస్య కాబోదని అభిప్రాయపడ్డాడు. వన్డే వరల్డ్ కప్ సందర్భంగా మోకాలి గాయం అయిన షమి..ప్రస్తుతం జట్టుకు అందుబాటులో ఉండని సంగతి తెలిసిందే.

మళ్లీ జై షాకే ఏసీసీ పగ్గాలు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి జై షా ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ)లో తన ఆధిపత్యాన్ని మళ్లీ చాటుకున్నాడు. వరుసగా మూడోసారి ఏసీసీ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఇండోనేసియాలోని బాలిలో బుధవారం జరిగిన ఏసీసీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఏసీసీ చీఫ్ పదవికి జై షా పేరును శ్రీలంక క్రికెట్ చీఫ్ షమ్మీ సిల్వా ప్రతిపాదించగా, మిగతా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలిసారిగా 2021లో ఏసీసీ పగ్గాలు చేపట్టిన 35 ఏళ్ల షా.. మరో రెండేళ్లు ఆ పదవిలో కొనసాగనున్నాడు. ఇక, షా నాయకత్వంలో ఆసియా కప్‌ను 2022లో (టీ20 ఫార్మాట్‌లో), నిరుడు (వన్డే ఫార్మాట్‌లో) సమర్థవంతంగా నిర్వహించారు.

శ్రీకాంత్ శుభారంభం

» థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్

బ్యాంకాక్: ఇటీవల వరుస టోర్నమెంట్లలో విఫలమవుతున్న భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ ఈవెంట్‌లో శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రపంచ మాజీ నెంబర్‌వన్ శ్రీకాంత్ 22-20, 21-19తో చైనీస్ తైపీ షట్లర్ వాంగ్ జు వీపై గెలిచాడు. మరో భారత ఆటగాడు మిథున్ మంజునాథ్ 21-17, 21-8తో జాసన్ గునవాన్ (హాంకాంగ్)ను చిత్తుచేసి కిడాంబి శ్రీకాంత్‌తో రెండోరౌండ్ పోరుకు సిద్ధమయ్యాడు. మిగతా భారత షట్లర్లలో శంకర్ ముత్తుస్వామి 21-14, 21-17తో లియోంగ్ జున్ (మలేసియా)పై, అస్మిత చాలియా 21-10, 21-16తో వోంగ్ లింగ్ (మలేసియా)పై, మాళవికా బన్సోద్ 22-20, 21-8తో ఇనెస్ లూసియా (పెరూ)పై గెలిచి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. సమీర్ వర్మ, కిరణ్ జార్జ్ ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగారు.

అవి నకిలీ టోర్నీలు

» రెజ్లర్ సాక్షి మాలిక్ ఆరోపణ

న్యూఢిల్లీ: వేటుపడిన భారత రెజ్లింగ్ సంఘం (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ నకిలీ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాడని ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ ఆరోపించింది. చట్టవ్యతిరేకంగా జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ నిర్వహించి.. ఆటగాళ్లకు నకిలీ సర్టిఫికెట్లు ప్రదానం చేశాడని ఎక్స్‌లో పోస్టు చేసింది. వీటి వల్ల ఆటగాళ్లకు భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని చెప్పింది. దీనిపై క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ దృష్టి సారించాలని కోరింది. స్పోర్ట్స్ కోడ్ ఉల్లంఘన కారణంగా కొత్తగా ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కార్యవర్గాన్ని ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

మయాంక్ డిశ్చార్జ్

» ఆరోగ్యంగానే ఉన్నానంటూ పోస్టు



అగర్తలా: విమానంలో తీవ్ర అనారోగ్యానికి గురైన కర్ణాటక రంజీ కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ప్రయాణం చేసేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకపోవడంతో మరో విమానంలో బుధవారం సాయంత్రం అతడు బెంగళూరు చేరుకొన్నాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి మరోసారి పరీక్షలు చేయించుకొంటాడని సమాచారం. ప్రస్తుతం అతడికి విశ్రాంతి తప్పనిసరి కావడంతో శుక్రవారం నుంచి సూరత్‌లో రైల్వేస్‌తో జరిగే రంజీ మ్యాచ్‌కు దూరమయ్యాడు. 32 ఏళ్ల మయాంక్ టీమిండియా తరఫున 21 టెస్టులు, 5 వన్డేలు ఆడాడు.

అఖిల్ కంచు మోత



కైరో (ఈజిప్ట్): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో చివరిరోజు భారత షూటర్ అఖిల్ షెరాన్ పతకంతో మెరిశాడు. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ వ్యక్తిగత ఈవెంట్‌లో అఖిల్ కాంస్యం సాధించాడు. ఫైనల్లో అఖిల్ 451.8 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచాడు. చెక్ రిపబ్లిక్ షూటర్ జిరి ప్రివ్రాట్‌స్కీకి స్వర్ణం, ఫ్రాన్స్‌కు చెందిన రొమైన్ అఫ్రెరెకు రజతం లభించాయి. ఈ టోర్నీలో భారత షూటర్లు ఓవరాల్‌గా రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఓ కాంస్యం గెలిచారు.

అగ్రస్థానంలో జైపూర్ పింక్ పాంథర్స్

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-10లో జైపూర్ పింక్ పాంథర్స్ అగ్రస్థానానికి చేరుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 42-27తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. ఈ విజయంతో మొత్తం 71 పాయింట్లతో జైపూర్ టాప్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో జైపూర్ రైడర్లు అర్జున్ దేశ్వాల్ 13 పాయింట్లతో, అజిత్ కుమార్ 9 పాయింట్లతో సత్తా చాటి, ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. తలైవాస్ రైడర్ నరేందర్ (12 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది. ఇక, పట్నా పైరేట్స్-బెంగళూరు బుల్స్ తలపడిన మరో మ్యాచ్ 29-29 స్కోరుతో టైగా ముగిసింది.

బిజినెస్

కాకినాడలో ఫాస్ఫారిక్ యాసిడ్ ప్లాంట్

» కోరమాండల్ ఇంటర్నేషనల్

చెన్నై: మురుగప్ప గ్రూప్ కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ ప్లాంట్‌ను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఈ ప్లాంట్‌లో కొత్తగా ఫాస్ఫారిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఈ బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌తో కంపెనీ ఎరువుల తయారీకి అవసరమైన ముడి పదార్థాల సరఫరాకు భద్రత ఏర్పడుతుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు.

ఆత్మకూరులో కేవీబీ

హైదరాబాద్ : ప్రైవేటు రంగంలోకి కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) మూడు కొత్త బ్రాంచిలను ప్రారంభించింది. దీంతో బ్యాంకు బ్రాంచిల సంఖ్య 834కి పెరిగింది. మూడింటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోను, రెండు తమిళనాడులోను ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు బ్రాంచిని పట్టణ మునిసిపల్ కమిషనర్ పి.శ్రీనివాసరావు ప్రారంభించినట్టు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ఇది బ్యాంకుకు 832వ బ్రాంచి అవుతుంది. మిగతా రెండు బ్రాంచిలు మదురై జిల్లాలోని ఉసిలంపట్టి, చెన్నైలోని మాధుర్‌లలో ఏర్పాటు చేశారు.

ఇన్‌ఫ్రా వృద్ధి 14 నెలల కనిష్ఠం

న్యూఢిల్లీ : పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన ఎనిమిది రంగాల వృద్ధిరేటు గత డిసెంబరు నెలలో 3.8 శాతానికి పడిపోయింది. బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, స్టీలు, సిమెంట్, విద్యుత్ ఉత్పత్తి తగ్గడం ఇందుకు ప్రధాన కారణం.

జీఎస్‌టీ @ 1.72 లక్షల కోట్లు

జనవరిలో 10.4 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: జనవరి నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1,72,129 కోట్లుగా నమోదయ్యాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన వసూళ్లను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక శాఖ ఈ గణాంకాలు ప్రకటించింది. గత ఏడాది జనవరి 31వ తేదీ సాయంత్రం 5 గంటల సమయానికి వసూలైన రూ.1,55,922 కోట్లతో పోల్చితే 10.4 శాతం వృద్ధి నమోదయింది. జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత ఇది రెండో అత్యధిక వసూలని ఆర్థిక శాఖ తెలిపింది. అలాగే వసూళ్లు రూ.1.70 లక్షల కోట్లు దాటడం వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఇది మూడో సారి. ఇక 2023-24 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో స్థూల వసూళ్లలో 11.6 శాతం వృద్ధి నమోదయింది. గత ఏడాదితో పోల్చితే వసూలైన మొత్తం రూ.14.96 లక్షల కోట్ల నుంచి రూ.16.69 లక్షల కోట్లకు పెరిగింది. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఒక నెలలో గరిష్ఠ వసూలు 2023 ఏప్రిల్‌లో నమోదైన రూ.1.87 లక్షల కోట్లు.

పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు షాక్

ఈ ఫిబ్రవరి 29 తర్వాత నుంచి డిపాజిట్ల స్వీకరణకు ఆర్‌బీఐ నో

» యూపీఐ, బిల్ పేమెంట్, నగదు బదిలీ సర్వీసులనూ నిలిపివేయాలని ఆదేశాలు



ముంబై: పేటీఎం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్‌కు (పీపీబీఎల్) ఆర్‌బీఐ గట్టి షాకిచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 29 తర్వాత నుంచి బ్యాంక్ డిపాజిట్లు స్వీకరించకుండా ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతోపాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ బుధవారం ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, క్యాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమచేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ ట్రాన్సాక్షన్లు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది. బ్యాంక్ పద్దులపై సమగ్ర ఆడిటింగ్ రిపోర్టుతోపాటు నిబంధనల అమలుకు సంబంధించిన ఆడిటింగ్ రిపోర్టుల ఆధారంగా బ్యాంక్‌పై ఆర్‌బీఐ తాజా చర్యలు చేపట్టింది. నిరంతరం నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా పర్యవేక్షణ లోపాలున్నాయని నివేదికల్లో వెల్లడైందని ఆర్‌బీఐ పేర్కొంది. 2022 మార్చిలోనే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. ఆర్‌బీఐ తాజా ఆదేశాలు కేవలం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ అందించే సేవలకు మాత్రమే వర్తిస్తాయి. కాబట్టి, పేటీఎం యాప్ యూజర్లు యథావిధిగా తమ సేవలను వినియోగించుకోవచ్చు. పీపీబీఎల్ అకౌంట్ మినహాయిస్తే, మిగతా బ్యాంక్‌ల అకౌంట్లతో అనుసంధానం ద్వారా పేటీఎం యాప్ నుంచి యూపీఐ చెల్లింపులు జరుపవచ్చు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.2,351 కోట్లు

హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.486 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ రూ.103 కోట్ల ఏకీకృత లాభాన్ని నమోదు చేసింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం రూ.2,351 కోట్లకు పెరిగింది. గత క్యూ3లో రూ.1,922 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో తమ విమానాశ్రయాల్లో ప్రయాణికుల రద్దీ వార్షిక ప్రాతిపదికన 16 శాతం పెరిగి 2.82 కోట్ల మందికి చేరుకుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ వెల్లడించింది.

విప్రోలో కొలువుల కోత

వందల మందిపై వేటు

బెంగళూరు: భారత్‌లోనూ కొలువుల కోత ఊపందుకుంది. ప్రముఖ ఐటీ కంపెనీ విప్రో ఇందుకు నాంది పలుకుతోంది. ఎంత మందిని తీసివేసేది కంపెనీ వెల్లడించకపోయినా, ఇది వందల సంఖ్యలోనే ఉంటుందని భావిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది 2021లో కొనుగోలు చేసిన కన్సల్టెన్సీ సంస్థ కాప్కో ఉద్యోగులని సమాచారం. జనవరి నెల ప్రారంభంలోనే తీసివేసే ఉద్యోగులకు కంపెనీ సమాచారం పంపినట్టు తెలుస్తోంది.

లాభాల కోసమే!: టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ వంటి ప్రముఖ భారత ఐటీ కంపెనీలతో పోలిస్తే విప్రో లాభాల మార్జిన్లు తక్కువ. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలోనూ విప్రో లాభాల మార్జిన్లు 16 శాతం మించలేదు. దీనికి తోడు గత నాలుగు త్రైమాసికాలుగా కంపెనీ ఆదాయ వృద్ధిరేటు ఎదుగూ బొదుగు లేకుండా పేలవంగా ఉంది. దీంతో జీతాలు ఎక్కువగా ఉండే మిడ్ లెవల్ ఉద్యోగుల్లో ఎక్కువ మందిని ఇంటికి పంపించి లాభాలు పెంచుకోవాలని కంపెనీ భావిస్తున్నట్టు సమాచారం.

మొబైళ్లు మరింత చవక..!

ధరలు 3-5 శాతం తగ్గే అవకాశం

» విడిభాగాలపై దిగుమతి సుంకం 10 శాతానికి తగ్గింపు

న్యూఢిల్లీ: దేశంలో మొబైల్ ఫోన్ల ధరలు మరింత తగ్గనున్నాయి. మొబైల్ ఫోన్ల విడిభాగాల దిగుమతిపై సుంకాన్ని 15 శాతం నుంచి 10 శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ప్రకటించింది. మొబైళ్ల తయారీకి అవసరమైన బ్యాటరీ కవర్, ఫోన్ల ఫ్రంట్, మిడిల్, బ్యాక్ కవర్స్, మెయిన్ లెన్స్, స్క్రూ, సిమ్ సాకెట్ ఇతర యాంత్రిక వస్తువులన్నీ ఈ పరిధిలోకి వస్తాయని తెలిపింది. అదనంగా, డిస్‌ప్లే అసెంబ్లింగ్ భాగాల పైనా సుంకాన్ని 10 శాతానికి తగ్గించారు. తద్వారా స్థానిక మార్కెట్లో ఫోన్ల ధరలు 3-5 శాతం మేర తగ్గవచ్చని పరిశ్రమ నిపుణులంటున్నారు. అంతే కాదు, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ, ఎగుమతులను పెంచేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. దేశంలో మొబైళ్ల తయారీ పరిశ్రమను మరింత బలోపేతం చేయనుందని.. సుంకం తగ్గింపు ఈ పరిశ్రమకు ప్రస్తుతం అవసరమైన నిశ్చయత్వాన్ని, స్పష్టతను కల్పించిందని టెలికాం మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు.

బిగ్ సీలో గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్ విడుదల



శాంసంగ్ కొత్తగా మార్కెట్లోకి తెచ్చిన అత్యాధునిక ఫీచర్లు గల గెలాక్సీ ఎస్ 24 స్మార్ట్‌ఫోన్‌ను మొబైల్ రిటైలింగ్‌లోని బిగ్ సీలో బుధవారం విడుదల చేశారు. సినీ నటి మృణాళ్ ఠాకూర్ కంపెనీ సీఎండీ బాలు చౌదరి, డైరెక్టర్ వై స్వప్నకుమార్‌లతో కలిసి ఈ హ్యాండ్‌సెట్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల చేశారు.

మార్కెట్‌లో ప్రీబడ్జెట్ ర్యాలీ

సంపద రూ.4.58 లక్షల కోట్లు అప్

ముంబై: స్టాక్‌మార్కెట్లో బుధవారం ప్రీ బడ్జెట్ ర్యాలీ కనిపించింది. సెన్సెక్స్ 612.21 పాయింట్ల లాభంతో 71752.11 వద్ద, నిఫ్టీ 203.6 పాయింట్ల లాభంతో 21725.70 వద్ద ముగిశాయి. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.4.58 లక్షల కోట్లు పెరిగి రూ.379.78 లక్షల కోట్లకు చేరింది. బుధవారం నాటి ర్యాలీకి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఎంతగానో దోహదం చేశాయి.

నోవా అగ్రిటెక్ లిస్టింగ్ అదుర్స్: ఇటీవల ఐపీఓకు వచ్చిన హైదరాబాద్ కంపెనీ నోవా అగ్రిటెక్ కంపెనీ షేర్లు బుధవారం లిస్టయ్యాయి. ఒక్కోటి రూ.41 ధరతో జారీ చేసిన ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో 36.58 శాతం లాభంతో రూ.56 వద్ద లిస్టయ్యాయి. చివరికి 43.39 శాతం లాభంతో రూ.58.79 వద్ద ముగిశాయి.

మారుతి లాభం 33% వృద్ధి

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.33,513 కోట్ల ఆదాయంపై రూ.3207 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 15 శాతం, లాభం 33 శాతం పెరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం క్యూ3లో కంపెనీ రూ.29,251 కోట్ల ఆదాయంపై రూ.2406 కోట్ల లాభం ఆర్జించింది. ఇదే త్రైమాసికంలో కంపెనీ 8 శాతం వృద్ధితో 5,01,207 కార్లు విక్రయించింది. చిన్న కార్లకు డిమాండు తక్కువగానే ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్లో తాము 4,03,929 కార్లు విక్రయించామని, 71,785 కార్లు ఎగుమతి చేశామని కంపెనీ ప్రకటించింది. ఎగుమతులు ఇంతవరకు ఒక త్రైమాసికంలో అత్యధిక రికార్డు అని పేర్కొంది. ఏప్రిల్-డిసెంబరు నెలల మధ్య కాలంలో 9 నెలల కాలంలో అత్యధిక స్థూల, నికర అమ్మకాలు; అత్యధిక నికర లాభం రికార్డులను కూడా నమోదు చేసినట్టు తెలిపింది. 9 నెలల కాలంలో కంపెనీ 15,51,292 కార్లు విక్రయించిందని, దేశీయ మార్కెట్ అమ్మకాలు 13,46,965 ఉండగా ఎగుమతులు 2,04,327 యూనిట్లని వివరించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం ముందు ఏడాదితో పోల్చితే రూ.5576 కోట్ల నుంచి రూ.9,536 కోట్లకు పెరిగిందని వెల్లడించింది.

అమరరాజా లాభం రూ.239 కోట్లు

హైదరాబాద్: అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (గతంలో అమరరాజా బ్యాటరీస్) డిసెంబరు త్రైమాసికానికి రూ.239.64 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.222.81 కోట్ల లాభంతో పోలిస్తే 7 శాతానికి పైగా వృద్ధి నమోదు చేసుకుంది. మొత్తం ఆదాయం 8 శాతం వృద్ధితో రూ.2,904.77 కోట్లకు చేరుకుంది.

మార్కెట్లోకి కొత్తగా


రెండు బెంజ్ కార్లు

» కొత్త జీఎల్ఏ, ఏఎంజీ జీఎల్ఈ 53

» కాన్సెప్ట్ ఈక్యూజీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తాజాగా భారత మార్కెట్లోకి మరో రెండు కొత్త కార్లను అందుబాటులోకి తెచ్చింది. సరికొత్త జీఎల్ఏ ఎస్‌యూవీ మోడల్‌తోపాటు ఏఎంజీ జీఎల్ఈ 53 4 మ్యాటిక్ మోడళ్లను బుధవారం విడుదల చేసింది. కొత్త జీఎల్ఏ ధరల శ్రేణి రూ.50.5-56.9 లక్షల స్థాయిలో ఉండగా.. ఏఎంజీ జీఎల్ఈ 53 ప్రారంభ ధర రూ.1.85 కోట్లుగా ఉంది. 7,000 కాంబినేషన్లలో కస్టమైజ్ చేయగలిగే ఏఎంజీ జీఎల్ఈ 53 గరిష్ఠ రేటు రూ.2.2 కోట్లు. అంతేకాదు, జీ వ్యాగన్‌లో ఎలక్ట్రిక్ వెర్షన్ అయిన 'కాన్సెప్ట్ ఈక్యూజీ'ని సైతం కంపెనీ ఆవిష్కరించింది. ఈ ఏడాదిలోనే దీన్ని మార్కెట్లోకి తెస్తారు.






బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,280 ▲	57,800 ▼	78,000 ▲
ముంబై	62,680 ▲	57,420 ▲	71,670 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ		విజయవాడ	525
హైదరాబాద్	520	విశాఖపట్నం	545
1 ఫిబ్రవరి		వరంగల్	522
చిత్తూరు	573		
గోదావరి	525	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	గోదావరి	113
వరంగల్	109	విజయవాడ	113
కరీంనగర్	109	గుంటూరు	114
మహబూబ్‌నగర్	109	ఒంగోలు	114
కర్నూలు	109	చిత్తూరు	118
విశాఖపట్నం	110		

‘మెగా’ లేదు దగానే..!



ఎన్నికల ముందు జగన్ మెగా డీఎస్సీ హామీ
అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
ఎన్నికల ముంగిట మళ్లీ డీఎస్సీ నాటకం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీ వేస్తారని ఐదేళ్లుగా ఎదురుచూసిన నిరుద్యోగులు నిలువుగా దగా పడ్డారు.! అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేసిన జగన్ ప్రభుత్వం ఇప్పుడు మెగా డీఎస్సీని తుస్సుమనిపించింది. ప్రతిపక్షంలో ఉండగా 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జగన్ ప్రకటనలు చేస్తే... ఇప్పుడు 6,100 టీచర్ పోస్టులు చాలంటూ ఆయన ప్రభుత్వమే సెలవిచ్చింది. దీంతో ఇన్నాళ్లూ మెగా డీఎస్సీ అంటూ ఊరించిన జగన్ సర్కారు.. మరోసారి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు నామమాత్రపు డీఎస్సీ ప్రకటించబోతున్నట్లు నిరుద్యోగులు భావిస్తున్నారు. బుధవారం జరిగిన కేబినెట్ మీటింగ్‌లో 6,100 టీచర్ పోస్టుల భర్తీకే మంత్రిమండలి ఆమోదం తెలిపింది. త్వరలో నోటిఫికేషన్ విడుదలచేసి ఈ పోస్టులు భర్తీ చేయబోతున్నట్లు ప్రకటించింది. దానికి ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) కూడా నిర్వహించనున్నట్లు తెలిపింది. అంటే ఈ ప్రభుత్వంలో కేవలం నోటిఫికేషన్లు ఇస్తామని, భర్తీ వచ్చే ప్రభుత్వంలోనే అని పరోక్షంగా వెల్లడించింది. అలాగే 2013లోనే రద్దుచేసిన అప్రెంటీస్ విధానాన్ని కూడా ఈ ప్రభుత్వం పునరుద్ధరించింది. అంటే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లకు రెండేళ్లపాటు పేస్కేలు అమలుచేయకుండా, గౌరవ వేతనంతో సరిపెట్టేలా ప్లాన్ చేసింది. తద్వారా డీఎస్సీలో పోస్టులు భర్తీ తర్వాత కూడా రెండేళ్ల పాటు ప్రభుత్వంపై పెద్దగా ఆర్థిక భారం ఉండదు. ఈ విధానం వద్దని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెట్టినా కొత్త నాటకాన్ని మొదలుపెట్టింది.

ఆ పోస్టులన్నీ ఏమయ్యాయ్?

ప్రతిపక్షంలో ఉండగా 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని జగన్ పదే పదే ప్రకటనలు చేశారు. అధికారంలోకి రావడమే ఆలస్యం మెగా డీఎస్సీ వేసి ఈ పోస్టులన్నీ భర్తీ చేస్తామన్నారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 6వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేయగా ఈ ప్రభుత్వం వచ్చాక భర్తీ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ఐదేళ్లలో అనేక మంది టీచర్లు రిటైర‌య్యారు. పోనీ అప్పటి లెక్కలనే తీసుకున్నా 2018 నోటిఫికేషన్‌లో ఇచ్చిన 6వేల డీఎస్సీ పోస్టులు పోగా ఇంకా 17 వేల పోస్టులు ఖాళీగా ఉండాలి. జగన్ ప్రభుత్వం కూడా గత అసెంబ్లీ సమావేశాల్లో 18,520 ఖాళీలున్నట్టు తేల్చింది. కానీ 8,366 మాత్రమే అవసరమని కొత్త భాష్యం చెప్పింది. ఇప్పుడు 6,100కు కుదించింది. అంటే పోస్టుల భర్తీ చేయకుండానే టీచర్ల అవసరాన్ని ప్రభుత్వం భారీగా తగ్గించింది. వివిధ అవసరాల కోసం ప్రపంచ బ్యాంకు వద్ద రుణం తీసుకున్న ప్రభుత్వం, దాని నిబంధనలకు తలొగ్గి టీచర్ల అవసరాన్ని తగ్గించేసింది. రాష్ట్రంలో రిటైర్ అయినవారితో కలిపి 20వేలకు పైగా ఖాళీలుంటాయని అంచనా ఉంది. వాస్తవానికి ఇటీవల నిరుద్యోగుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో ఎన్నికలను గట్టెక్కే ఉద్దేశంతో.. హడావిడిగా డీఎస్సీ డ్రామా ప్రారంభించింది. సరిగ్గా ఎన్నికలకు రెండు నెలల ముందు నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా ప్లాన్ చేశారు. 2022లో ప్రభుత్వం టెట్ నిర్వహించగా 5లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండేళ్లలో బీఈడీ పూర్తిచేసినవారు ఇంకా పెరిగారు. అలాగే అంతకముందు పూర్తయిన వారితో కలిపి మొత్తంగా రాష్ట్రంలో 7లక్షల మందికిపైగా బీఈడీ చేసిన వారున్నట్టు అంచనా. జగన్ హామీ ఇచ్చినట్లుగా మెగా డీఎస్సీ వేసి ఉంటే కొంతమేర న్యాయం జరిగేదని, కనీసం 10 వేల పోస్టులైనా ఇచ్చి ఉండాల్సిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 6వేల పోస్టులు ఏ మూలకని వాపోతున్నారు.

> రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మేం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి ఆ పోస్టులన్నీ భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు జగన్ ఊదరగొట్టారు. గంపెడాశలు పెట్టుకున్న నిరుద్యోగులు నిజమేనని నమ్మి.. ఓట్లేసి అధికారాన్ని కట్టబెట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక అదిగదిగో డీఎస్సీ.. ఇదిగిదిగో డీఎస్సీ.. అంటూ ఐదేళ్లపాటు కాలయాపన చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. 6,100 టీచర్ పోస్టుల భర్తీ చాలంటూ ఉసూరనిపించారు. ఇంతకాలం 'మెగా' డీఎస్సీ వస్తుందేమోనని ఆశగా ఎదురుచూసిన నిరుద్యోగులకు నిరాశే మిగిలింది.

సరే.. సరే.. చర్చ వద్దులే..

కేబినెట్ సమావేశంలో ముభావంగా జగన్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అస్మదీయ విద్యుదుత్పత్తి సంస్థలకు భారీగా భూ సంతర్పణ చేస్తూ సీఎం జగన్ అధ్యక్షతన బుధ వారం జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. అజెండా అంశాలను చర్చకు తావులేకుండా కేబినెట్ జెట్ స్పీడ్‌తో ఆమోదించింది. సమావేశం జరుగుతున్నంతసేపు సీఎం జగన్ ముభావంగా ఉన్నారు. కేబినెట్ అజెండా అంశాలు చకచకా పూర్తి చేశాక, తాడేపల్లికి బయలుదేరారు. దీంతో, కొందరు మంత్రులు.. ఆయన ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నారేమోనని భావించారు. కానీ, సీఎం ముక్తసరిగా మాట్లాడుతుండటం తో, మంత్రులెవరూ ఢిల్లీ యాత్రపై ఆరా తీసేందుకు సాహసించలేదు సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి సంస్థలకు ఆమోదముద్ర వేస్తూనే, భారీగా భూములను అప్పగించారు. కేబినెట్‌లో సీనియర్ మంత్రి ఒకరు, రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తికీ.. డిమాండ్‌కూ మధ్య తేడా ఎంత ఉందంటూ ఇంధన శాఖను ప్రశ్నించారు. విద్యుత్తు సమాచారం చెప్పకుండా.. సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తి సంస్థలకు ఆమోదం తెలిపితే.. భవిష్యత్తులో భారాన్ని మోయాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే.. సీఎం జోక్యం చేసుకుని.. "ఇప్పుడు ఈ సబ్జెక్ట్ మీద చర్చొద్దన్నా.. ఇది చాలా లెంగ్తీ సబ్జెక్ట్. తర్వాత చూద్దాం" అంటూ చర్చకు తావులేకుండా కొట్టిపారేశారని తెలిపింది. విశాఖలో ఎమ్మెల్యేలకు ఇళ్ల స్థలాల విషయమై ప్రశ్నించగా.. ముక్తసరిగానే స్పందించారు. ఈఅంశం కేబినెట్ అజెండాలో లేదుకదా..చూద్దాం అంటూ దాటవేశారు. నియోజకవర్గాలు మార్చిన ఎమ్మెల్యేలూ, మంత్రులూ ప్రజలతో మమేకం కావాలని జగన్ ఆదేశించారు. కొత్త నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమితులైన మంత్రులు విస్తృతంగా పర్యటిస్తూ .. ఎన్నికల ఉత్సాహాన్ని తీసుకురావాలని సూచించారు. ఒకరిద్దరు మంత్రులు ఇంకా పనితీరును మెరుగుపరచుకోవాలని జగన్ సూచించారు. ఈ నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు మూడురోజులపాటు అసెంబ్లీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతాయని కేబినెట్ భేటీలో జగన్ తెలిపారు. తొలి రోజు గవర్నర్ ప్రసంగం ఉంటుందని .. రెండు, మూడు రోజుల్లో బడ్జెట్ సమర్పణ, చర్చ .. బడ్జెట్ ఆమోదం ఉంటాయని మంత్రులకు వివరించారు.

ఎన్నికల వేళ ‘స్పెషల్ పర్పస్’!

(మొదటి పేజీ తరువాయి)

గంపగుత్తగా అమ్మేసుకున్నా .. బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పులు తీసుకున్నా అడిగేవారే కరువయ్యారు. కేబినెట్ సమావేశంలో అస్మదీయ, అనామక సంస్థలకు ఏకంగా వేలాది ఎకరాల భూములు అప్పగించేశారు.

పెట్టుబడులపై పుట్టుకొచ్చిన ప్రేమ!

గడచిన నాలుగున్నరేళ్లుగా పారిశ్రామిక పెట్టుబడులపై ఏమంత ఆసక్తిని చూపని జగన్ సర్కారు .. మరో 60 రోజుల్లో ఎన్నికలు జరగనున్ననేపథ్యంలో అస్మదీయ కంపెనీలకు జగన్ ఇబ్బడి ముబ్బడిగా భూములు దోచిపెట్టారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం కేబినెట్ సమావేశంలో ఒక మెగావాట్‌కు ఆరు ఎకరాల చొప్పున ఏకంగా 23,500 ఎకరాలు సంతర్పణ చేశారు. 3,350 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తామంటూ ప్రతిపాదించిన జేఎస్‌డబ్ల్యు, న్యూ ఎనర్జీ సంస్థలకు 20,100 ఎకరాలను జగన్ సర్కారు కేటాయించింది. ఇప్పటి దాకా ప్రభుత్వాలు అమలు చేసిన పారిశ్రామిక విధానాల మేరకు 10,050 ఎకరాలు మాత్రమే కేటాయించాలి. కానీ.. జగన్ ప్రభుత్వం ఏకంగా రెట్టింపు భూమి ధారాదత్తం చేసింది. ఆక్వాగ్రీన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సంస్థకు 1000 మెగావాట్లకు 6000 ఎకరాలను కేటాయించారు. గతంలో ఇండోసోల్ సంస్థతో చేసిన ఒప్పందంలో స్పెషల్ పర్పస్ వెహికల్ అనే పదం లేదు. ఇప్పుడు ఈ స్పెషల్ పర్పస్ వెహికల్ పేరిట భూసంతర్పణకు సిద్ధమయ్యారు. 2022 లో ఇండోసోల్ సంస్థ తో చేసుకున్న ఒప్పందం మేరకు మెగావాట్‌కు మూడు ఎకరాలు కేటాయించారు. ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ పేరిట మెగావాట్‌కు 6 ఎకరాలను కేటాయించేందుకు సిద్ధమయ్యారు. గతంలో ఈ సంస్థకు 3వేల ఎకరాలు కేటాయిస్తే.. ఇప్పుడు ఇండోసోల్‌కు కడప జిల్లా మైలవరం మండలంలోని బీ.వెంకటాపురం, నేలమాతల, ఎ.కంబాలదిన్నె గ్రామాల్లో అదనంగా 10,500 ఎకరాలు సేకరించనున్నారు.

> **కొత్తగా భూమి ఎందుకు**
>
> గతంలో పరిశ్రమలతో చేసుకున్న ఒప్పందాల మేరకు భూములు కేటాయించిన ప్రభుత్వం .. తాజాగా స్పెషల్ పర్పస్ వెహికల్ ట్యాగ్‌ను తగిలించి ఇండోసోల్ సంస్థకు గతంలో కేటాయించిన భూములు కాదని.. కొత్తగా 10500 ఎకరాల భూములను కట్టబెట్టడం వెనుక ఉన్న రహస్యమేమిటని ఇంధన రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నా రు. కడప జిల్లాకు ఇండోసోల్ సంస్థకు ఇప్పటికే జగన్ ప్రభుత్వం ఆయాచిత లబ్ధిని చేకూరుస్తూ వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులోనూ జగన్ ఉదారంగా వ్యవహరిస్తూ వచ్చారన్న ఆరోపణలున్నాయి.

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలివే ..

మహిళా సాధికారతకు, స్వావలంబనకు వెన్నుదన్నుగా నిలిచేందుకుగాను ఈ నెల 16 నుంచి నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం 2వారాల పాటు కొనసాగించాలని కేబినెట్ నిర్ణయించింది. నాలుగో విడతలో 26,98,931 మందికి రూ.5,060.40 కోట్లను మంజూరు చేయాలని తీర్మానం చేసింది.

- గ్రేడ్-5 గ్రామ పంచాయతీల పాలనాధికారాలు, మార్గదర్శకాలకు ఆమోదం.
- పాఠశాల విద్యాశాఖ, గిరిజన, వెనుకబడిన, సాంఘిక సంక్షేమ శాఖల్లో డీఎస్సీ 2024 ద్వారా 6,100 మంది ఉపాధ్యాయుల భర్తీకి ఆమోదం.
- ఎస్ఈఆర్‌టీలో భాగంగా ఐబీ సంస్థతో విద్యాశాఖ చేసుకున్నఒప్పందానికి ఆమోదం.
- వర్సిటీల్లో బోధనేతర సిబ్బంది వయోపరివిుతి 60 నుంచి 62 ఏళ్లకు పెంపు. ఉన్నత విద్య, మహిళా స్త్రీ శిశుసంక్షేమ శాఖ, పశు సంవర్ధక శాఖ, న్యాయ, రెవెన్యూ శాఖల్లో పని చేస్తున్న సిబ్బందికీ వర్తింపు.
- న్యాయస్థానం ఆదేశాల మేరకు ఖైదీ ఎం.శ్రీనివాసరావుకు(వాసు) శిక్ష రద్దు.
- మంగళగిరి రాష్ట్ర భద్రతాదళంలో 25 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు, 32 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఆమోదం.
- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి డిస్కమ్‌లు తీసుకున్న రూ.1500 కోట్లకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేందుకు సమ్మతి.
- డిస్కమ్‌లు.. పీఎఫ్‌సీ నుంచి రుణాలు తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం.
- గ్రీన్‌కో సోలార్ ఎస్పీవీకి బదులుగా 1,500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు ప్రాజెక్టుకు ఆమోదం. నంద్యాల జిల్లా గుడివేముల మండలం చిన్నకృపల్లిలో 1,272.07 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకారం.
- కడప జిల్లా చక్రాయపేటలో 400 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలో 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లి, రాప్తాడులో మరో 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లా డీ హరేలాల్, బొమ్మెనహాల్ మండలాల్లో 850 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ సోలార్ విద్యుదుత్పత్తిని చేపట్టేందుకు ఆమోదం.
- నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద 171.60 మెగావాట్ల రెండు విండ్ పవర్ ప్రాజెక్టులను జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేసేందుకు ఆమోదం.
- శ్రీ సత్యసాయి జిల్లా తలుపులు మండలం పులిగుండ్ల పల్లెలో 1000 మెగావాట్ల సోలా ర్ ప్రాజెక్టును ఏర్పాటుచేయనున్న ఆక్వా గ్రీన్ ఇంజనీరింగ్ ప్రైవేటు లిమిటెడ్ స్థాపించే విద్యుత్తు ప్లాంటుకు సమ్మతి.
- కర్నూలు జిల్లా అప్పరి వద్ద 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుకు ఆమోదం.
- సోలార్, విండ్ సహా హైడల్ పంప్డ్ స్టోరేజీ సంస్థలను ఎస్‌పీవీ ద్వారా ఏర్పాటు.
- శ్రీసత్యసాయి, అనంతపురంజిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న రిన్యూ విక్రమ్ శక్తి ప్రైవేటు లిమిటెడ్‌కు గ్రీన్ సిగ్నల్.
- అప్పర్ సీలేరు వద్ద పంప్డ్ స్టోరేజీ హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులోభాగంగా రూ.12,264కోట్లతో 150 మెగావాట్లు చొప్పున తొమ్మిది యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం.
- 15 కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లను రిలయన్స్ బయోఏర్పాటు చేసేందుకు సమ్మతి.
- బియ్యం ఆధారిత యూనిట్లుఏర్పాటు చేయనున్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్‌కు ఆమోదం.
- నరసరావుపేటలో జామియా మసీదు కాంప్లెక్సుకు ఆస్తిపన్ను మినహాయింపు.
- నేచురల్ గ్యాస్‌పై ఉన్న 24.5 శాతం వ్యాట్ నుంచి ఐదు శాతానికి తగ్గిస్తూ నిర్ణయం.
- భారీ, మెగా ప్రాజెక్టులకు రాయితీలు.
- స్టేట్ ఫైనాన్స్ నాలుగో నివేదికకు ఆమోదం.
- రాష్ట్ర ప్రభుత్వ లైఫ్ ఇన్సూరెన్సు నిబంధనలు-2024 ప్రతిపాదనలకు సమ్మతి.
- అసెంబ్లీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేటివ్ స్టడీస్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు.
- ఏపీ లెజిస్లేచర్ సెక్రటేరియేట్‌లో 27 పోస్టుల భర్తీకి ఆమోదముద్ర.
- అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్టు-1987 సవరణ, అడ్వకేట్ క్లర్క్స్ సంక్షేమ నిధి చట్టం-992 సవరణలకు సమ్మతి.
- పులిచింతల ప్రాజెక్టు పరిధిలో 5,376 నిర్వాసిత కుటుంబాలకు ఇస్తున్న ఇళ్ల పట్టాలు, ఇళ్లకు సంబంధించి రూ.52 కోట్ల స్టాంప్ డ్యూటీ, రూ.8 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల మినహాయింపు.
- విశాఖ జిల్లా చినముషిడివాడలో చెస్ క్రీడాకారిణి కోలగట్ల అలనా మీనాక్షికి 500 గజా లు, టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనికి 1000 గజాల నివాసస్థలం మంజూరు.
- తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మల్లవారిపాలెంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని(ఐఐటీ) శ్రీసిటీలో ఏర్పాటు చేసేందుకు 42.23 ఎకరాల భూమి కేటాయింపు.

13 ఎంపీ సీట్లు ఖరారు!

» అభ్యర్థులను నిర్ణయించిన టీడీపీ, జనసేన!!

» 11 చోట్ల తెలుగుదేశం పోటీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రామ్మోహన్



వల్లభనేని బాలశౌరి

రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకుగాను 13 చోట్ల టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థులను ఖరారు చేసింది. బయటకు అధికారికంగా ప్రకటించకపోయినా అంతర్గతంగా వారి అభ్యర్థిత్వాలపై ఆ పార్టీల్లో స్పష్టత వచ్చినట్లు సమాచారం. మిగిలిన స్థానాలపై కసరత్తు నడుస్తోంది. వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలను దృష్టిలో ఉంచుకుని 2-3 సీట్లలో అభ్యర్థులను ఖరారు చేయకుండా పెండింగ్‌లో ఉంచారు. అధికార పార్టీ వైసీపీ నుంచి బయటకు వచ్చిన ముగ్గురు సిటింగ్ ఎంపీలకు.. టీడీపీ తరపున రఘురామ కృష్ణంరాజు(నరసాపురం), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట).. వల్లభనేని బాలశౌరి (మచిలీపట్నం)కి టికెట్లు లభించనున్నాయి. మరో వైసీపీ ఎంపీకి కూడా టీడీపీ టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. 25 లోక్‌సభ స్థానాల్లో జనసేనకు ఎన్ని ఇస్తారో నిర్దిష్టంగా తేలకపోయినా.. ఇప్పటికి 13 సీట్లలో మచిలీపట్నం, కాకినాడ సీట్లు ఆ పార్టీకి దక్కాయి. శ్రీకాకుళం, అనకాపల్లి, విశాఖపట్నం, అమలాపురం, నరసాపురం, ఏలూరు, విజయవాడ, నరసరావుపేట, తిరుపతి(ఎస్సీ), రాజంపేట, అనంతపురం, హిందూపురంలో టీడీపీ బరిలో ఉండనుంది.

టీడీపీలో అధిక ఆశావహులు

మిగిలిన సీట్లలో అభ్యర్థులపై పరిశీలన కొనసాగుతోంది. విజయనగరం ఎంపీ సీటుకు వెంకటేశ్, కంది చంద్రశేఖర్ తదితరులు పోటీలో ఉన్నారు. అరకు (ఎస్టీ) స్థానంపై కసరత్తు మొదలు కాలేదు. రాజమహేంద్రవరం సీటుకు మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు పేరు ముందంజలో ఉంది. ఆయన కాని పక్షంలో బొడ్డు వెంకటరమణ, గన్ని కృష్ణ, శిష్టా లోహిత్ పేర్లు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. అమలాపురానికి మాజీ స్పీకర్ బాలయోగి కుమారుడు గంటి హరీశ్ పేరు ఖరారైనా.. తాజాగా మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు కుమార్తె తనకు ఆసక్తి ఉందంటూ టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. గుంటూరుకు ప్రవాసాంధ్రుడు పెమ్మసాని చంద్రశేఖర్ పేరు గతంలోనే ఖరారైంది. కానీ ఎన్నారైలకు ఇవ్వడంపై పార్టీలో ప్రతికూల చర్చ ప్రారంభం కావడంతో ప్రత్యామ్నాయంగా భాష్యం రామకృష్ణ పేరు పరిశీలనకు వస్తోంది. బాపట్ల (ఎస్సీ) స్థానానికి కనీసం అర డజను పేర్లు పరిశీలనలో ఉన్నాయి. హరిప్రసాద్, ఉండవల్లి శ్రీదేవి, పనబాక లక్ష్మి, పాలపర్తి మనోజ్‌కుమార్, ఎంఎస్ రాజు తదితరులు పోటీలో ఉన్నారు. మరి కొన్ని పేర్లను కూడా ఆ పార్టీ నాయకత్వం క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపింది. ఒంగోలు, నెల్లూరు అభ్యర్థులపై కసరత్తును ప్రస్తుతానికి పెండింగ్‌లో ఉంచింది. ఇక్కడ అసెంబ్లీ స్థానాల్లో కొన్ని మార్పుచేర్పులు జరిగే అవకాశం ఉన్నందున వీటి విషయం తర్వాత ఆలోచించాలని నిర్ణయించింది. చిత్తూరు(ఎస్సీ) స్థానానికి తలారి ఆదిత్య, యశ్వంత్, హరిప్రసాద్, సినీ నటుడు సప్తగిరి, కోనేరు ఆదిమూలం తదితర పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురంలో మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు పేరును ఖరారు చేసినా.. తాజాగా పూల నాగరాజు, అంబిక లక్ష్మీనారాయణ, బండి శ్రీకాంత్ పేర్లు పరిశీలనలోకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కడపలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితేశ్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడా చివరి వరకూ నిర్ణయం జరిగే అవకాశం లేదని చెబుతున్నారు. కర్నూలులో బస్తీ నాగరాజు, డాక్టర్ పార్థసారథి.. నంద్యాలలో సీనియర్ నేత బైరెడ్డి రాజశేఖరరెడ్డి కుమార్తె శబరి, విద్యా సంస్థల యజమాని కేవీ సుబ్బారెడ్డి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. శబరికి అవకాశం ఎక్కువగా ఉన్నట్లు వినవస్తోంది.

టీడీపీ, జనసేన ఎంపీ అభ్యర్థులు వీరే!

లోక్‌సభ స్థానం	అభ్యర్థి పేరు	పార్టీ
శ్రీకాకుళం	రామ్మోహన్‌నాయుడు	టీడీపీ
అనకాపల్లి	బైరి దిలీప్ చక్రవర్తి	టీడీపీ
విశాఖపట్నం	మెతుకుమల్లి భరత్	టీడీపీ
కాకినాడ	సాన సతీశ్‌కుమార్	జనసేన
నరసాపురం	రఘురామకృష్ణంరాజు	టీడీపీ
ఏలూరు	గోపాల్ యాదవ్	టీడీపీ
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)	టీడీపీ
మచిలీపట్నం	వల్లభనేని బాలశౌరి	జనసేన
నరసరావుపేట	శ్రీకృష్ణదేవ రాయలు	టీడీపీ
తిరుపతి(ఎస్సీ)	అంగలకుర్తి నీహారిక	టీడీపీ
రాజంపేట	సుగవాసి బాలసుబ్రమణ్యం	టీడీపీ
హిందూపురం	బీకే పార్థసారథి	టీడీపీ
అనంతపురం	కాల్వ శ్రీనివాసులు	టీడీపీ

అభ్యర్థుల కొరతతో.. అరకొరగా జాబితా

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాకినాడ లోక్‌సభ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్, మచిలీపట్నం పార్లమెంటుకు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబును ఇన్‌చార్జులుగా ప్రకటించారు. సింహాద్రి చంద్రశేఖరరావును అవనిగడ్డ అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించారు. నెల్లూరు సిటీ స్థానంలో గెలుపు అవకాశాల్లేవని.. ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారు. ఇక్కడి వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్టీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఐదు విడతల్లో 61 మంది అసెంబ్లీ.. 14 మంది లోక్‌సభ ఇన్‌చార్జులను ప్రకటించారు. అరకులోయ అసెంబ్లీ స్థానానికి ఇప్పటికే అరకు (ఎస్టీ) ఎంపీ గొడ్డేటి మాధవిని అభ్యర్థిగా ప్రకటించగా.. బుధవారం ఆమెను మార్చి ఆర్.మత్స్యలింగానికి అవకాశమిచ్చారు. సర్వేల సాకుతో విజయావకాశాల్లేవంటూ మెజారిటీ సిటింగ్‌లకు సీఎం జగన్ మొండిచేయి చూపుతున్నారు. ఈ క్రమంలో సరైన అభ్యర్థుల కోసం ఎంత అన్వేషిస్తున్నా.. ఆయన అంచనాలకు తగినవారు దొరకడం లేదు. ఇంకోవైపు.. ఒంగోలు లోక్‌సభ స్థానం అభ్యర్థిగా ఇంకా ఎవరినీ తేల్చలేదు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఖరారు చేశామని మంగళవారం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి ఎంపీ విజయసాయిరెడ్డి, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేసినప్పటికీ.. తాజా జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. అయితే ఆ స్థానంతో పాటు సంతనూతలపాడు, కందుకూరు, కావలి అసెంబ్లీలకు చెవిరెడ్డిని ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించడం గమనార్హం. గుంటూరు లోక్‌సభ సమన్వయ బాధ్యతలను విజయసాయిరెడ్డికి అదనంగా అప్పగించారు.

లోక్‌సభ అభ్యర్థులు వీరే..	
తిరుపతి(ఎస్సీ)	ఎం.గురుమూర్తి
నరసరావుపేట	అనిల్‌కుమార్ యాదవ్
కాకినాడ	చలమలశెట్టి సునీల్
మచిలీపట్నం	సింహాద్రి రమేశ్‌బాబు
అసెంబ్లీ అభ్యర్థులు...	
సత్యవేడు (ఎస్సీ)	నూకతోటి రాజేశ్
అవనిగడ్డ	సింహాద్రి చంద్రశేఖరరావు
అరకులోయ (ఎస్టీ)	మత్స్యలింగం

ఐదో జాబితా ఇంత చిన్నగా ఉండడంపై వైసీపీ ముఖ్యనేతలూ ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇన్ని నెలలుగా కసరత్తు చేస్తూ.. 175 అసెంబ్లీ .. 25 లోక్‌సభ స్థానాల్లో విజయఢంకా మోగిస్తామని అంతర్గత సమావేశాల్లో ఆర్భాటంగా చెప్పుకొంటున్న జగన్‌లో ఏదో తెలియని భీతి కనిపిస్తోందని అధికార పార్టీ వర్గాలే అంటున్నాయి.

వైసీపీలోకి రావెల

బుధవారం తాడేపల్లి సీఎం కార్యాలయానికి మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి విల్సన్‌బాబు వచ్చారు. కిశోర్‌బాబు ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.

ఆ ఫ్లెక్సీలు కట్టిన చోట జనసేన పోటీచేస్తుందా?

వైసీపీ సిద్ధం అంటూ కట్టిన ఫ్లెక్సీల పక్కనే మేమూ సిద్ధమేనంటూ జనసేన ఫ్లెక్సీలను కడుతోందని.. ఇలా పెట్టిన ప్రతి నియోజకవర్గంలోనూ జనసేన పోటీ చేయగలదా అని మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.

ఆ ఎమ్మెల్యే గాయబ్..!

నెలన్నరగా కనిపించని ఆచూకీ..
సొంత నియోజకవర్గానికి దూరం

‘డబ్బుల్లేవ్, పోటీ చేయను’ అని వైసీపీ పెద్దలకు వర్తమానం

» గతంలో టీడీపీలోనూ ఇదే వ్యూహం

» ఆర్థిక సమస్యలా.. ఓటమి భయమా?

(అమరావతి/విజయవాడ - ఆంధ్రజ్యోతి)

అతి త్వరలో ఎన్నికలు వచ్చేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక హడావుడి... వేడి బాగా పెరిగిపోయింది. సిటింగ్‌లు, ఆశావహులూ బిజీ బిజీ! కానీ... ఒక ఎమ్మెల్యే మాత్రం పత్తాలేకుండా వెళ్లిపోయారు. ఒకరోజో రెండు రోజులో కాదు... దాదాపు నెలన్నరగా ఆయన ఆచూకీ గల్లంతైంది! విజయవాడ సమీపంలోనే... జాతీయ రహదారిపైనే ఉన్న ఆ నియోజకవర్గం స్టేట్‌లోనే బాగా ఫేమస్! ఆ ఎమ్మెల్యే మరింత ఫేమస్! అయితే... గత నెలన్నరగా నియోజకవర్గ ప్రజలకు ఆయన కనిపించడంలేదు. పొరుగు రాష్ట్రంలోనే మకాం వేశారు.

డబ్బుల్లేవంట...

కొద్ది రోజులక్రితం ఆ నియోజకవర్గ పరిధిలోని ఒక పోలీస్ ఉన్నతాధికారి ఏదో విషయమై ఆ ఎమ్మెల్యేకు ఫోన్ చేశారు. 'అధికార పార్టీ' ఎమ్మెల్యే కావడంతో నియోజకవర్గానికి సంబంధించిన విషయం ఒకటి చెప్పబోయారు. కానీ... ఆ ఎమ్మెల్యే సదరు అధికారికి షాక్ తినిపించారు. 'ఈసారి ఎన్నికల్లో నేను పోటీ చేయడం లేదు. నియోజకవర్గ వ్యవహారాలతో నాకు పనేమీ లేదు. నాకు ఫోన్ చేయాల్సిన అవసరం లేదు' అని ముక్కుసూటిగా చెప్పేశారు. దీంతో కంగారుపడిన ఆ అధికారి వెంటనే ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ చెవిన వేశారు. ఎస్పీ కూడా క్షణం ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారులకు చెప్పేశారు. ఇది తెలిసిన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఒక అధికారి ఆ ఎమ్మెల్యేకు పలుమార్లు ఫోన్లు చేశారు. కానీ... ఆ ఎమ్మెల్యే వాటిని తీయలేదు. ఆర్థికంగా తన పరిస్థితి బాగోలేదని, అందువల్ల తాను ఈసారి పోటీ చేయలేనని... అందుకే నియోజకవర్గానికి కూడా వెళ్లడం లేదని ఆ ఎమ్మెల్యే అధికార పక్ష ప్రముఖులు కొందరికి చెప్పినట్లు సమాచారం.

అప్పుడూ అదే ఎత్తుగడ!?

నియోజకవర్గంలో భారీగా డబ్బు వెదజల్లుతాడని గతంలో ఆయన తనకు తనే ప్రచారం కల్పించుకున్నారు. ఏదైనా గ్రామానికి వెళ్తే పక్కన ఒక అనుచరుడిని పెట్టుకొనేవారు. అతని భుజానికి ఒక బ్యాగు తగిలించేవారు. ఆ గ్రామంలో ఎవరు ఏ ఇబ్బంది చెప్పినా వెంటనే ఆ బ్యాగులో నుంచి ఐదు వేలో పది వేలో తీసి ఇచ్చేసేవారు. ‘ఉదార స్వభావి’ అని పేరు తెచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచార పర్వాన్ని బహిరంగంగా నిర్వహించేవారు. కానీ... గత కొన్ని నెలలుగా ఈ పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ఆయన అసలు నియోజకవర్గంలో కనిపించడమే మానేశారు. ఇది నిజమైన ఆర్థిక సమస్యా లేక ఒత్తిడి పెట్టి ఆర్థిక సాయాన్ని సాధించుకొనే వ్యూహమా... అనే సందేహాలూ ఉన్నాయి. ఎందుకంటే... గతంలో తెలుగుదేశం పార్టీ వద్ద కూడా ఆయన ఇదే తరహా ఎత్తుగడ వేశారు. పోయిన ఎన్నికల సమయంలో ఆయన టీడీపీలో ఎమ్మెల్యేగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు ఆయన టీడీపీ అధినాయకత్వాన్ని కలిశారు. ఈసారి ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని, వేరే అభ్యర్థిని చూసుకోవాలని కోరారు. ఇదేమిటని విస్తుపోయిన పార్టీ నాయకత్వానికి తన బాధలు చెప్పారు. "హైదరాబాద్‌లో నాకు విలువైన భూమి ఉంది. అక్కడ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇది ప్రభుత్వ భూమని అందులో బోర్డు పెట్టేసింది. ఇప్పుడు దానిని కొనేవారు లేరు. నా పరిస్థితి దివాలా తీసినట్లుగా అయిపోయింది. రూపాయి కూడా లేదు. ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదు. అందుకే తప్పుకొంటున్నాను" అని ఆయన వివరించారు. దీంతో టీడీపీ పెద్దలు కరిగిపోయారు. "బాధ పడొద్దు. ఏదో ఒక మార్గం చూస్తాం" అని ఆయనను సముదాయించి పోటీకి ఒప్పించారు. ఎన్నికల్లో ఖర్చు కోసం భారీ మొత్తం ఇచ్చారు. ఆ ఎమ్మెల్యే ఇప్పుడు అచ్చంగా అదే వ్యూహాన్ని వైసీపీలో అమలు చేస్తున్నారని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. మరి కొందరు దీనికి భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. ఈసారి ఆయన విజయావకాశాలు బాగా తగ్గిపోయాయని, ఓటమి భయంతోనే పోటీకి దూరంగా ఉంటానని చెబుతున్నారన్నది వారి కథనం.

జగన్ తన సొంత డబ్బు ఇచ్చాడా..?

ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే కాపు

రాయదుర్గం, జనవరి 31: 'అభివృద్ధి పనులకు జగన్ ఏమైనా తన సొంత డబ్బు ఇచ్చాడా? ప్రభుత్వం సొమ్ముతో అభివృద్ధి పనులు జరిగాయి' అని అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన బుధవారం జరిగిన రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ఎక్స్ అఫీషియో హోదాలో హాజరయ్యారు. జగనన్న ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి పనులు జరిగాయని చైర్‌పర్సన్ శిల్ప వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన కాపు... 'రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధి కోసం నేను ప్రభుత్వం వద్దకు వెళ్లి చాలా నిధులు తీసుకొచ్చా. అభివృద్ధికీ, జగన్‌కీ సంబంధం లేదు. నేను నా సొంత డబ్బుతో వీధి లైట్లు వేయించా. ఎన్నికల వరకూ నేను మౌనంగా ఉంటా. ఎన్నికలయ్యాక నియోజకవర్గంలో నేను కీలకమైన వ్యక్తిగా ఉంటా' అని కాపు అన్నారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది.



మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే కాపు, చైర్ పర్సన్ శిల్ప

వాళ్లకి పట్టనప్పుడు నాకెందుకు?

» అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతా

» పార్టీ మార్పు ప్రచారం అవాస్తవం

» ఒంగోలు వైసీపీ ఎమ్మెల్యే బాలినేని



ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 31: వైసీపీ అధిష్ఠానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని, ఆయన రంగంలో ఉంటే పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల అభ్యర్థులకు బాగుంటుందనేది తన అభిప్రాయమన్నారు. కానీ, ఆయా నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు పట్టీపట్టనట్లు ఉన్నారని తెలిపారు. ఫలితంగా వైసీపీ అధిష్ఠానం దృష్టిలో తానొక్కడినే ప్రశ్నించినట్లు అయిందని తెలిపారు. మిగతా అందరికీ పట్టనప్పుడు తనకు మాత్రం ఎందుకని వ్యాఖ్యానించారు. ఎంపీ అభ్యర్థిగా ఎవరు వచ్చినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని బాలినేని చెప్పారు.




సభలో పంపిణీ చేసిన కరపత్రం; విమలారెడ్డి (ఫైల్)

జగన్ గెలవకుంటే మనకు ఇబ్బందులే!

» బెజవాడలో పాస్టర్లతో సీఎం మేనత్త విమలారెడ్డి

» ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.4 వేలు పంపిణీ

విజయవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ గెలుపు కోసం మత రాజకీయాలు మొదలయ్యాయి. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి, జగన్ మేనత్త విమలారెడ్డి అన్ని నియోజకవర్గాల్లో పాస్టర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగర పరిధిలోని ఐదారు వందల మంది పాస్టర్లతో సమావేశమయ్యారు. జగన్‌ను క్రైస్తవులందరూ కలిసికట్టుగా ఉండి గెలిపించుకోవాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అన్నట్లు సమాచారం. సమావేశానికి వచ్చిన పాస్టర్లకు ప్రార్థనాంశాల పేరుతో కరపత్రాలు పంచారు. ఆ కరపత్రాల్లో.. 'మన ముఖ్యమంత్రి జగన్‌కు త్వరలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయాన్ని దేవుడు అనుగ్రహించునట్లు ప్రార్థించండి. ఆయన ప్రారంభించిన సంక్షేమ పథకాల అమలుకు ఎలాంటి ఆటంకాలు కలుగకూడదని ప్రార్థించండి' అని అందులో పేర్కొన్నారు. కరపత్రాలతో పాటు కార్యక్రమానికి హాజరైన వారందరికీ ఖర్చుల కోసమంటూ రూ.4 వేలు చొప్పున కవరులో పెట్టి అందించారు. క్రిస్టియన్ ఇవాంజెలికల్ ఎడ్యుకేషన్ ఫెలోషిప్ ఆఫ్ ఇండియా(సీఈఈఎఫ్ఐ)కి విమలారెడ్డి ప్రెసిడెంట్‌గా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని బైబిల్ కాలేజీల్లో ఆమె వలంటరీ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ పరిచయాలతోనే పాస్టర్లతో భేటీలు నిర్వహిస్తున్నారు. సమావేశాల ఏర్పాట్లన్నీ స్థానిక వైసీపీ నాయకులే చూస్తున్నారు.

రేపు మోదీతో షర్మిల భేటీ!

» అమిత్ షా, నిర్మలనూ కలిసే చాన్సు

» వారి అపాయింట్‌మెంట్ కోరిన పీసీసీ చీఫ్

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదా కల్పించాలని, పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు తోడ్పడాలని కోరడానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రధాని మోదీని కలవనున్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో భేటీకి అపాయింట్‌మెంట్లు కోరినట్లు పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు బుధవారమిక్కడ తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీఐ, సీపీఎం, ఇతర భావసారూప్య పార్టీల నేతలను కూడా కలుసుకోవాలని షర్మిల నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్రం నుంచి సీనియర్ నేతలు కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి, జేడీ శీలం, పళ్లం రాజు సహా పార్టీ ఆఫీసు బేరర్లు, కార్యకర్తలు శుక్రవారం ఉదయానికి ఢిల్లీ చేరుకుంటారని చెప్పారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ఏపీ భవన్‌లో గానీ, జంతర్‌మంతర్ వద్ద గానీ ధర్నా చేయాలని కాంగ్రెస్ నేతలు యోచిస్తున్నారు. అయితే ఏపీ భవన్‌లో ఎలాంటి నిరసనలను అనుమతించవద్దని జగన్ ప్రభుత్వం భవన్ అధికారులను ఆదేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.



బడిపై వైసీపీ గద్దలు!

» రూ.20కోట్ల స్థలం ఆక్రమణకు కుతంత్రాలు

» బోగస్ పత్రాలతో ఆన్‌లైన్‌లో ముగ్గురి పేర్లు

» రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు

బుక్కపట్నం, జనవరి 31: ఓ స్వచ్ఛంద సంస్థ సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న పాఠశాల భూమిపై వైసీపీ నాయకుల కన్నుపడింది. బోగస్ పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు కుతంత్రాలు పన్నుతున్నారు. జర్మనీకి చెందిన గయాస్టార్ సత్యసాయిబాబా భక్తురాలు. పుట్టపర్తికి వచ్చి, ఇక్కడే ఉండేవారు. నిరుపేద పిల్లలకు విద్య బోధించాలన్న తపనతో ప్రశాంతి స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. పుట్టపర్తి సమీపంలోనే ఉన్న బుక్కపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో వేర్వేరు సర్వే నంబర్లలో 2.26 ఎకరాల భూమిని పదేళ్ల క్రితం ఆమె కొనుగోలు చేశారు. అందులో ప్రశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ఏర్పాటు చేశారు. నిరుపేద పిల్లలకు ఇక్కడ ఉచితంగా చదువు చెప్పేవారు. మధ్యాహ్న భోజనం కూడా ఉచితంగా అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటైంది. జిల్లాకేంద్రంగా పుట్టపర్తిని ప్రకటించడంతో చుట్టుపక్కల భూముల ధరలు అమాంతం పెరిగాయి. ప్రశాంతి స్కూల్ నిర్మించిన స్థలం విలువ రూ.20కోట్లు పైమాటే. దీన్ని కబ్జా చేసేందుకు అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. కరోనా సమయంలో గయాస్టార్ స్కూల్‌ను తాత్కాలికంగా మూసేసి, జర్మనీకి వెళ్లిపోయారు. పుట్టపర్తికి అరకిలోమీటరు దూరంలో, 342వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఈ పాఠశాల ఉంది. ఖరీదైన ఆ భూమిని ఎలాగైనా చేజిక్కించుకోవాలని వైసీపీ నాయకులు కుతంత్రం పన్నారు. 1904-8 సర్వే నంబరులోని 1.27 ఎకరాల భూమిని వారం క్రితం బోగస్ పత్రాలతో ముగ్గురు వైసీపీ నేతల పేరున రికార్డుల్లోకి ఎక్కించినట్లు తెలిసింది. ప్రతిఫలంగా రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జర్మనీ నుంచి వచ్చిన గయాస్టార్.. ఈ ఆక్రమణ విషయాన్ని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ దృష్టికి తీసుకెళ్లారు. అయితే పాఠశాల ఏర్పాటు చేసిన భూమి మిగులు భూమిగానే రికార్డుల్లో ఉందని, తాము ఎవరి పేరు మీదా రికార్డుల్లోకి ఎక్కించలేదని బుక్కపట్నం తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. సర్వేయర్‌తో కొలతలు వేయించగా అది ప్రభుత్వ భూమేనని తేలిందని ఆర్డీవో చెప్పారు. రికార్డులు పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఆన్‌లైన్‌లో వైసీపీ నాయకుల పేర్లు తొలగించినట్లు తెలుస్తోంది.



వైసీపీ నాయకులు కబ్జాకు యత్నిస్తున్న పాఠశాల భూమి

అవినీతి భానుడు!

(మొదటి పేజీ తరువాయి)

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యుడిగా నియమించేశారు. కానీ దేవదాయ చట్టంలోని సెక్షన్ 18, 19కి ఇది విరుద్ధమని పేర్కొంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కృష్ణా జిల్లాలోని ఆ ఎమ్మెల్యే యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1999లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లోనూ గెలిచిన ఆయన 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014లో వైసీపీ అభ్యర్థిగా ఓటమి పాలయ్యారు. 2011 మేలో కాంగ్రెస్‌ను వీడి వైసీపీలో చేరారు. 2019లో గెలుపొందారు. ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంటే ఆయన సతీమణే 'ఉదయ భానుడి'లా వెలిగిపోతున్నారు. ఆమెతో కలిసి పెద్ద కుమారుడే నియోజకవర్గంపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఆ నేత డమ్మీగా మారిపోయారు. నియోజకవర్గంలో వివిధమార్గాల ద్వారా సమకూరే ఆదాయం మొత్తం ఎమ్మెల్యే కుటుంబానికే పరిమితం అయిపోవడంతో ద్వితీయశ్రేణి నాయకులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. దీంతో ప్రతి గ్రామంలో అసంతృప్తి వర్గం కూడా తయారైంది. ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే సామాజిక వర్గానికే పెత్తనం. దీంతో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇవన్నీ తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి ఎమ్మెల్యేది,

రేషన్ బియ్యం రీసైకిల్‌తో కోట్లు

పేదల బియ్యం రీసైకిల్ చేస్తున్నారని ఎమ్మెల్యే కుటుంబసభ్యుల పాత్రపై ఆరోపణలు ఉన్నాయి. రీసైకిల్ చేసి కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తూ నెలకు సుమారు రూ.ఎనిమిది కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం, కోదాడ, సూర్యాపేటతోపాటు పలు సరిహద్దు గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఈ బియ్యాన్ని నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ముఖ్య అనుచరుల ద్వారా కాకినాడ పోర్టుకు తరలిస్తారు. నిత్యం ఐదు లారీల రేషన్ బియ్యం కాకినాడ పోర్టుకు తరలిపోతోంది. ఒక్కో లారీలో 400 క్వింటాళ్ల నుంచి రెండు వేల క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం తరలిపోతోంది.

> ఆ ఎమ్మెల్యే పరివారం అక్రమాలు హద్దులు దాటాయి. చివరకు హత్యలు చేసేవరకు వెళ్లాయి. ఆయన నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్ భూముల్లో కొండలు, గుట్టల్లో ఎమ్మెల్యే వియ్యంకుడు, అల్లుడు, కుమారుడు వందలాది లారీల మట్టిని తవ్వి తరలిస్తూ కోట్లాది రూపాయలు వెనుకేసుకుంటున్నారు. నియోజకవర్గంలో అక్రమ ఇసుక, మట్టి రవాణాను ప్రశ్నించిన బీజేపీ నాయకుడు దారుణహత్యకు గురయ్యారు. ఈ హత్యలో ఎమ్మెల్యే వియ్యంకుడి పాత్రపై ఆరోపణలు వచ్చాయి.

'పేకాట'పై రోజుకు 2 లక్షలు

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ఈ శిబిరాల నిర్వాహకులు రోజుకి రూ.2 లక్షలను ఎమ్మెల్యే కుటుంబానికి సమర్పించుకోవాలి. ఇందుకుగాను ఈ శిబిరాలకు పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా ఆయన పరివారం చేసుకుంటోంది. కొద్ది రోజుల క్రితం సెబ్ పోలీసులు పేకాట శిబిరాలపై దాడులు చేసి ఆ నేత అనుచరులపై కేసులు పెట్టారు. అయితే, పైస్థాయిలో ఒత్తిడి చేయించి ఆ కేసులను ఎత్తివేసేలా చేశారు. నేటికీ ఆ ఎమ్మెల్యే అనుచరుల కనుసన్నల్లోనే జోరుగా పేకాట శిబిరాలు సాగుతున్నాయి.

బెదిరింపులు... దౌర్జన్యాలు

తన మాట విననివారు సొంత పార్టీ వారైనాసరే... బెదిరించో, దౌర్జన్యం చేసో తన దారికి తెచ్చుకోవడం ఎమ్మెల్యేకి అలవాటు. కొద్దిరోజుల క్రితం ఓ ఎస్టీ నేతపై తన అనుచరులతో దౌర్జన్యం చేయించారు. అప్పటికీ దారికి రాకపోవడంతో నేరుగా తానే ఫోన్ చేసి తీవ్ర స్థాయిలో బెదిరించారు. ఆర్థికంగా నష్టపరుస్తానని, కోలుకోలేని దెబ్బ కొడతానంటూ బెదిరింపులకు దిగారు.

అందినకాడికి దోచేయ్..!

- నియోజకవర్గ కేంద్రం శివారు ప్రాంతాల్లో కొందరు 200 ఎకరాల్లో లేఔట్లు వేశారు. ఇవన్నీ అనధికార లేఔట్లే. వారినుంచి ఎమ్మెల్యే కోట్లలో దండుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అనధికారికంగా లేఔట్లు వేస్తున్నా, టౌన్ ప్లానింగ్ విభాగం పట్టించుకోవడం లేదంటూ సొంత పార్టీకి చెందిన వైసీపీ కౌన్సిలర్ 2023 మే 31న కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు.
- వైసీపీ సర్కారు వచ్చాక ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించింది. దీన్ని వైసీపీ నేతలు వరంగా మార్చుకున్నారు. ఆ ఎమ్మెల్యే ఇసుకను తెలంగాణ ప్రాంతానికి తరలించడంద్వారా కోట్లాది రూపాయలు ఆర్జించారు.
- నియోజకవర్గ కేంద్రం చుట్టుపక్కల చాలా పరిశ్రమలున్నాయి. వీటి నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ వసూలు చేసి వివిధ పనుల కోసమంటూ...తనకు అనుకూల కాంట్రాక్టర్ల ఖాతాల్లో వేయిస్తారు. మళ్లీ అవే పనులను ప్రభుత్వం నుంచి ఓకే చేయించుకుని బిల్లులు చేసుకుంటారు.
- ఎమ్మెల్యే అనుచరగణం ఆయన నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 10 నుంచి 15 బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ఆ నియోజకవర్గంలో గంజాయి విక్రయాలు చేస్తుంటారు. ఎమ్మెల్యే వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌పై 2023 జూలైలో అక్రమంగా మద్యం తరలిస్తున్నారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏపీ - తెలంగాణ అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో హోండా యాక్టివాలో తరలిస్తున్న 127 మద్యం బాటిల్స్ పట్టుకున్నారు. ఈ కేసులో ఎమ్మెల్యే వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌పై కేసు నమోదయింది.
- నియోజకవర్గ వ్యాప్తంగా గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వీటివెనుక ఆ ఎమ్మెల్యే కుటుంబం ఉంది. తెలంగాణ సరిహద్దుల్లో ఉండటంతో గంజాయిని రాష్ట్రాలు దాటించడంలోనూ ఎమ్మెల్యే అనుచరులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.



శ్రీకాకుళంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

ప్రత్యేక హోదా కోసం ఉద్యమిస్తాం

» చలసాని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ వెల్లడి

శ్రీకాకుళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా ఉద్యమిస్తామని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చెప్పారు. బుధవారం శ్రీకాకుళంలో వారు మాట్లాడుతూ హోదా సాధన కోసం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ ఏకమై పోరాటం చేయాలని సూచించారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించి అభివృద్ధి చేయాలి. వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమకు కేబీకే, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం విడుదల చేయాలి. ఉమ్మడి ఆస్తుల పంపకాలను జరిపి రాష్ట్రానికి రావాల్సిన వాటాను అప్పగించాలి. వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమకు కేబీకే, బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీని కేంద్రం విడుదల చేయాలి. ఉమ్మడి ఆస్తుల పంపకాలను జరిపి రాష్ట్రానికి రావాల్సిన వాటాను అప్పగించాలి' అని డిమాండ్ చేశారు.

జనం లేక రెండుసార్లు వాయిదా!

» దెందులూరు 'సిద్ధం' సభకు మూడోసారి ముహూర్తం

దెందులూరు, జనవరి 31: వచ్చే ఎన్నికలకు మేము 'సిద్ధం' అని ప్రకటించిన సీఎం జగన్‌కు ప్రజల నుంచి సరైన స్పందన లభించడం లేదు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో జన సమీకరణ సాధ్యం కావడం లేదు. దీంతో ఇప్పటికి రెండు సార్లు తేదీలు ప్రకటించి వాయిదా వేశారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ నెల 3న శనివారం సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సీఎం హాజరుకానున్నారు. తొలుత 'సిద్ధం' సభ జనవరి 30న జరుగుతుందని ప్రకటించారు. 4 లక్షల మందిని తరలించే పరిస్థితి కనిపించలేదు. దీంతో ఫిబ్రవరి 1వ తేదీకి వాయిదా వేశారు. అయినా జనాలు రారేమోనని బెంగ పట్టుకుంది. ఈ నేపథ్యంలోనే 3వ తేదీని ఖరారు చేసినట్లు తెలిసింది.

డోలీలను చూస్తే.. ఆదిమ సమాజం గుర్తొస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

తలపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. సకాలంలో వైద్యం అందక గిరిజనులు మృతి చెందుతున్నట్లు నిత్యం పత్రికల్లో కథనాలు చూస్తూనే ఉన్నామని పేర్కొంది. కొండ, గిరిజన ప్రాంతాల్లో కల్పిస్తున్న వైద్య సౌకర్యాలు, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గిరిజన ప్రాంతాలకు రోడ్లు నిర్మించకుండా సమస్యకు పరిష్కారం చూపడం కష్టమని అభిప్రాయపడింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఆయా ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేయవచ్చు కదా? అని ప్రశ్నించింది. ఈ పథకంపై వివరాలు సమర్పించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చింది. విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. గిరిజన ప్రాంతాల్లో కనీస వైద్య సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. చిన్నారి మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించని విశాఖ కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. గిరిజన ప్రాంతాల్లో సరైన రోడ్లు లేకపోవడంతో అనారోగ్యంపాలైన గిరిజనులను డోలీలతో కిలోమీటర్ల దూరం నడిచి ఆసుపత్రికి తరలిస్తున్నారన్నారు. సకాలంలో వైద్యం అందక గర్భిణీలు, వృద్ధులు మృతి చెందుతున్నారన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన మహిళను తిరిగి ఇంటికి చేర్చేందుకు అధికారులు అంబులెన్స్ కూడా సమకూర్చలేదన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య సౌకర్యం కల్పించాలని, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని వినతులు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఆరోగ్య శాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ గిరిజనులు కొండ దిగువకు వచ్చిన తరువాత అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రోడ్డు సౌకర్యం ఉన్నచోట ఫీడర్ అంబులెన్స్‌ల ద్వారా రోగులను తరలిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

జస్టిస్ మహేశ్వరి కుమార్తె పెళ్లి.. ధర్మారెడ్డి, వేమిరెడ్డి హాజరు

(మొదటి పేజీ తరువాయి)

వధూవరులను ఆశీర్వదించారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ జేకే మహేశ్వరి ప్రస్తుతం సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన ఆహ్వానం మేరకే ధర్మారెడ్డి, వేమిరెడ్డి వివాహ వేడుకకు హాజరైనట్లు తెలుస్తోంది. వీరిద్దరూ 2021లో ఒక న్యాయమూర్తి కుటుంబ సభ్యుడి పెళ్లికి హాజరై వజ్రాలు పొదిగిన వాచ్‌ను బహుమతిగా ఇవ్వజూపారని, దాన్ని ఆ జడ్జి తిరస్కరించారని 'ఆంధ్రజ్యోతి' వెల్లడించిన సంగతి తెలిసిందే!

మమ్మల్ని ముంచేస్తారా?

» ఎన్నికల ముందు ఎందుకీ టెండర్?

» మైనింగ్ అధికారులను నిలదీసిన కంపెనీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మరో రెండు నెలల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. అతిత్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ప్రభుత్వ పెద్దలే చెబుతున్నారు. అనూహ్యంగా ఇప్పుడీ టెండర్ దేనికి? ఎన్నికల ముందు టెండర్ ప్రాసెస్ చేశాక.. కొత్తగా వచ్చే ప్రభుత్వం టెండర్లను రద్దుచేస్తే.. మేం చెల్లించిన రూ.90కోట్లు నిలిచిపోతే? మమ్మల్ని నిండా ముంచేద్దామనుకుంటున్నారా' అని బెరైటీస్ కాంట్రాక్టర్లు మైనింగ్ శాఖ ఉన్నతాధికారులను నిలదీశారు. కడప జిల్లా మంగంపేట మైనింగ్ యార్డులో ఉన్న కోటి టన్నుల బెరైటీస్ అమ్మకం కోసం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి కాంట్రాక్టర్లతో బుధవారమిక్కడి ఏపీఎండీసీ కార్యాలయంలో ప్రీ-బిడ్ సమావేశం జరిగింది. జింపెక్స్, ఎంపర్గా, ట్రైమెక్స్, వర్షిణి, బీసీఎల్ తదితర బడా కంపెనీలతోపాటు మరో 27 మందికిపైగా వ్యాపారులు, కడప, కర్నూలు, అనంతపురం కొనుగోలుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు మూకుమ్మడిగా ఒకటే ప్రశ్న లేవనెత్తారు. ఎన్నికల ముందు టెండర్ ఎందుకు పిలిచారని అడగడంతో అలజడి మొదలైంది. రాష్ట్ర రాజకీయ వాతావరణం, గెలుపోటములు, కాంట్రాక్టు షరతులపై బడా కంపెనీలు గట్టిగా నిలదీశాయి. వాటికి సమాధానం చెప్పలేక, సాంకేతిక అంశాలపై స్పష్టత ఇవ్వలేక అధికారులు బెంబేలెత్తిపోయినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కంపెనీలు ప్రధానంగా ప్రభుత్వం మారితే తమ పరిస్థితేంటని ప్రశ్నించాయి టెండర్లలో పాల్గొనలేమని చేతులెత్తేశాయి. 'ప్రభుత్వం మారుతుందని ప్రచారం సాగుతుంది. ఈ పరిస్థితుల్లో భారీ టెండర్ ఎలా పిలిచారు? సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.90కోట్లు చెల్లించాలి. డాక్యుమెంట్ ఫీజే జీఎస్టీతో కలిపి రూ.29.50కోట్లు. ప్రభుత్వం మారుతుందని అంటున్నారు. కొత్తగా వచ్చే ప్రభుత్వం దీనిని నిలిపివేస్తే మేం చెల్లించిన 90కోట్లు ఫ్రీజ్ అవుతాయి. మేం చాలా సమస్యలు ఎదుర్కోవాలి. ఈ టెండర్‌లో మేం భాగస్వాములం కాలేం. బిడ్లు దాఖలు చేయలేం' అని కంపెనీల ప్రతినిధులు, వ్యాపారులు స్పష్టం చేసినట్లు తెలిసింది. గనులశాఖ ఉన్నతాధికారి జోక్యం చేసుకుని.. 'మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. బిడ్లు దాఖలు చేయండి. ఎవరూ నష్టపోరు' అని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత కంపెనీల ప్రతినిధులు మరో కౌంటర్ ఇచ్చారు. 'మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందన్న నమ్మకం మీకుంటే సరిపోదు. మాకూ అనిపించాలి. మీ నమ్మకమే నిజమైతే ఎన్నికలయ్యాకే టెండర్లు పిలవండి. అప్పటివరకు వాయిదావేయండి' అని సూచించినట్లు తెలిసింది. ఇందుకు అధికారులు ఒప్పుకోలేదని తెలిసింది.

ఐదేళ్లలో కోటి టన్నుల విక్రయమా?

టెండర్లను దక్కించుకునే సంస్థలు.. ఐదేళ్ల వ్యవధిలో కోటి టన్నుల బెరైటీస్‌ను అమ్మేయాలన్న షరతుపై కంపెనీల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆచరణ సాధ్యంకాని షరతులను తెరపైకి తీసుకురావద్దని ఏపీఎండీసీని కోరినట్లు తెలిసింది. ఏపీఎండీసీ 60 లక్షల టన్నుల బెరైటీస్‌ను గత 20 ఏళ్లలోనే అమ్మలేకపోయిందని, ఇప్పుడు కేవలం ఐదేళ్లలోనే కోటి టన్నులు అమ్మేయాలని తమకు టార్గెట్ పెట్టడం సరికాదని పలువురు అభిప్రాయపడినట్లు సమాచారం.

ప్లీజ్.. బిడ్లు వేయండి

బెరైటీస్ టెండర్లకు కంపెనీలు, కొనుగోలుదారుల నుంచి ఆశించిన స్పందన లేదు. పెద్ద కంపెనీలు సైతం బిడ్లు వేసే ధైర్యం చేయడం లేదు. దీంతో గత కొద్దిరోజులుగా ఏపీఎండీసీ అధికారులు వారికి ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు. వ్యక్తిగతంగా కంపెనీల సీఈవోలు, డైరెక్టర్లు, వ్యక్తిగత కొనుగోలుదారులకు ఫోన్ చేసి బిడ్డింగ్‌లో పాల్గొనాలని బతిమాలుతున్నట్లు తెలిసింది.

రెచ్చిపోయిన మట్టి మాఫియా

» అక్రమంగా పోలవరం కుడికాల్వ గట్టుపై గునపం

» అడ్డుకున్న టీడీపీ నాయకులపై వైసీపీ ప్రతాపం

» వెంటాడి.. కిందపడేసి... రాళ్లతో దాడి

» పోలీసుల సాక్షిగా విరుచుకుపడ్డ వైసీపీ శ్రేణులు

» వాహనాల ధ్వంసం... పలువురికి గాయాలు

» దాడిపై కలెక్టర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు



రాడ్డుతో టీడీపీ వర్గీయులపై దాడికి తెగబడుతున్న వైసీపీ నాయకుడు

పెదవేగి/ఏలూరు కలెక్టరేట్, జనవరి 31: మట్టి మాఫియా రెచ్చిపోయింది. అక్రమ తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ వర్గీయులపై విచక్షణారహితంగా దాడికి తెగబడింది. వెంటాడి మరీ తీవ్రంగా గాయపర్చింది. వారి కార్లు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసింది. అక్కడే ఉన్న పోలీసులు చోద్యం చూస్తూ మిన్నకుండిపోయారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం పరిధిలో మట్టి మాఫియా నడుపుతున్న వైసీపీ నేతల బరితెగింపు తీరు ఇది. పోలవరం కుడికాల్వ పెదవేగి మండలంలో 20కిలోమీటర్లపైగా వెళ్తోంది. కాల్వ ఇరువైపులా భారీగా గట్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈగట్టే మట్టి మాఫియాకు కాసులు కురిపిస్తోంది. మంగళవారం రాత్రి 11గంటల సమయంలో పెదవేగి మండలం లక్ష్మీపురం సమీపంలో పోలవరం కుడికాల్వ గట్టును అక్రమంగా తవ్వేస్తున్నారనే సమాచారంతో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో కలిసి వెళ్లారు. అప్పటికే మూడు ఎక్స్‌కవేటర్లతో గట్టును తవ్వేస్తూ 14 డంపర్లతో మట్టిని తరలిస్తున్నారు. ప్రభాకర్ రాకను గమనించిన తవ్వకందారులు వాహనాలను వదిలి పారిపోయారు. ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్కే.ఖాజావలికి, పోలీసులకు చింతమనేని సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చిన తర్వాత మట్టి తరలిస్తున్న వాహనాలను అప్పగించాలని తన అనుచరులతో చెప్పి వెళ్లిపోయారు. సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వచ్చిన దెందులూరు ఎస్ఐ కె.స్వామి, వాహనాల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అదే సమయంలో వైసీపీ వర్గీయులు భారీ సంఖ్యలో తిరిగి వచ్చి... టీడీపీ వర్గీయులపై దాడికి తెగబడ్డారు. దెందులూరు మండలం జోగన్నపాలెంకు చెందిన సొసైటీ మాజీ చైర్మన్ పసుమర్తి మధుబాబును తీవ్రంగా గాయపర్చారు. ప్రస్తుతం ఆయన ఏలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదవేగికి చెందిన టీడీపీ నాయకుడు తాతా సత్యనారాయణను కిందపడేసి తీవ్రంగా కొట్టారు. అతని కారు డ్రైవర్ దానం ప్రసన్నకుమార్‌ను కొట్టడంతో పాటు కారును ధ్వంసం చేశారు. మరికొన్ని కార్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. మూడు ఎక్స్‌కవేటర్లు, 14 డంపర్లను దౌర్జన్యంగా తీసుకెళ్లిపోయారు. దీనిపై బుధవారం సాయంత్రం వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు. కాగా, మట్టిని అక్రమంగా తరలిస్తు దొరికిన వైసీపీ నాయకులు రూటు మార్చారు. దెందులూరులో 3న జరిగే 'సిద్ధం' సభా ప్రాంగణం సరిచేయడానికి మట్టిని తరలిస్తున్నామని చెబుతున్నారు. ఈ ఘటనపై టీడీపీ ఏలూరు జిల్లాఅధ్యక్షుడు గన్ని వీరాంజనేయులతో కలిసి చింతమనేని ప్రభాకర్ బుధవారం ఏలూరులోని కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు ఫిర్యాదు చేశారు.

112 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

» కీలక స్థానాల్లో సొంత మనుషులు

» 710 మంది తహసీల్దార్లు కూడా...

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో భారీగా డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పలు జిల్లాలకు కొత్తగా రెవెన్యూ అధికారులను(డీఆర్ఓ), డివిజన్‌లకు ఆర్డీఓలను నియమించింది. నమ్మకస్థులైన అధికారులను కీలక డివిజన్లలో నియమించడానికి ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేసింది. బదిలీపై 2నెలలు కూడా పనిచేయని అధికారులను మార్చేసి, ఆయా స్థానాల్లో తమకు నమ్మకస్తులైన వారికి పోస్టింగ్ ఇచ్చిందన్న చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. ఏమాత్రం సిఫారసులు లేని వారిని ప్రాధాన్యం లేని పోస్టులకు, సిఫారసులతోపాటు సొంత మనుషులుగా ముద్రపడిన వారిని ఏరికోరి కీలక స్థానాల్లో కూర్చోబెట్టినట్లు విమర్శలు వెల్లువెత్తున్నాయి. కొన్నేళ్లుగా రాయలసీమలోనే చాలా ముఖ్యమైనపోస్టుల్లో పనిచేస్తున్న తిప్పేనాయక్‌ను కాకినాడ డీఆర్ఓగా, సీఎం అదనపు కార్యదర్శి వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్న భవానీ శంకర్‌ను విజయవాడ ఆర్డీఓగా బదిలీ చేశారు. చీరాలకు సూర్యనారాయణరెడ్డి, కర్నూలుకు శేషిరెడ్డి, జేసీకు బి.మహేశ్వర్‌రెడ్డి, నగరికి కె.వెంకటరెడ్డి, నంద్యాలకు వి.మల్లికార్జున్‌రెడ్డి, ధర్మవరానికి వెంకటశివరామిరెడ్డిని ఆర్డీఓలుగా బదిలీ చేశారు. మన్యం జిల్లా డీఆర్ఓగా ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లాకు వల్లభనేని శ్రీనివాసరావు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు లక్ష్మణమూర్తి, కాకినాడకు తిప్పేనాయక్, ఏలూరుకు పుష్పమణి, గుంటూరుకు పెద్దిరోజా, కృష్ణాకు కె.చంద్రశేఖర్‌రావు, నంద్యాలకు ఎ.పద్మజ, చిత్తూరుకు బి.పుల్లయ్య, అనంతపురానికి జి.రామకృష్ణారెడ్డి, పశ్చిమగోదావరికి జి.ఉదయభాస్కర్ డీఆర్ఓలుగా బదిలీ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సీఈఓగా డి.వెంకటేశ్వరరావు, శ్రీకాళహస్తి ఆలయ అధికారిగా ఎస్వీ నాగేశ్వరరావు, కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా జె.వెంకట్రావు బదిలీ అయ్యారు. పాలకొండ ఆర్డీఓగా వి.వెంకటరమణ, సత్తెనపల్లికి మురళీకృష్ణ, కొత్తకోటకు సత్యనారాయణ, చీరాలకు సూర్యనారాయణరెడ్డి, నర్సారావుపేటకు పి.సరోజిని, మదనపల్లికి హరిప్రసాద్, నూజివీడుకు భవానీ శంకరి, రాజంపేటకు టి.మోహన్‌రావు, జమ్మలమడుగుకు జి.శ్రీనివాసులను ఆర్డీఓగా బదిలీ చేశారు. కాగా, ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా 710మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

27 మంది అడిషనల్ ఎస్పీల బదిలీ

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 27 మంది అడిషనల్ ఎస్పీలను హోంశాఖ బదిలీ చేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఉమ్మడి జిల్లాలో మూడేళ్లు పనిచేసినవారిని పోలీసుశాఖ మరో జిల్లాకు పంపింది. ఏ ఒక్కరినీ సొంత జిల్లాలో లేకుండా జాగ్రత్త పడింది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల విభాగంతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిటీ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన కనకరాజును మరోసారి విజయవాడలోనే అడిషనల్ డీసీపీ(శాంతిభద్రతలు)గా నియమించడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. బదిలీ అయిన వారిలో శాంతిభద్రతల విభాగం నుంచి 21మంది, ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు చెందిన ఆరుగురు ఉన్నారు.

ఐపీఎస్ బదిలీల్లో మార్పులు

» శంఖబ్రత బాగ్చీకి గ్రేహౌండ్స్ అదనపు బాధ్యతలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ బదిలీల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఎనిమిది మంది సీనియర్ ఐపీఎస్‌ల బదిలీల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం జీవో విడుదల చేశారు. డీజీపీ కార్యాలయంలో లాండ్ ఆర్డర్ ఏడీగా ఉన్న శంఖబ్రత బాగ్చీకి గ్రేహౌండ్స్ ఏడీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్పీ రాజశేఖర్ బాబుకి ఎస్ఎల్‌పీబీ చైర్మన్‌తో పాటు కోస్టల్ సెక్యూరిటీ ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న ఆర్.గంగాధరబాబును సీఐడీ సూపరింటెండెంట్‌గా నియమించారు. విజయవాడ లాండ్ ఆర్డర్ డీసీపీగా కృష్ణకాంత్ పటేల్‌ను నియమించారు. కాకినాడ ఎస్పీ సతీశ్ కుమార్‌కు కాకినాడ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మంగళగిరి 6వ బెటాలియన్ కమాండెంట్‌గా వి.రత్నను ప్రభుత్వం బదిలీ చేసింది. సీఐడీ ఎస్పీగా ఉన్న అమిత్ బర్దర్‌ను అనంతపురం 14వ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించింది. విశాఖపట్నం లాండ్ ఆర్డర్ డీసీపీని ఇంటెలిజెన్స్‌కి బదిలీ చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

'గాంధీ'లో సంక్షోభం.. ఖాతాదారులకు శాపం

చైర్మన్ ఏకపక్ష నిర్ణయంతో కోరం లేక నెలవారీ సమావేశం వాయిదా

● నిలిచిన రుణ మంజూరు ప్రక్రియ ● 96ఏళ్ల బ్యాంకు చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి



విజయవాడ - ఆంధ్రజ్యోతి: గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకులో నెలకొన్న సంక్షోభం ఖాతాదారులపై ప్రభావం చూపుతోంది. వివిధ రకాల రుణాలకు వచ్చిన దరఖాస్తుల ఆమోదానికి ప్రతినెలా జరగాల్సిన బ్యాంకు డైరెక్టర్ల సమావేశం కోరం లేక వాయిదాపడింది. దీంతో రుణ మంజూరు ప్రక్రియకు బ్రేక్ పడింది. పాలకమండలి సభ్యుల వివాదాలతో అత్యవసర పనుల వల్ల రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం నెలకొంది.

నగరం కేంద్రంగా పనిచేస్తున్న గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. తనపై అవిశ్వాస తీర్మానం పెట్టారనే ఆగ్రహంతో బుధవారం జరగాల్సిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి డైరెక్టర్లందరినీ పిలవకుండానే నిర్వహించేందుకు చైర్మన్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కోరం లేక సమావేశం నిర్వహించలేదు. ఖాతాదారుల ప్రయోజనాలను బేఖాతర్ చేస్తూ 30ఏళ్లుగా బ్యాంకు అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తున్న వైఎస్ చైర్మన్ ఏకే అన్సారీ, డైరెక్టర్ సగ్గుర్తి నాగేశ్వరరావు వంటి సీనియర్ డైరెక్టర్లను ఆహ్వానించి సమావేశాన్ని నిర్వహించాల్సిన చైర్మన్ మొండివైఖరితో వారు లేకుండానే సమావేశం నిర్వహణకు సిద్ధమయ్యారు. దీన్ని అధికారులు అంగీకరించలేదు. ప్రతినెలా రుణాల మంజూరుకు వచ్చే దరఖాస్తులను సెలక్షన్ కమిటీలో చర్చించి ఆమోదించాలి. మరుసటి రోజు రుణాలు మంజూరు చేస్తారు. ఈ క్రమంలో చైర్మన్ వెంకట్రావు తనకు అనుకూలమైన డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం దరఖాస్తుల ఆమోదం, రుణాల మంజూరు మెజారిటీ డైరెక్టర్ల ఆమోదంతో జరగాలి. సమావేశానికి వచ్చిన డైరెక్టర్లతో కోరం సరిపోక వాయిదా పడింది. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. 96 ఏళ్ల బ్యాంకు చరిత్రలో రుణ మంజూరు ప్రక్రియ నిలిచిపోవడం ఇదే తొలిసారి.

వారే కారణమా..!

గాంధీ బ్యాంకు సంక్షోభంలో ఆడిటర్ల పాత్రపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్యాంకుకు నలుగురు ఆడిటర్లున్నారు. బ్యాంకులో జరిగే ఆర్థిక అవకతవకలపై దృష్టి సారించి సరిదిద్దాల్సి ఉంది. కానీ వారు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. ఏదైనా కొత్తశాఖను ప్రారంభించాలంటే ముందుగా బ్రాంచికి అనువైన భవనాన్ని ఎంపిక చేసుకుని, భవన యజమాని నుంచి రాతపూర్వకమైన అనుమతి, షరతులు వంటివాటితో డైరెక్టర్ల బోర్డుకి లేఖ ద్వారా తెలపాలి. దాంతోపాటు ఇంటికి సంబంధించిన దస్తావేజుల కాపీ, ఇంటిపన్ను రశీదును జత చేయాలి. తదుపరి బోర్డు మీటింగ్‌లో అజెండా ద్వారా ప్రవేశపెట్టి పాలకవర్గం ఆమోదించాక ఒప్పందం చేసుకోవడానికి ఒక కమిటీకి అధికారం ఇవ్వాలి. ఆ ఒప్పందాన్ని బోర్డులో ప్రవేశపెట్టి ఆమోదం పొందాకే భవన యజమానికి చెక్కు రూపంలో అడ్వాన్సు చెల్లించాలి. ఇవేవీ లేకుండానే గాంధీ బ్యాంకు చైర్మన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి కలిసి సుమారు రూ.40లక్షల బ్యాంకు సొమ్మును ఖర్చు చేయడం వివాదాస్పదమవుతోంది. దీనిపై బోర్డు సభ్యులు చైర్మన్‌ను ప్రశ్నించగా ఆయన బోర్డు సభ్యులను బెదిరించినట్టు సమాచారం. అందుకే చైర్మన్‌పై బోర్డు సభ్యులు అవిశ్వాసం ప్రతిపాదించే వరకు పరిస్థితి వెళ్లింది.



సబ్‌కలెక్టర్ అదితిసింగ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

అదితిసింగ్ సేవలు అద్వితీయం: కలెక్టర్

కృష్ణలంక, జనవరి 31: సబ్ కలెక్టర్‌గా అదితిసింగ్ సేవలు అద్వితీయమని, ఆమె సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకొన్నారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అదితి సింగ్ తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, జేసీ సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, డీఆర్‌వో ఎస్వీ నాగేశ్వరరావు, డ్వామా పీడీ కె.సునీత, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమానికి అదితిసింగ్ భర్త ఐఏఎస్ అధికారి ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబద్ధతతో, క్రమశిక్షణతో అదితి సింగ్ సేవలందించి తనదైన ముద్ర వేసుకొన్నారన్నారు. ఇన్‌చార్జి ఆర్డీవో జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆకాశవాణి ప్రోగ్రాం ఇన్‌చార్జిగా

వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం

విజయవాడ కల్చరల్, జనవరి 31: ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రోగ్రాం హెడ్‌గా వి.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేంద్రం డీడీజీ సోమేశ్వరరావు మాట్లాడుతూ 75ఏళ్ల చరిత్ర కలిగిన ఆకాశవాణి నగరం కేంద్రంలో అపారమైన అనుభవం ఉన్న బి.వెంకటేశ్వర్లు కార్యక్రమ అధిపతిగా నియమితులవడం శుభపరిణామన్నారు. ప్రోగ్రాం హెడ్‌గా బాధ్యతలు తీసుకొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరి సహకారంతో మరిన్ని మంచి కార్యక్రమాలతో ఆకాశవాణిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వార్తా విభాగం ఏడీ వెంపటి శ్రీసాయి, ఆకాశవాణి దూరదర్శన్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ చుండూరు మాణిక్యరావు, ప్రోగ్రాం సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది, ఎస్టీ/ ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లును అభినందించారు.



దీక్షను ప్రారంభిస్తున్న నక్కా వెంకటేశ్వర్లు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్ష

ధర్నాచౌక్, జనవరి 31: తాము దాచుకున్న సొమ్మును తిరిగిచ్చేందుకు నిబంధనలు పెట్టి ఇవ్వకుండా ఉండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ధర్నాచౌక్‌లో యూటీఎఫ్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరహార దీక్షను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పోరాటం చేస్తే గానీ మాకు రావాల్సిన సొమ్ము మాకు తిరిగివ్వరా? అని ప్రశ్నించారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీని కూడా నేటికి నేరవెర్చలేదని విమర్శించారు. 2023 సెప్టెంబరులో చెల్లిస్తామన్న బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు రోడ్లపైకి రావడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సీఎం జగన్ 2019లో పాదయాత్ర సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకిచ్చిన ఒక్కహామీ అమలు చేయలేదన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్య, వివిధ మండలాల నేతలు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలను మ్యానిఫెస్టోల్లో పెట్టాలి

● రాష్ట్ర వృద్ధుల సంక్షేమ సంఘం డిమాండ్

గవర్నర్‌పేట, జనవరి 31: వృద్ధుల సమస్యల పరిష్కారంలో ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగుతున్న రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో వృద్ధుల సమస్యలు పొందుపర్చాలని రాష్ట్ర సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం ఎంజీ రోడ్డులోని బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంపరాల నారాయణమూర్తి, కె. రామచంద్రరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు వృద్ధుల సమస్యలపై వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈసమావేశంలో సంయుక్త అధ్యక్షుడు మోతుకూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వేమూరి బాబూరావు, ప్రతినిధులు డి. సాంబశివరావు, బి. కైలాసరావు, యూవీ సాగర్, వేల్పూరి రాంబాబు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఉపాధి కల్పనకు ప్రాధాన్యత

● జిల్లా ఉపాధి కల్పనా అధికారి విక్టర్‌బాబు

కృష్ణలంక, జనవరి 31: విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఉపాధి కల్పనా అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు తెలిపారు. బుధవారం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ నేతృత్వంలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల మినీ జాబ్‌మేళా జరిగింది. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ ఈ మేళాలో కంపెనీల ప్రతినిధులు పాల్గొని 15 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఎం.రామ్మోహన్‌రెడ్డి, యంగ్ ప్రొఫెషన్ ఎస్.జయరాజు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ సిబ్బంది నాగస్వర్ణ, సులోచన, పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

పశ్చిమ టీడీపీ సీటు ముస్లింలకు ఇవ్వాలి

వన్‌టౌన్, జనవరి 31: వచ్చే ఎన్నికల్లో పశ్చిమలో టీడీపీ నుంచి పోటీకి ముస్లిం మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని టీడీపీకి చెందిన పలువురు ముస్లిం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు పంజా సెంటర్‌లో బుధవారం ధర్నా చేశారు. నేతలు షేక్ తాజుద్దీన్, సయ్యద్ సలీం, మహమ్మద్ రజవుల్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు



ఉంగుటూరు మండల జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు

గన్నవరం, జనవరి 31: తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీల అభ్యున్నతి జరిగిందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉంగుటూరు మండల జయహో బీసీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ టీడీపీ అని అన్నారు. రాజకీయంగా బీసీలు టీడీపీలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందని, చంద్రబాబు అదే ఒరవడిని కొనసాగిస్తూ ఎన్నో ఉన్నత పదవులిచ్చి సముచిత గౌరవం ఇస్తున్నారన్నారు. వైసీపీ బీసీలను నమ్మించి మోసం చేసిందన్నారు. వైసీపీ పాలకుల వద్ద బీసీ నేతలు చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ మాట్లాడుతూ సమష్టిగా టీడీపీ-జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ నేతలు దొంతు చిన్న, బచ్చుల బోస్, వీరంకి గురుమూర్తి, బత్తిన దాస్, వేణు, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనుక్, మోదుగుమూడి సత్యన్నారాయణ, కొండేటి కొండలరావు, సామిరెడ్డి రాము, నక్కా వెంకటేశ్వరరావు, దండు సుబ్రమణ్యంరాజు, వేమిరెడ్డి శ్రీనివాసరావు, మురళి, పరసా కిరణ్ పాల్గొన్నారు.

గన్నవరాన్ని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా

హనుమాన్‌జంక్షన్: కేడీసీసీ బ్యాంక్‌ను నెంబరు వన్ స్థానానికి తెచ్చినట్టే ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే నియోజక వర్గాన్ని కూడా నెంబర్ వన్ స్థానానికి తీసుకువస్తానని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం హనుమాన్‌జంక్షన్‌లో బాపులపాడు మండల టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జయహో బీసీ సదస్సు జరిగింది. ముందుగా యార్లగడ్డ ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు వేగిరెడ్డి పాపారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పాల్గొని మాట్లాడారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచాలి: డీటీసీ

కృష్ణలంక, జనవరి 31: దేశ ప్రగతిలో మానవవనరుల పాత్ర కీలకమని, రహదారి ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే పౌరసమాజంలో రోడ్డు భద్రతపై తగిన అవగాహన పెంపొందాలని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం.పురేంద్ర అన్నారు. ది కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అసోసియేషన్ హాలులో రహదారి భద్రతా వారోత్సవాలల జరిగాయి. డీటీసీ ముఖ్య అతిథిగా పాల్గొని కరపత్రాలు విడుదల చేశారు. కృష్ణలంక సీఐ ఎ.మురళీకృష్ణ, నేతలు అలాడ సత్యనారాయణ, వై.వి.ఈశ్వరరావు, కాజ చలపతిరావు, కుచ్చర్లపాటి సత్యనారాయణరాజు, చెన్నుపాటి వినయ్, రావి శరత్‌బాబు, పొట్లూరి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి 'సుమధుర' హాస్య నాటిక పోటీలు

విజయవాడ కల్చరల్, జనవరి 31: హాస్య నాటికలకు పెద్దపీట వేస్తూ తెలుగు నాట హాస్యనాటకానికి ఏకైక చిరునామాగా ఉన్న సుమధుర కళానికేతన్ 50వ వార్షికోత్సవంలో భాగంగా 26వ తెలుగు హాస్య నాటిక పోటీలు ఫిబ్రవరి 1నుంచి 4వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్‌కు జంధ్యాల స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నారు. శనగల కబీర్ దాస్ స్మారక పురస్కారాన్ని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్‌కు, ప్రముఖ సినిమా నటుడు రావికొండలరావు, రాధాకుమారి స్మారక పురస్కారాన్ని వర్ధమాన నటి గుడివాడ లహరికి అందచేయనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. లబ్బీపేటలోని హోటల్ గ్రాండ్‌మినర్వాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎంసీ దాస్, కార్యదర్శి పసుమర్తి భాస్కర్ శర్మ, డాక్టర్ కైలాష్‌రావు ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు

కృష్ణలంక, జనవరి 31: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల భద్రతకు చేసిన ఏర్పాట్లను తనిఖీ చేశారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా గోదాము భద్రతకు చేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై ఎన్నికలు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అప్రమత్తంగా వుండాలన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నామినేషన్ల స్వీకరణ వరకు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని, ప్రచురించిన జాబితాలో అర్హత ఉండి ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి నమోదు చేయించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాలులో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్‌కు బీఎల్ఏ (బూత్ లెవల్ ఏజెంట్) నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని రాజకీయ ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఢిల్లీరావుకు అభినందన

ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఢిల్లీరావు ఎంపికవడం పట్ల సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయన్ను అభినందించారు. డీఆర్‌వో ఎస్వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, కె.పరమేశ్వరరావు (ఆప్), ఎం.వినోద్ కుమార్ (బీఎస్పీ), వై.రామయ్య (టీడీపీ), వై.ఆంజనేయరెడ్డి (వైసీపీ), టి.శ్రీకుమార్, పీవీ శ్రీహరి (బీజేపీ), ఎ.నాగేంద్రప్రసాద్ (ఐఎన్‌సీ) పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దారి మళ్లిస్తే కఠిన చర్యలు

● జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు



మొగల్రాజపురం, జనవరి 31: రేషన్ పంపిణీలో అలసత్వం వహించినా, బియ్యాన్ని దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకుంటామని రేషన్ డీలర్లను, ఎండీయూ ఆపరేటర్‌లను జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహన్‌బాబు హెచ్చరించారు. గాంధీనగర్ జిల్లా పౌరసరఫరాల కార్యాలయం లో బుధవారం జిల్లాలోని అన్ని మండల డీలర్లు, ఎండీ యూ ఆపరేటర్ల ప్రతినిధులు, మండల డీటీలతో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. సర్కిల్-2 ఏఎస్‌వో ధనుంజయరెడ్డి, జిల్లా రేషన్ డీలర్స్ సంఘ ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐతా కిషోర్, నగర నేతలు జొన్నలగడ్డ శ్రీను, పూర్ణ, కమిటీ సభ్యులు, మం డల నేతలు భూషణం, సుబ్బారావు, జమలయ్య, జిల్లా మహిళా విభా గం అధ్యక్షురాలు ఇందిరా, ఎండీయూ సంఘ ప్రతినిధులు, డీటీలు రా మకృష్ణ, శివ, శ్వేత, శివనాగరాజు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

16న సమ్మెను జయప్రదం చేయండి

ధర్నాచౌక్, జనవరి 31: సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. కార్మిక, కర్షక సంఘాల సంయుక్త సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీ జేపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ నేత కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూసీ నేత సుబ్బరావమ్మ, రైతు నేతలు మర్రెడ్డి వెంకటరెడ్డి, పి.జమలయ్య పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు.. గంజాయి, మద్యం స్వాధీనం

రైల్వేస్టేషన్, జనవరి 31: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో బుధవారం పోలీసులు నిర్వహించిన తనిఖీలో అక్రమంగా తరలిస్తున్న 10 కిలోల గంజాయి, రూ.2,56,500 విలువైన ఓల్డ్‌మాంక్ రమ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాలతో డీఎస్పీ పి నాగరాజురెడ్డి సూచనలతో జీఆర్‌పీ సీఐ పి శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టీ చంద్రశేఖరరెడ్డి, ఎస్ఐ ఖాదర్ హుసేన్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మక్కతలాల్ నాయక్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో తిరుక్కురల్ ఎక్స్‌ప్రెస్ బీ3 కోచ్ 63, 72 బెర్త్‌ల వద్ద ఆరు బ్యాగులను గుర్తించి తనిఖీ చేశారు. వాటిలో 285 ఓల్డ్‌మాంక్ ట్రిబుల్ ఎక్స్ రమ్ బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ 2,56,500 ఉంటుందన్నారు. మరో కేసులో ప్లాట్ ఫారం 8లో ఒడిశాకు చెందిన వ్యక్తి రంజన్ ముని నుంచి 10కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటిపై పోలీసులు కేసు నమోదు చేసి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు.



అక్రమ మైనింగ్ ప్రదేశాల ఫొటోలను చూపిస్తున్న మహేశ్వరరావు

రూ. 2,500 కోట్ల అక్రమ మైనింగ్

● వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీ హస్తం: సమతా సైనిక్ దళ్ నేతలు

ధర్నాచౌక్, జనవరి 31: నగరానికి కూతవేటు దూరంలోని కొత్తూరు రిజర్వ్ ఫారెస్టులో వైసీపీ ముఖ్య నేతల కనుసన్నల్లో మూడేళ్లుగా రూ.2,500 కోట్ల అక్రమ మైనింగ్ జరుగుతోందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్వరరావు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్సీ తలశిల రఘురాం, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ఉన్నారని అధికారులే చెబుతున్నారన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని ఎన్‌జీటీ ఇచ్చిన ఆదేశాల అమలులో విఫలమైన కలెక్టర్, సీపీ, మైన్స్ డైరెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిలకు జైలుశిక్ష విధించాలని కోరుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ)లో పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఫిబ్రవరి 9న చెన్నైలోని ఎన్‌జీటీ సదరన్‌జోన్ బెంచ్ చైన్నైలో విచారణ జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి సీబీఐతో విచారణ చేయించాలని కోరారు. ప్రధానకార్యదర్శి పిల్లి సురేంద్రబాబు మాట్లాడుతూ అక్రమ సంపాదనతో సీఎం జగన్ మరలా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై తమకు అనేక బెదిరింపులు వస్తున్నాయని మాకేమైనా హానీ జరిగితే సీఎం జగన్, వైసీపీ నేతలే బాధ్యత వహించాలన్నారు.

బెంగళూరు సాంస్కృతిక ప్రదర్శనలకు నగర కళాకారులు

విజయవాడ కల్చరల్, జనవరి 31: అఖిల భారత సంస్థ సంస్కార భారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు బెంగుళూరులో శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమంలో 4రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల్లో నగరానికి చెందిన కళాకారులకు అవకాశం లభించింది. దేశంలోని అనేకమంది కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శిస్తారు. నగరానికి చెందిన కళాకారులు 'బాలశివాజీ సమరస భావం భళి భళి' అనే నాటక ప్రదర్శన, కూచిపూడి బృంద ప్రదర్శనలు చేయనున్నట్టు తెలిపారు. విజయనగర సామ్రాజ్య వంశస్థులు శ్రీ కృష్ణ దేవరాయ పాల్గొంటారన్నారు. రాష్ట్రం నుంచి ప్రముఖ సంగీత, నాటక, నృత్య, చిత్రలేఖన కళాకారులు, సంస్కార భారతి కార్యకర్తలు 52 మంది ప్రతినిధులు బెంగళూరులో కళాసాధక సంగమంలో పాల్గొననున్నారు. సంస్కార భారతి అధ్యక్షుడు పీవీఎన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ తెలిపారు.

టీడీపీ హయాంలోనే సెంట్రల్ అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా

సత్యనారాయణపురం: నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, సెంట్రల్‌లో తాను ఎమ్మెల్యేగా జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ హయాంలో ఒక్కశాతం పనులు పూర్తి కాలేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. మొగల్రాజపురంలోని తన నివాసంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధురానగర్ ఆర్‌యూబీని తాను మొదలు పెడితే అసమర్థ వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. మధురానగర్ దేవినగర్ పై ఓవర్‌ను పూర్తిచేసింది తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడేనని గుర్తు చేశారు. సెంట్రల్‌లో ముస్లింలకు కబరిస్థాన్ నిర్మాణానికి రూ.కోటి 50లక్షలు ఖర్చుపెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. కల్యాణమండపాలు, స్కూల్స్, ఆరోగ్య కేంద్రాలు, రోడ్లు, అంతిమయాత్ర భవన్, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసినవేనన్నారు. అంత అభివృద్ధి చేస్తే ఈరోజు పక్క నియోజకవర్గం నుంచి తోలేస్తే వచ్చిన వెల్లులిపాయ వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. దమ్ముంటే తాను చేసిన అభివృద్ధి నిజం కాదని నిరుపించాలని లేకుంటే కామ్‌గా కూర్చోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, గొర్లపాటి విజయకుమార్, పైడి శ్రీను పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాల స్వామి

దేవస్థాన నిర్వహణ అస్తవ్యస్తం

వన్‌టౌన్: స్థానిక కొత్తపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత సంతాన వేణుగోపాల స్వామి దేవస్థాన నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, సరైన యాదవ కమిటీకి నిర్వహణ అప్పగించాలని దేవస్థాన పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లొడగం వెంకట సురేష్, కోరాడ శేషుబాబు దేవదాయశాఖ కమిషనర్‌కు బుధవారం లేఖ రాశారు. లేఖలో ఈనెల 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావించారు. దేవస్థానం అభివృద్ధికి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు హయాంలో రూ.కోటి మంజూరయ్యాయని, తాత్కాలికంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి వారికి పెత్తనం అప్పగించారన్నారు. అయితే ఆ కమిటీ మిగతా వారెవరితో గానీ, ధర్మకర్తల మండలితో గానీ, మిగతా యాదవులలెవరికీ తెలియకుండా ఇష్టానుసారం గుడిని నిర్మించారన్నారు. మరోవైపు నిర్మాణాలు పూర్తి కాకుండానే 8షాపులకు వేలం నిర్వహించారన్నారు. మూలవిరాట్టుకు ఎదురుగా ఆంజనేయస్వామిని సరిగా ఏర్పాటు చేయలేదన్నారు. సరైన యాదవ కమిటీకి దేవస్థానం నిర్మాణం పనులను అప్పగించాలని సూచించారు.

బొమ్ములూరు చెక్‌పోస్ట్ వద్ద

13.95లక్షల నగదు స్వాధీనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బొమ్ములూరు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో అక్రమంగా తరలిస్తున్న నగదు బయటపడింది. బుధవారం చెక్‌పోస్ట్ వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తున్న హనుమాన్‌జంక్షన్ ఎస్సై ఏడీఎల్ జనార్దన్ కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.13.95లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన వ్యక్తి విజయవాడ వెళుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో నగదు తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకుని, తహసీల్దార్, ఇన్‌కంట్యాక్స్ వారికి సమాచారం ఇచ్చినట్టు ఎస్సై జనార్ధన్ తెలిపారు.

డీఎస్సీ పోస్టులు పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలి: డీవైఎఫ్ఐ

వన్‌టౌన్: డీఎస్సీ పోస్టులు పెంచి మెగా డీఎస్సీ ప్రకటించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి.రామన్న బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దాదాపు 10 లక్షల మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని, అయితే బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో కేవలం 6,100 పోస్టుల భర్తీకి మాత్రమే ఆమోదం తెలిపారన్నారు. డీఎస్సీ కోసం నాలుగున్నరేళ్లుగా డీవైఎఫ్ఐ పలు రూపాల్లో ఆందోళనలు చేసిందని, వేలాదిమందిపై అక్రమ కేసులు పెట్టారేగానీ, డీఎస్సీని ప్రకటించలేదన్నారు. ఈ ఏడాది జూన్ నాటికి పదవీ విరమణ చేయనున్న ఉపాధ్యాయుల సంఖ్య దృష్టిలో పెట్టుకుని పోస్టులు పెంచాలన్నారు.

ఆడుదాం ఆంధ్రలో తొండాట..!

● బయట ఆటగాళ్లను అడ్డుకున్న తిరువూరు టీమ్

విజయవాడ స్పోర్ట్సు: ఆడుదాం ఆంధ్రను తప్పిదాల ఆంధ్రగా మార్చేస్తున్నారు. ఈ పోటీలు చివరి దశకు చేయడంతో లక్షల్లో ప్రైజ్‌మనీ దక్కించుకునే క్రమంలో అడ్డదారులు తొక్కడం నగరంలో తీవ్ర సంచలనమైంది. ప్రైజ్‌మనీ రేసులో తమ టీమ్ ఉండాలనే విధానంతో తెరవెనుక కొంతమంది ఆటగాళ్లను మార్చేయడం బుధవారం ఐజీఎంసీ స్టేడియంలో వివాదానికి దారి తీసింది. తిరువూరు-విజయవాడ సెంట్రల్ జట్ల మధ్య సెమీస్ మ్యాచ్‌లో సెంట్రల్ టీమ్‌లో అసలు క్రీడాకారులకు బదులుగా ముగ్గురు బయట వ్యక్తులతో ఆడించడానికి ప్రయత్నాలు జరిగాయి. అనుమానం వచ్చిన వేమిరెడ్డిపాలెం సర్పంచ్ వారి ఆధార్ కార్డులు, వివరాలు అడగ్గా నీళ్ల నలమడంతో అవకతవకలు జరుగుతున్నాయనే గ్రహించిన టీమ్ అంతా విషయాన్ని ఉన్నతస్థాయిలోకి తీసుకెళ్లడంతో సర్దుకున్న అంపైర్లు చివరకు అసలైన ప్లేయర్లను రంగంలోకి దింపారు.

రేపు ఎడ్యుకేషన్ ఫెయిర్

లబ్బీపేట: అజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు అజంట్ నగర శాఖ మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. బందర్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఎడ్యుకేషన్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునేవారు వివిధ విశ్వవిద్యాలయాల గురించి ఈ ఫెయిర్‌లో తెలుసుకోవచ్చన్నారు. బందర్ రోడ్డులోని స్వీట్ మ్యాజిక్ పక్కన గల సంస్థ కార్యాలయంలో 2న ఉదయం 11 గంటల నుంచి జరుగుతుందన్నారు.

ఈ-లాటరీ 7కు వాయిదా

కృష్ణలంక: సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకు అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్య స్థలాలు భూ సేకరణలో ఉండి పూర్తికానందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు జనవరి 31 జరగాల్సిన నెక్కల్లు, నిడమర్రు గ్రామాలకు సంబంధించిన మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 7కు వాయిదా వేస్తున్నట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2సార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరుకానందున మరో అవకాశం ఫిబ్రవరి 7న బుధవారం ఉదయం 11గంటలకు వెలగపూడి, మధ్యాహ్నం 12.30గంటలకు ఉద్దండరాయునిపాలెంలో లాటరీ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

కేంద్ర నిధులు సకాలంలో ఖర్చు చేయండి: సీఎస్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు సకాలంలో ఖర్చు చేసి, మరిన్ని నిధులు రాబట్టేందుకు తగిన ప్రయత్నాలు చేయాలని రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై నిర్వహించిన సమీక్షలో సీఎస్ మాట్లాడుతూ.. వివిధ పథకాలకు కేటాయించిన నిధులను వేగవంతంగా ఖర్చు చేయడం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టేందుకు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు ఢిల్లీలోని ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్రం నుంచి రాష్ట్రానికి విడుదలైన నిధులు, ఇంకా రావాల్సిన నిధులు తదితర వివరాలను వివరించారు.

జూడో సంఘం వినతిపై నిర్ణయం తీసుకోండి

» భారత జూడో సమాఖ్యకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తమనే అసలైన సంఘంగా గుర్తించేలా భారత జూడో సమాఖ్య (జేఎఫ్ఐ)ను ఆదేశించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ పవన్ సందీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు.. కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), రాష్ట్ర క్రీడలు, యువజన మంత్రిత్వశాఖ ముఖ్యకార్యదర్శి, జేఎఫ్ఐ.. తదితరులకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది. ఈ లోపు పిటిషనర్ సమర్పించిన వినతిపై నిర్ణయం తీసుకోవాలని జేఎఫ్ఐ అడ్మినిస్ట్రేటర్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి ఎన్.జయసూర్య జనవరి 29న ఉత్తర్వులు ఇచ్చారు.

హయగ్రీవ భూముల రద్దుపై సమయం ఇవ్వండి

» హైకోర్టును అభ్యర్థించిన రాష్ట్ర సర్కారు.. అంగీకరించిన ధర్మాసనం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ సంస్థకు కేటాయించిన భూముల రద్దుపై తగిన నిర్ణయం తీసుకొనేందుకు మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును అభ్యర్థించింది. గడువు పొడిగించాలని కోరుతూ అప్లికేషన్ దాఖలు చేశామని, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నిర్ణయాన్ని కోర్టు ముందు ఉంచేందుకు నాలుగువారాల సమయం ఇవ్వాలని రెవెన్యూశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది సుభాష్ ధర్మాసనానికి వివరించారు. ఈ వివరాలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. విశాఖజిల్లా, చినగదిలి మండలం, ఎండాడ గ్రామం పరిధిలోని సర్వే నెం.92/3లోని హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ కేటాయించిన 12.50 ఎకరాలను వెనక్కి తీసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా.. అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన భూముల్లో చేపట్టిన నిర్మాణాలపై థర్డ్ పార్టీకి హక్కులు కల్పించవద్దని హయగ్రీవ సంస్థను హైకోర్టు ఆదేశించింది. భూ కేటాయింపు నిబంధనలు ఉల్లంఘన ఆరోపణలు నేపథ్యంలో హయగ్రీవ సంస్థకు కేటాయించిన 12.50 ఎకరాల రద్దు విషయంలో నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శికి స్పష్టం చేసింది. సొంత రిస్క్ పై నిర్మాణాలు చేపట్టవచ్చని హయగ్రీవ సంస్థకు స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె.ఎస్ మూర్తి, న్యాయవాది టి.వేణుగోపాల్ వాదనలు వినిపించారు.

వ్యాజ్యం పిల్ స్వభావం కలిగి ఉంది

» విచారణ నిమిత్తం సీజే ధర్మాసనం ముందుకు.. సింగిల్ జడ్జి ఆదేశం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏపీ లా ఆఫీసర్స్ నియామక నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా విశాఖ, నెల్లూరు మినహా ఆంధ్ర ప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలటీల స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎం.మనోహర్‌రెడ్డిని నియమించి అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ తన హోదాను దుర్వినియోగం చేశారని పేర్కొంటూ హైకోర్టు న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మనోహర్‌రెడ్డి నియమకాన్ని రద్దు చేసి, ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ ఎం.మనోహర్‌రెడ్డి అక్రమాల పై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. పిటిషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం స్వభావం కలిగి ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. పిటిషన్‌ను విచారణ నిమిత్తం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ఒకరికి బదులుగా మరొకరు!

» న్యాయాధికారికి దొరికిపోయిన నకిలీ జామీనుదారులు

కనిగిరి, జనవరి 31: ఒకరికి బదులు మరొకరు జామీనుదారులుగా హాజరై.. న్యాయాధికారికి దొరికిపోయిన సంఘటన ప్రకాశం జిల్లా కనిగిరి జూనియర్ సివిల్ కోర్టులో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో న్యాయవాదితో పాటు జామీనుదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమంతుని పాడు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసుకు సంబంధించి గతంలో ఒంగోలు ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి బెయిల్ మంజూరు చేశారు. ఆ కేసులో జామీనుదారులుగా గుంటూరు జిల్లాకు చెందిన షేక్ జానీ, వేముల శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, కమలమ్మ ఉన్నారు. వీరిని ఒంగోలుకు చెందిన లాయర్ కృష్ణారావు తన గుమస్తా ద్వారా కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన జామీనుదారుల పత్రాలను గుమస్తా కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించిన న్యాయాధికారి భరత్‌చంద్రకు అనుమానం వచ్చింది. దీంతో జామీనుదారుల్లో ఒకరైన జానీని న్యాయాధికారి ప్రశ్నించగా.. ఆ జామీను పత్రాలు తనవి కావని, తాను కేవలం వేలిముద్రలు మాత్రమే వేశానని అంగీకరించాడు. దీనిని గమనించిన మిగతా ముగ్గురు నకిలీ జామీనుదారులు కోర్టు హాలు నుంచి బయటకు ఉడాయించారు.

పదేళ్ల తర్వాత ఐబీ సర్టిఫికెట్

» ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పదేళ్ల తర్వాత సర్టిఫికెట్లు జారీ చేయబోయే ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ) సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్‌ను అమలు చేసేందుకుగాను సీఎం జగన్ సమక్షంలో బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఐబీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 1 నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలను ఐబీతో ఏకీకృతం చేస్తామని చెప్పారు. భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశలో పాఠశాలల సందర్శన, నివేదిక తయారీ ఉంటుందని విద్యాశాఖ తెలిపింది. జూలైలో ప్రారంభమయ్యే రెండో దశలో ఉపాధ్యాయులు, అధికారులకు శిక్షణ ఇస్తారని వివరించింది. 2025 నుంచి 1వ తరగతిలో ఐబీ సిలబస్ ప్రారంభమవుతుందని, ఏటా ఒక తరగతి చొప్పున 2035 నాటికి పదో తరగతికి చేరుతుందని తెలిపింది.

నితీశ్ దారిలో మరికొన్ని పార్టీలు!

» బీజేపీ సీనియర్ నేత వెల్లడి..తమిళనాడు నుంచి మోదీ పోటీ?

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జేడీయూ అధినేత నితీశ్ కుమార్ దారిలో మరికొన్ని పార్టీలు మళ్లీ బీజేపీతో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నాయి! ఈ మేరకు ఆయా పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని బీజేపీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. పంజాబ్‌కు చెందిన అకాలీదళ్ కూడా తమతో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్నదన్న ఆయన.. కర్ణాటకలో జేడీఎస్ ఇప్పటికే తమతో కలిసి పోటీ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం దక్షిణాదికి చెందిన ఒకటి, రెండు పార్టీలతో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 9న పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఏ రోజైనా ఎన్నికల షెడ్యూలు ప్రకటించవచ్చన్న సంకేతాలు అందాయని.. సాధ్యమైనంత త్వరలో ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా.. దక్షిణాది రాష్ట్రాల్లో అధిక సీట్లు సాధించడంపై దృష్టి సారించిన ప్రధాని మోదీ.. సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, రామనాథపురం, కన్యాకుమారి సీట్లలో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయవచ్చని సమాచారం.

తమిళనాడులో సీఏఏను అనుమతించే ప్రసక్తే లేదు

చెన్నై, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను అనుమతించే ప్రసక్తే లేదని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. "రాష్ట్రంలో సీఏఏ అమలును ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోం. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కూటమి పార్టీలతో కలిసి భారీ ఆందోళనలు చేపట్టడంతో పాటు రెండు కోట్ల సంతకాలు సేకరించి రాష్ట్రపతికి పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నా. 2021లో మేం అధికారం చేపట్టిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలంటూ రాష్ట్ర శాసనసభలో తీర్మానం నెరవేర్చాం" అని స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.

విషమ 'పరీక్ష'!

ప్రాక్టికల్స్ కోసం పది కిలోమీటర్లు

» హైస్కూల్ ప్లస్ విద్యార్థినులకు ఇక్కట్లు

» ల్యాబ్స్ లేకుండానే సెకండియర్ పరీక్షలు

» వేరే కాలేజీకి వెళ్లాలని సర్కారు సలహా

"ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేశాం. విద్యను రాజకీయంగా చూడకుండా వేల కోట్లు ఖర్చు చేశాం. ప్రభుత్వ బడులను చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారు. పేదల పిల్లలను ప్రపంచ స్థాయి విద్యార్థులుగా పోటీపడేలా చేసే విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గను. రాష్ట్రంలో ఏ బడికైనా వెళ్లి అభివృద్ధిని చూడొచ్చు".. సరిగ్గా నాలుగు రోజుల కిందట ఇండియా టుడే నిర్వహించిన విద్యా సదస్సులో సీఎం జగన్ మాటలివి. కానీ మరో పది రోజుల్లో హైస్కూల్ ప్లస్‌లలో చదివే విద్యార్థినులకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ కోసం పది కిలోమీటర్లు వెళ్ళాల్సిన దుస్థితి రాబోతోందని తెలుసా? అదీ.. ప్రాక్టీసు లేకుండానే ప్రాక్టికల్స్‌కు హాజరవ్వాల్సిన విషమ పరీక్షను ఎదుర్కొంటున్నారని తెలుసా??.. అవును ఇది ముమ్మాటికీ నిజం!



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బడుల రూపురేఖలు మార్చామన్న సీఎం జగన్ పాలనలో ఎన్నెన్నో లొసుగులు. అయినా వాటన్నిటినీ కప్పిపుచ్చి డప్పాలు కొట్టడం వైసీపీ సర్కారుకు అలవాటైపోయింది! ఈ కోవలోనిదే హైస్కూల్ ప్లస్ చదువులు! ఎలాంటి ముందస్తు ఆలోచనా లేకుండా, ప్రచారం కోసం హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించడంతో.. సక్రమంగా చదువులు సాగక విద్యార్థులు ఇక్కడ ఎందుకు చేరామా? అని కుమిలిపోవాల్సి వస్తోంది. ఇప్పుడు ప్రాక్టికల్స్ కోసం పది కిలోమీటర్ల దూరానికి పైగా ఉన్న వేరే కాలేజీలకు వెళ్లాల్సి వస్తోంది. సరైన ప్రాక్టీస్ లేకుండానే నేరుగా ప్రాక్టికల్స్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లి అక్కడ ప్రాక్టికల్స్ చేయించాలని తాజాగా ప్రభుత్వం ఆదేశించడంతో ఈ దుస్థితి తలెత్తింది.

అంతా రాజకీయ ప్రాపకమే!

ప్రతి మండలంలో ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుచేస్తామని సీఎం జగన్ గతంలో హామీ ఇచ్చారు. దాని అమలు కోసం కొత్త కాలేజీలు కట్టించాల్సి ఉండగా, నిధులు ఖర్చు చేయకుండా తప్పించుకునే మార్గాన్ని ఎంచుకున్న ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ అనే విధానం తెచ్చింది. ఏ మండలంలో అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదో అక్కడ ఓ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్‌ను బాలికల కోసం ప్రారంభించింది. 2022-23 విద్యా సంవత్సరంలో 292 ఉన్నత పాఠశాలల్లో ఇలాంటి ఇంటర్ ఫస్టియర్ మొదలైంది. మొదటి ఏడాది 3వేల మంది విద్యార్థినులు చేరారు. హడావుడిగా ప్రారంభించేసిన సర్కారు బోధన ఎవరు చేయాలనేదానిని గాలికొదిలేసింది. తాత్కాలికంగా పాఠశాల టీచర్లతోనే బోధన చేయించింది. దీంతో ఫస్టియర్ చదివిన విద్యార్థులు దారుణంగా నష్టపోయారు. 15శాతం దాటి ఉత్తీర్ణులు కాలేదు. ఈ విధానం అట్టర్ ఫ్లాప్ కావడంతో అందులో ఫలితాలను ప్రభుత్వం బయటపెట్టకుండా దాచిపెట్టింది. తీరా మొదటి సంవత్సరం అయిపోయాక అప్పుడు అక్కడ ఇంటర్ బోధనకు పూర్తిస్థాయి టీచర్లను కేటాయించారు. కానీ మౌలిక సదుపాయాలను మాత్రం కల్పించలేదు.

ఆ కాలేజీల్లో సాధ్యమయ్యేనా?

రాష్ట్రంలో 474 ప్రభుత్వ జూనియర్ కాలేజీలుంటే, వాటిలో సైన్స్ ల్యాబ్స్ అతంతమాత్రంగానే ఉన్నాయి. ఫిబ్రవరి 11 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతాయి. ఎంపీసీ విద్యార్థులకు రెండు రోజులు, బైపీసీ విద్యార్థులకు నాలుగు రోజులు ప్రాక్టికల్స్ ఉంటాయి. హైస్కూల్ ప్లస్‌లలో చదువుతున్న విద్యార్థినులు ఆ ప్రాక్టికల్స్ కోసం సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వెళ్లేలా అధికారులు మ్యాప్ చేశారు. పది కిలోమీటర్ల లోపులో ఉన్న కాలేజీలను మ్యాపింగ్ చేసినట్లు చెబుతున్నారు. అయితే చాలాచోట్ల పది కిలోమీటర్లు దాటి ప్రాక్టికల్స్ వెళ్లాల్సి వస్తోందని అర్థమవుతోంది. ఎందుకంటే ఎక్కడైతే ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదో అక్కడే హైస్కూల్ ప్లస్ పెట్టారు. అంటే ఆ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేదని అర్థం. మరోవైపు సెకెండియర్‌లో విద్యార్థులు ప్రాక్టికల్స్ కోసం పదే పదే ప్రాక్టీసు చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రాక్టీసు లేకుండానే నేరుగా ప్రాక్టికల్స్‌కు వెళ్తున్నారని తెలుస్తోంది. ఇంతవరకు ఒకెత్తయితే.. సమీప కాలేజీకి వీరిని తీసుకెళ్లినా అక్కడి విద్యార్థులకూ ప్రాక్టికల్స్ ఉంటాయి. అలాంటప్పుడు అందరూ ఒకేసారి ప్రాక్టికల్స్ చేయడం ఎలా సాధ్యమవుతుందో మరి.

సీఎం సభకేనా నిధులు... ల్యాబ్స్‌కు ఇవ్వలేరా?

జగన్ ప్రభుత్వం ఇంటర్ విద్యామండలి నిధులను ఇష్టానుసారం వాడేసుకుంది. నాడు-నేడుకు దాదాపు రూ.200 కోట్లు ఇచ్చింది. 2022లో బాపట్లలో జరిగిన ఇంటర్ విద్యాశాఖకు సంబంధం లేని సీఎం సభకు మాత్రం ఆగమేఘాలపై రూ.25లక్షలు ఇచ్చింది. ఉన్నత విద్య కమిషన్ భవనం మరమ్మతులకూ నిధులు ఇచ్చింది. విద్యార్థులు కట్టే ఫీజుల నుంచి వచ్చిన నిధులను ఇలా ఎడాపెడా వాడేసిన ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లలో ల్యాబ్స్‌కు సొంత నిధులు ఇవ్వకపోగా ఇంటర్ బోర్డు నుంచి కూడా నిధులు ఇవ్వలేదు. దీంతో సరైన బోధన లేక, ఇప్పుడు ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గుతాయేమోనని అక్కడ చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి చేర్పించామని ఆవేదన చెందుతున్నారు.

విదేశాల్లోని తెలుగువారికి 28 రకాల ఉచిత సేవలు!

» ఏపీఎన్ఆర్‌టీఎస్ వెల్లడి

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగువారికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్స్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) ద్వారా 28 రకాలకుపైగా సేవలను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి తెలిపారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏపీఎన్ఆర్‌టీఎస్ పని చేస్తోందని చెప్పారు. గత నాలుగేళ్లలో 2.55 లక్షల మంది ప్రవాసాంధ్రులు ఈ లబ్ధి పొందినట్లు తెలిపారు. ఆయా దేశాల్లోని 30కిపైగా భారత దౌత్య కార్యాలయాలు, 130కి పైగా ఎన్ఆర్ఐ తెలుగు అసోసియేషన్లతో సమన్వయం చేసుకుంటూ 200 మందికి పైగా కో-ఆర్డినేటర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారన్నారు. విదేశాల్లో చనిపోయిన 1,077 మంది మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురావడానికి అంబులెన్స్ సేవలను అందించామని తెలిపారు. విదేశాల్లో చనిపోయిన 489 మంది కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేశామన్నారు. కొవిడ్, యుద్ధాల సమయంలో స్వస్థలాలకు సురక్షితంగా వచ్చేందుకు సౌకర్యాలు కల్పించామని వివరించారు. వైవాహిక, కుటుంబ తగాదాల 1,730 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. విద్యావాహిని పథకం ద్వారా 3,118 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. ప్రవాసాంధ్రులకు రాష్ట్రంలోని 8 ప్రముఖ దేవాలయాల్లో వీఐపీ దర్శనాలు చేయిస్తున్నామని, టీటీడీ సహకారంతో ఆయా దేశాల్లో శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సంస్థ హెల్ప్‌లైన్ 0863 2340678, వాట్సప్ నెంబరు 8500027678 కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌టీఎస్ సీఈవో హేమలతారాణి, డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు

3న సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంధాయక్' ప్రారంభం



విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సర్వేనౌక ఐఎన్ఎస్ సంధాయక్ ఈ నెల 3నుంచి భారత నావికాదళంలో సేవలు అందించనుంది. కోల్‌కతాలో నిర్మించిన ఐఎన్ఎస్ సంధాయక్‌ను 3న విశాఖ నేవల్ డాక్‌యార్డులో కమిషనింగ్ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకాదళం అధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ హాజరుకానున్నారు. ఐఎన్ఎస్ సంధాయక్ తయారీకి 80% దేశీయ పరికరాలు వినియోగించారు. 110మీటర్ల పొడవు, 3,800 టన్నుల బరువు, 2డీజిల్ ఇంజన్లతో పనిచేసే ఈ నౌక గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. నిరంతరం ప్రయాణిస్తూ 25 రోజులు సముద్రంలో ఉండగల సామర్థ్యం ఉంది. ఇదే పేరుతో గతంలో ఉన్న నౌక 2021 జూన్ 4న సేవలు విరమించిన తర్వాత మరింత ఆధునికంగా అదే పేరుతో మరొక నౌకను తయారు చేశారు. హిందూ మహాసముద్రం ప్రాంతంలో ఇతర దేశాల సర్వేలకు దీన్ని ఉపయోగించనున్నారు.

స్మార్ట్ మీటర్ల యోచన విరమించుకోండి

» ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో వక్తల డిమాండ్


» ముగిసిన ఏపీ ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గృహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలని, విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న ఇతర భారాలనూ రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థలు సమర్పించిన ఆదాయ అంచనాల ప్రతిపాదనలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారంతో ముగిసింది. విశాఖపట్నం ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 20 మంది పాల్గొని తమ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. వీటిపై చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ఈఆర్‌సీ పరిధిలోని అంశాలపైనా చాలామంది మాట్లాడారని, వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని చెప్పారు. అభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలపై విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు పృథ్వీతేజ్, కె.సంతోష్‌రావు, ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్ వివరణలు ఇచ్చారు. ట్రాన్స్‌కో జేఎండీ, జెన్‌కో ఎండీ చక్రధరబాబు విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను వినిపించారు. విద్యుత్ చట్టం 2003కు అనుగుణంగా ప్రభుత్వం ఆయా రంగాల వినియోగదారులకు రాయితీపై విద్యుత్ అందించేందుకు నిధులు కేటాయిస్తుందన్నారు.



విశాఖపట్నంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి

అడవుల్లో అన్నల సొరంగాలు



» డ్రోన్ కెమెరాల నుంచి తప్పించుకునే ఎత్తుగడ

» దంతెవాడలో 130 మీటర్ల సొరంగం గుర్తింపు

చర్ల, జనవరి 31: సినిమాల్లో విలన్లు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అడవుల్లో సొరంగాలు, డెన్‌లలో ఉండడం చూసే ఉంటారు. ఇప్పుడు మావోయిస్టులు కూడా అచ్చంగా అలాంటి వ్యూహాన్నే అనుసరిస్తున్నారు. కూంబింగ్ సమయంలో, నిఘాలో భాగంగా పోలీసులు డ్రోన్ కెమెరాలను వాడడం పెరిగినప్పటి నుంచి.. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో ఈ తరహాలో భారీ ఎత్తున టన్నెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దంతెవాడ జిల్లా భైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో.. ఇంద్రావతి నది సమీపంలో ఇలాంటి ఓ సొరంగాన్ని సీఆర్పీఎఫ్, డీఆర్జీ జవాన్లు బుధవారం గుర్తించారు. ఆ వివరాలను దంతేవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. "బుధవారం ఉదయం దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేత మల్లేశ్‌తోపాటు.. 25-30 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు సమాచారం అందింది. డీఆర్జీ, సీఆర్పీఎఫ్ జవాన్లు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. పోలీసుల అలజడిని గుర్తించి, వారు పరారైనట్లు తెలుస్తోంది. అయితే.. డీఆర్జీకి చెందిన ఓ జవాను మావోయిస్టుల టన్నెల్‌ను తొలుత గుర్తించాడు" అని ఆయన వివరించారు. ఈ ప్రాంతం తెలంగాణకు సమీపంలో ఉండడం గమనార్హం.! దంతెవాడ పోలీసులు ఆ సొరంగాన్ని ధ్వంసం చేశారు. 10 అడుగుల లోతులో ఉన్న ఆ సొరంగంలో ఏకకాలంలో 100 మంది వరకు మావోయిస్టులు తలదాచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 130 మీటర్ల పొడవున్న ఆ సొరంగంలో.. ప్రతీ ఆరు మీటర్లకు ఒకటి చొప్పున వెంటిలేటర్లు ఉన్నాయి. గతంలోనూ ఈ తరహా సొరంగాలు వెలుగులోకి వచ్చినట్లు విశ్రాంత ఐపీఎస్ అధికారి, యాంటీ-నక్సల్స్ ఆపరేషన్స్ స్పెషల్ డీజీ ఆర్కే విజ్ పేర్కొన్నారు. 2012లో బీజాపూర్‌లో 80 మీటర్ల సొరంగం బయటపడిందని, బీజాపూర్ జిల్లా కేరపర్‌లో బయటపడ్డ మరో టన్నెల్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి తలదాచుకునేవాడని చెప్పారు. అబుజ్‌మడ్ ప్రాంతంలోనూ సొరంగాలు వెలుగు చూశాయని వివరించారు.

లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జీఎస్‌టీవో



ఏసీబీకి పట్టుబడిన జీఎస్‌టీవో కిషోర్‌కుమార్

పలాస, జనవరి 31: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్ర పన్నులశాఖ) కార్యాలయంలో పనిచేస్తున్న జీఎస్‌టీవో ఎన్.కిషోర్‌కుమార్ రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మున్సిపాలిటీకి చెందిన సిందిరి శ్రీనివాసరావు భార్య శిరీష పేరుమీద ఉన్న జీడిపప్పు వ్యాపారానికి సంబంధించి జీఎస్‌టీతో పాటు పన్నులు చెల్లిస్తున్నారు. జీఎస్‌టీవో కిషోర్‌కుమార్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జరిమానా విధించకుండా ఉండడానికి లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం రూ.లక్ష శ్రీనివాసరావు నుంచి తీసుకుంటుండగా కిషోర్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. విశాఖపట్నం ఏసీబీ ప్రత్యేక కోర్టులో గురువారం ఆయన్ను హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

తండ్రి ఆటో కిందపడి బాలుడి మృతి

గుడివాడ రూరల్, జనవరి 31: తండ్రి ఆటో కింద పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కృష్ణాజిల్లా గుడివాడ మండలం మోటూరు గ్రామంలో బుధవారం జరిగింది. ఆటో డ్రైవర్ వరిగంజి మురళీకృష్ణ ఇంటివద్ద మధ్యాహ్నం 2గంటల సమయంలో ఆటో రివర్స్ చేస్తుండగా, అక్కడే ఆడుకుంటూ ఉన్న కుమారుడు రిషిక్ (4) ప్రమాదవశాత్తు వెనుక టైరు కిందపడి తీవ్ర గాయాలపాలై మరణించాడు.

అటవీశాఖ ముఖ్య దళాధికారిగా చిరంజీవ్ చౌదరి

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవ్‌చౌదరిని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ (ముఖ్య దళాధికారి)గా ప్రభుత్వం నియమించింది. కొద్దిరోజులుగా చిరంజీవ్ చౌదరి ఈ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా, ఇప్పుడు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి రోణంకి కూర్మనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

15 సూత్రాల అమలు కమిటీ రాష్ట్ర సభ్యునిగా అలీఖాన్

మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల అమలు కమిటీ రాష్ట్ర సభ్యునిగా ఖాలిక్ అలీఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఇంతియాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఎస్ ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో కాంట్రిబ్యూషన్ జమ చేయండి

» మంత్రి బుగ్గనకు ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వినతి

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు ప్రాన్ ఖాతాల్లో జమ కావాల్సిన కాంట్రిబ్యూషన్ సొమ్మును వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రామాంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

ప్రతిపక్షాలతో సంబంధముందని ఒప్పుకోవాలంటూ చిత్రహింసలు

» కోర్టుకు తెలిపిన పార్లమెంట్ ఘటన కేసు నిందితులు

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రతిపక్ష పార్టీలతో సంబంధముందని ఒప్పుకోవాలంటూ ఢిల్లీ పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారంటూ పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన కేసు నిందితులు బుధవారం కోర్టుకు తెలిపారు. ఈమేరకు అదనపు సెషన్స్ కోర్టు జడ్జి హర్దీప్‌కౌర్ ముందు పిటిషన్ సమర్పించారు. దీనిపై పోలీసుల సమాధానం కోరిన కోర్టు.. విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.

ఇజ్రాయెల్‌కు 10వేల మంది భారత కార్మికులు

జెరూసలెం, జనవరి 31: ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్ నిర్మాణ రంగంలో కార్మికుల సంక్షోభం తీవ్ర స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ఈ దేశానికి భారత్ నుంచి త్వరలో 10వేల మంది కార్మికులు రానున్నట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే వారం నుంచి వీరి రాక మొదలవుతుందని చెబుతున్నారు. వారానికి 700 నుంచి 1,000 మంది చొప్పున ఈ 10 వేల మంది వర్కర్లు వస్తారని ఇజ్రాయెల్ బిల్డర్స్ అసోసియేషన్ (ఐబీఏ) వర్గాలు చెబుతున్నాయి.



సీఐ అప్పన్నకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు ఎద్దు లక్ష్మి

వృద్ధురాలికి వలంటీర్ల టోకరా

» బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు కాజేత

» సర్వే పేరుతో వృద్ధురాలి ఇంటికి వలంటీర్లు

» వివరాల సేకరణ తర్వాత వేలి ముద్రల నమోదు

ఎస్.రాయవరం, జనవరి 31: కుల గణన సర్వే పేరుతో ఓ వృద్ధురాలి వేలి ముద్రలు తీసుకున్న వలంటీర్లు.. ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.పది వేలు కాజేసిన సంఘటన అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జేవీపాలెంలో జరిగింది. ఈ ఘటనపై ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జేవీ పాలెంలోని ఎద్దు లక్ష్మి (60) ఇంటికి 21వ తేదీన నడిగట్ల శ్రీను, పీలా సూర్య గణేశ్ అనే వలంటీర్లు వెళ్లి కాపు నేస్తం, కులగణన సర్వే కోసం వచ్చామని చెప్పారు. ఆమె నుంచి వివరాలు సేకరించాక.. వేలి ముద్రలు తీసుకుని వెళ్లిపోయారు. కాగా, నిర్మాణంలో ఉన్న తన ఇంటికి పీఎం ఆవాస యోజన కింద డబ్బులు జమయ్యాయే లేదో తెలుసుకునేందుకు 30వ తేదీన ఎలమంచిలిలో ఉన్న గ్రామీణ వికాస బ్యాంకుకు లక్ష్మి వెళ్లింది. ఈ సందర్భంగా.. ఈ నెల 21న ఆమె ఖాతా నుంచి రూ.10 వేలు తీసినట్టు ఉందని బ్యాంకు సిబ్బంది చెప్పారు. దీంతో తన వేలి ముద్రలు తీసుకున్న వలంటీర్లపై అనుమానం వచ్చి ఆమె టీడీపీ నాయకుడు వజ్రపు శంకరరావు సహాయంతో బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వలంటీర్లను పిలిచి విచారిస్తున్నారు. ఇంకా కేసు నమోదు చేయలేదని ఎస్ఐ చెప్పారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన



జోడో యాత్రలో ధ్వంసమైన రాహుల్ కారు అద్దం

మాల్దా, జనవరి 31: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ తెలిపారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా పశ్చిమబెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. "మాకు సామాజిక న్యాయం కావాలి. మేము అధికారంలోకి రాగానే.. దళితులు, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజల సంఖ్యను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తాం" అని రాహుల్ తెలిపారు. కాగా, భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్‌గాంధీ కారు అద్దం ధ్వంసమైంది. "మాల్దాలో రాహుల్‌గాంధీని కలిసేందుకు చాలామంది తరలివచ్చారు. వారిలో ఓ మహిళ ఒక్కసారిగా కారు ముందుకు వచ్చింది. సడెన్‌గా బ్రేకులు వేయడంతో సెక్యూరిటీ సర్కిల్‌లో ఉపయోగించిన తాడు కారణంగా కారు అద్దం ధ్వంసం అయింది" అని కాంగ్రెస్ పేర్కొంది.

రాహుల్ వ్యాఖ్యలు అర్థరహితం: నితీశ్

పట్నా, జనవరి 31: 'కులగణన కేవలం నా ఆలోచన మాత్రమే. అది అందరికీ తెలుసు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ దానిని తమ ఘనతగా చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని బిహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. 'కాంగ్రెస్ ఒత్తిడితోనే బిహార్‌లో కులగణన జరిగిందంటూ రాహుల్ చేసిన ప్రకటన అర్థరహితం. వాళ్లు ఏమీ చేయడం లేదు. సీట్ల సర్దుబాటు గురించి కూడా మాట్లాడడం లేదు. ప్రతిపక్ష కూటమికి పెట్టిన 'ఇండియా' పేరు నా ఎంపిక కాదు. అది వాళ్లు సొంతంగా తీసుకున్న నిర్ణయం. ఇప్పుడు నేను ఎన్‌డీఏకి వచ్చేశాను. ఇక ఎక్కడికీ వెళ్లేది లేదు' అని నితీశ్ స్పష్టం చేశారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, ఆర్జేడీ నాయకులపై ఈడీ చర్యలపై ఆయన స్పందిస్తూ.. 'వాళ్లపై ఆరోపణలు ఉన్నాయి. ఈడీ తన పని తాను చేస్తుంది' అని అన్నారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 1 ఫిబ్రవరి 2024


ఐఐటీ జోధ్‌పూర్‌లో పీజీ డిప్లొమా

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీజీ డిప్లొమా ఇన్ డేటా ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 35 అకడమిక్ క్రెడిట్స్ నిర్దేశించారు. రిటెన్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ఆన్‌లైన్ సెషన్స్, ఇండస్ట్రీ నిపుణులతో మాస్టర్ క్లాసెస్, ఆన్‌లైన్ ల్యాబ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, మినీ ప్రాజెక్ట్ వర్క్‌లు, క్యాంపస్ ఇమ్మర్షన్ ప్రోగ్రామ్‌లు, అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఆసక్తి మేరకు ఎంటెక్‌లో జాయిన్ కావచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణులు; బీఎస్సీ/బీసీఏతోపాటు ఎమ్మెస్సీ/ఎంసీఏ పూర్తిచేసినవారు; ఏదేని మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం ఏడాది అనుభవం తప్పనిసరి.

- పీజీ డిప్లొమా పూర్తిచేసిన తరవాత ఎంటెక్‌లో చేరాలనుకొనేవారికి డిగ్రీ/పీజీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. బీఎస్సీ/ఎమ్మెస్సీ స్థాయిలో సైన్స్ సబ్జెక్టులు చదివి ఉండాలి. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.3,00,000
- **అడ్మినిస్ట్రేటివ్ ఫీజు:** రూ.15,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 3
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఫిబ్రవరి 10 నుంచి
- **వెబ్‌సైట్:** iitj.ac.in



తెలంగాణ గురుకులాల్లో ప్రవేశానికి
టీఎస్‌ఆర్‌జేసీ సెట్

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఆర్ఈఐఎస్)- ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(టీఎస్ఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలురకు 15, బాలికలకు 20 రెసిడెన్షియల్ కాలేజీలను ప్రత్యేకించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ గురుకులాల్లో ప్రవేశానికి ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు: యాదాద్రి భువనగిరి జిల్లాలోని సర్వేల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని బాలురకు, హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని బాలికలకు కేటాయించారు. ఒక్కోదానిలో ఎంపీసీ 88, బైపీసీ 60, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి. ఈ ఆర్‌జేసీల్లో ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ పోటీ పడవచ్చు.

- జిల్లాలకు నిర్దేశించిన మేరకు 33 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో బాలురకు, బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ఆర్‌జేసీలో ఎంపీసీ 40, బైపీసీ 40 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఈ ఏడాది మార్చిలో నిర్వహించే పదోతరగతి పరీక్షల్లో మొదటిసారే ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులు కనీసం 6 జీపీఏ సాధించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 జీపీఏ చాలు. అభ్యర్థులందరికీ ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీసం 4 జీపీఏ ఉండాలి. గత సంవత్సరాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ అభ్యర్థులకు ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ఇంగ్లీష్ అంటే జనరల్ ఇంగ్లీష్‌గా పరిగణిస్తారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ఎంపిక: టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024లో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని 1:5 నిష్పత్తిలో కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. స్థానికత, రిజర్వేషన్ నిబంధనలు, స్పెషల్ కేటగిరీ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 16
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 16 నుంచి
- **టీఎస్ఆర్‌జేసీ సెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 21
- **మొదటి కౌన్సెలింగ్:** మేలో
- **వెబ్‌సైట్:** http://tsrjdc.cgg.gov.in

విశాఖ ఐఐఎంలో పీహెచ్‌డీ



విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంవీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు గరిష్ఠంగా అయిదేళ్లలో ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, థీసిస్ వర్క్ ఉంటాయి.

స్పెషలైజేషన్లు: డెసిషన్ సైన్సెస్, ఎకనామిక్స్ అండ్ సోషల్ సైన్సెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజీ.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులు, నాలుగేళ్ల లేదా ఎనిమిది సెమిస్టర్ల బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారూ అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 డిసెంబరు 31 నాటికి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తులో యూజీసీ జేఆర్ఎఫ్ నెట్/సీఎస్ఐఆర్ నెట్/జీమ్యాట్/జీఆర్ఈ/గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా క్యాట్ 2023 స్కోర్/క్యాట్ 2023 రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా సూచించాలి.

- ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ, పీజీ స్థాయుల్లో సైన్స్/మేథమెటిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్ కోర్సులు చదివి ఉండాలి. స్ట్రాటజీ స్పెషలైజేషన్‌కు సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.

ఆర్థిక సహకారం: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; మూడో ఏడాది నుంచి నెలకు రూ.42,000 స్టయిపెండ్‌గా ఇస్తారు. యూజీసీ నిబంధనల ప్రకారం కంటింజెన్సీ గ్రాంట్, హెచ్ఆర్ఏ ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.3,00,000; నేషనల్ కాన్ఫరెన్స్ గ్రాంట్ కింద రూ.60,000 చెల్లిస్తారు.

- అభ్యర్థులు ఏవేని రెండు స్పెషలైజేషన్లకు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 21
- **కాల్ ఫర్ పర్సనల్ ఇంటర్వ్యూ:** ఏప్రిల్ 21న
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 13 నుంచి 17 వరకు
- **అడ్మిషన్ ఆఫర్:** మే 28
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్ తేదీ:** జూన్ 24
- **వెబ్‌సైట్:** www.iimv.ac.in

జాబ్ కార్నర్

దక్షిణ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 2860

సదరన్ ఇండియన్ రైల్వే వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అప్రెంటిస్‌షిప్

వర్క్‌షాప్‌లు/యూనిట్‌లు: సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్(పొదనూర్, కోయంబత్తూర్); క్యారేజ్ అండ్ వేగన్(పెరంబూర్); రైల్వే హాస్పిటల్(పెరంబూర్), తిరువనంతపురం డివిజన్, పాలక్కడ్ డివిజన్, సాలెమ్ డివిజన్; లోకో(పెరంబూర్); ఎలక్ట్రికల్(పెరంబూర్); ఇంజనీరింగ్(అరక్కోణం), చెన్నై డివిజన్; మెకానికల్(డీజిల్), క్యారేజ్ అండ్ వేగన్ ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్(అరక్కోనం, ఆవడి, తాంబరం, రాయపురం), సెంట్రల్(పొన్నామలై), తిరుచిరాపల్లి డివిజన్, మధురై డివిజన్.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎంఎల్‌టీ, టర్నర్, సీఓపీఏ, ప్లంబర్, పీఏఎస్ఏఏ, ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, మెకానికల్, అడ్వాన్స్‌డ్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రెయినింగ్ పీరియడ్: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ ట్రేడులకు 15 నెలల నుంచి రెండేళ్లు, ఇతర ట్రేడులకు ఏడాది.

దరఖాస్తు ఫీజు: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in/

ఐఐటీ తిరుపతిలో టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతి...టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2(కాంట్రాక్ట్)
3. అసోసియేట్ ప్రొఫెసర్
4. ప్రొఫెసర్

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధన అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అసోసియేట్ ప్రొఫెసర్‌కు 45 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-1కు 38 ఏళ్లు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-2కు 35 ఏళ్లు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 29

వెబ్‌సైట్: https://iittp.ac.in/

ఏపీ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 255

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.... ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో రెగ్యులర్ ప్రాతిపదికన/లేటరల్ ఎంట్రీలో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం) ఉత్తీర్ణులై ఉండాలి.

స్పెషాలిటీ: అనస్థీషియా, డెర్మటాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, ఓబీజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్, రేడియో థెరపీ, టీబీ అండ్ సీడీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, ఆప్తల్మాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, పాథాలజీ, ఎస్‌పీఎం.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.1000. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 2

వెబ్‌సైట్: https://dme.ap.nic.in/

కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో స్పెషలిస్ట్, సైంటిస్ట్ పోస్టులు

ఖాళీలు 69

దేశ వ్యాప్తంగా వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు/శాఖల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. స్పెషలిస్ట్ గ్రేడ్-3: **40 పోస్టులు**
2. సైంటిస్ట్ 'బి': **28 పోస్టులు**
3. అసిస్టెంట్ డైరెక్టర్: **1 పోస్టు**

అర్హతలు: పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://upsc.gov.in/

ఎంఆర్‌పీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు

మంగళూరు(కర్ణాటక)లోని ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ- మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్(ఎంఆర్‌పీఎల్)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అసిస్టెంట్ ఇంజనీర్: 4 పోస్టులు

విభాగాలు: ఫైర్, సెక్రటేరియల్, సేఫ్టీ

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ(ఫైర్/ఫైర్ అండ్ సేఫ్టీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియాలో అసోసియేట్ మెంబర్‌షిప్, డిగ్రీతో పాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 27 సంవత్సరాలు మించరాదు.

దరఖాస్తు రుసుము: రూ.118. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10

వెబ్‌సైట్: www.mrpl.co.in/

ఎన్‌పీసీఐఎల్‌లో ట్రెయినీలు

ఖాళీలు 53

రావత్‌భట్ రాజస్థాన్ సైట్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్(డిప్లొమా): **49 పోస్టులు**
2. స్టయిపెండరీ ట్రెయినీ/సైంటిఫిక్ అసిస్టెంట్(సైన్స్ గ్రాడ్యుయేట్): **4 పోస్టులు**

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.150. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14

వెబ్‌సైట్: https://www.npcil.nic.in/index.aspx



లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ కోతి ముఖం చుట్టూ గుబురు గడ్డం ఉంటుంది. పెద్దతోక ఉంటుంది. దీన్ని 'లయన్ టైల్డ్ మకా'. సింహం తోకలా జుట్టు లేకుండా గట్టిగా తోక ఉంటుంది కాబట్టి ఈ పేరొచ్చింది. ఈ తోక పొడవు 25 సెం.మీ.
- బియర్డ్ మంకీ అని కూడా పిలుస్తారు. తినే ఆహారాన్ని దవడల మధ్య దాచుకుంటుంది. అవసరమైనపుడు తింటుంది.
- తలనుంచి తోక వరకు అరవై మూడు సెం.మీ ఉంటుంది. దీని బరువు పది కేజీల వరకు ఉంటుంది.
- పుట్టిన రెండు నెలల తర్వాత ముఖం చుట్టూ జుట్టు పెరగటం ఆరంభమవుతుంది.
- నల్లగా ఉండే కోతికి ముఖం చుట్టూ గ్రే జుట్టు వస్తుంది. గ్రే కలర్‌లో ఉండే కోతికి నల్ల జుట్టు ఉంటుంది.
- చెట్ల కొమ్మల మీదనే నివసిస్తాయి. అక్కడే పడుకుంటాయి.
- ఒక్కో గుంపులో ముప్పయ్ కోతులు ఉంటాయి. వీటిలో ఓ ఆల్ఫా మేల్ ఉంటుంది. అదే లీడర్‌గా పని చేస్తుంది. మగ కోతులు మాత్రం గ్రూపులు మారుస్తుంటాయి.
- ఈ లయన్ టైల్డ్ కోతులు కేవలం మనదేశంలోనే ఉన్నాయి. పశ్చిమ కనుమల్లో కనిపిస్తాయి.
- ఇవి పదిహేడు రకాలుగా శబ్దాలు చేస్తాయి. వాటి కమ్యూనికేషన్‌ను ఇతర కోతులు పర్ఫెక్ట్‌గా అర్థం చేసుకుంటాయి.
- పూలు, ఆకులు, పండ్లు తిని బతుకుతాయి. అగ్రెసివ్‌గా ఉంటాయివి.
- వీటి జీవనకాలం ఇరవయ్యేళ్లు.






5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



చుక్కలు కలిపి రంగులు వేయండి



డైలీ సుడోకు - 218

			1				7	8
	6		8	3		9		5
5					7		6	
					9	5		
3	7			1			9	6
		6	4					
	3		9					2
8		2		4	1		5	
6	1				5			

సుడోకు - 217 సమాధానం

5	9	6	4	3	2	7	1	8
4	3	1	9	7	8	6	2	5
8	2	7	1	6	5	3	4	9
9	7	4	3	5	1	8	6	2
1	6	2	8	9	7	5	3	4
3	8	5	2	4	6	1	9	7
7	5	3	6	2	9	4	8	1
2	4	8	5	1	3	9	7	6
6	1	9	7	8	4	2	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.